


తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 172 పేజీలు: 8+4 వెల: 6.50








మంగళవారం జైపూర్‌లో 'బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్' అవార్డును అందుకుంటున్న మంత్రి దుర్గేష్

# ఎపికి 'బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్' అవార్డు

## వివాహవేడుకల వేదికగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం: మంత్రి దుర్గేష్

**విజయవాడ.జూలై21,ప్రభాతవార్తప్రతినిధి:** రాజస్థాన్ లోని జైపూర్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్‌లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో అరుదైన గౌరవం దక్కింది. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు, ఈ రంగంలో కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు గాను ఏపీకి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు పురస్కారంలభించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖలమంత్రి కందుల దుర్గేష్ సోమవారం రాత్రి జైపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. కేంద్ర సహకారంతో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలోని ఎపి సర్కార్ పర్యాటకాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. "దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు ఏపీయే ఫేవరెట్ స్పాట్‌గా ఉండేలా చేస్తామన్నారు. అందమైన లోకేషన్లు.. అద్భుతమైన ఆతిథ్యంతో పాటు రాబోయే రోజుల్లో ఎపిని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

# జిఎస్టీ 28శాతానికి తగ్గించాలి

>> రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ముడి పొగాకుకు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జిఎస్టీ పెంపుకారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఎఫ్‌సివి పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిఎస్టీని 40 శాతంనుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈఅంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయంతీసుకోవాలని రాష్ట్రమంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు.

# ఆహార పెట్టుబడులు

>> నుంది.

**క్వాంటం స్పీడ్‌తో అవకాశాలు అందుకోండి.**

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో ఎపిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచిన యుఎఇ ఆరు నెలల్లోగా వాటిని సాకారం చేసే దిశగా ముందుకు వచ్చిందని సిఎం చంద్రబాబు అన్నారు. యుఎఇ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులకు ఎపి వేదిక కావటం సంతోషదాయకమని సిఎం వ్యాఖ్యానించారు. ఉద్యాన, ఆక్వా, ఐటీ రంగాల్లో ఎపి దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సిఎం వెల్లడించారు.

రాష్ట్రంలోని వైవిధ్యమైన వాతావరణ పరిస్థితుల కారణంగా యేడాది పొడవునా వివిధ రకాల ఉద్యాన ఉత్పత్తులు సాగు చేస్తున్నామని సిఎం చంద్రబాబు వివరించారు. రాష్ట్ర స్థూల ఆదాయంలో 30 శాతం మేర ఉద్యాన, వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా వస్తోందని చెప్పారు. రూ. 1లక్ష కోట్ల ప్రభుత్వం, ప్రైవేటు పెట్టుబడితో రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని తెలిపారు. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్టు సిఎం వివరించారు. 200కు పైగా ఉద్యాన క్లస్టర్లతో అక్వా మిర్చి, పామాయిల్, కోకో, కాఫీ తదితర పంటల్లో ఎపి ఎగుమతులు చేస్తోందని సిఎం యుఎఇ ప్రతినిధి బృందానికి వివరించారు. కృష్ణాగోదావరి డెల్టాలో నిరంతర నీటి సరఫరా కారణంగా వ్యవసాయ ఉత్పత్తి సాధించగలుగుతున్నామని తెలిపారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎపికి ఓ విధానంగా మారిపోయిందని తెలిపారు. ప్రగతిశీల విధానాల వల్ల దేశంలోని పెట్టుబడుల్లో 25 శాతం ఎపికి వచ్చాయన్నారు. పోర్టులు, రైల్వే, రోడ్డు వ్యవస్థతో ఎపి లాజిస్టిక్స్ కేంద్రంగా మారిందని అన్నారు. ఆగస్టు 1 తేదీ నుంచి ఏపీలో మరో అంతర్జాతీయ విమానాశ్రయం ఏపీలో అందుబాటులోకి వస్తోందని వివరించారు. విస్తృతమైన వనరులతో వివిధ రంగాల్లో విస్తృత వ్యాపార అవకాశాలను అందించేందుకు ఎపి సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి యుఎఇ బృందానికి తెలిపారు. క్వాంటం స్పీడ్‌తో అవకాశాలను అందిపుచ్చుకోవాలని కోరారు. పర్యావరణ అనుకూలంగా నిర్మిస్తున్న అమరావతిని మరో నివాసంగా మార్చుకోవాలని యుఎఇ ప్రతినిధులను సిఎం కోరారు.

**ఎపి యుఎఇ మధ్య ఫుడ్ కారిడార్..**

కృష్ణాగోదావరి లాంటి నదులున్న ఆంధ్రప్రదేశ్‌లో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని యుఎఇ ఎకానమీ, టూరిజం విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విజనరీ నేత సిఎం చంద్రబాబు నాయుడు అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. భారత్ యుఎఇ వాణిజ్య బంధంలో భాగంగా ఎపిలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా పని చేస్తున్నామని తెలిపారు. ఎపిలోని రొయ్యలు, అరటి లాంటి ఉద్యాన ఉత్పత్తులు వాణిజ్యంలో కీలకంగా ఉన్నాయని అన్నారు. ఎపిలో ఫుడ్ పార్క్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు వివరించారు.

ఫుడ్ ప్రాసెసింగ్, కోల్డ్ చైన్ సహా వివిధ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. సిఎం చంద్రబాబు వేగంగా నిర్ణయాలు తీసుకుంటూ 21 రోజుల్లోనే అనుమతులు ఇస్తూ వాణిజ్యాన్ని, పరిశ్రమల్ని ప్రోత్సహించటం సంతోషదాయకమని ఆయన ప్రశంసించారు. అమరావతి నుంచి న్యూయార్క్ మార్కెట్ వరకూ కు డెయిరీ, పౌల్ట్రీ, సీఫుడ్, పప్పు దినుసులు తదితర రంగాల్లో ఎగుమతులపై దృష్టి పెడతామని అన్నారు. కృష్ణపట్నం, కాకినాడ నుంచి యుఎఇకి షిప్పింగ్ రూట్లోనూ వాణిజ్యం మరింత పెరిగేందుకు సహకరిస్తామని యుఎఇ మంత్రి తెలిపారు.

ఎపి యుఎఇల మధ్య బంధం మరింత వేగంగా బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నట్టు అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ స్పష్టం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం కార్యక్రమంలో యుఎఇకి ఫుడ్ క్లస్టర్ చైర్మన్ సలేహ్, యుఎఇ సహాయ కార్యదర్శి మారియా అల్ ఖాసిమ్, స్పెషల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ అనూషా అల్ మర్జూఖీ, యుఎఇ ఎంబసీ నుంచి అహ్మద్ అల్ జ్నైబీ, ఎపి పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్, సిఎస్ సాయి ప్రసాద్, పరిశ్రమలు, ఇడిబి, ఆర్థికశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



మంగళవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌తో భేటీ అయిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు

# ఉపరాష్ట్రపతితో కేంద్ర, రాష్ట్ర మంత్రులు భేటీ

**శ్రీకాకుళం, జులై 21 ప్రభాతవార్త :** ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న పథకాలు, వ్యవసాయ రంగంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ సహకారం తదితర అంశాలను ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రగతి, రైతుల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగుతున్న తీరుపై ఈ సందర్భంగా చర్చ జరిగింది.

# పార్లమెంటులో మళ్లీ గందరగోళం

>> తిరిగి సమావేశం అయిన తర్వాత స్పీకర్‌స్థానంలో హాజరయిన దిలీప్‌సైకియా కూడా విపక్ష సభ్యులందరినీ వారివారి స్థానాల్లోకి వెళ్లి కూర్చోవాలని కోరారు. సభా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. దీనితోసభ్యులు వెనక్కి తగ్గకపోవడంతో సైకియా సభను బుధవారానికి వాయిదా వేసారు. సభలో ప్రశ్నోత్తరాలను చేపట్టాలని నిర్ణయించిన స్పీకర్‌కు అడుగడుగునా సభ్యులు అడ్డుతగిలారు. రాజ్యసభ కార్యక్రమాలు కూడా నిరంతరాయంగా అవాంతరాలతోనే నడిచాయి. మధ్యాహ్నం వరకూ వాయిదాపడిన తర్వాత తిరిగి సమావేశం అయినా నీట్‌పరీక్షల పేపర్ లీకేజీ, లాఠీఛార్జి, అయోధ్య విరాళాల చోరీ వంటి వాటిపై చర్చలు జరగాల్సిందేనంటూ పట్టుబట్టడంతో సభమరోసారి వాయిదాపడింది. తిరిగి మూడు గంటలకు సమావేశం అయినా కూడా ఎగువసభలో విపక్ష సభ్యులు అవే నినాదాలుకొనసాగించారు. ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలంటూ పట్టుబట్టారు. ఒకదశలో రాజ్యసభలో అధికార పక్ష సభ్యులు కూడా విపక్ష సభ్యుల ఆందోళనకు కౌంటర్‌గా నినాదాలుచేసారు. దీనితో సభా ధ్యక్షుడు ఉపరాష్ట్రపతి సిపిరాధాకృష్ణన్ సభను బుధవారానికి వాయిదా వేసారు. అంతకుముందు విపక్ష సభ్యులతో స్పీకర్ ఓంబిర్లా సమావేశం అయి సభసజావుగా సాగేందుకు సహకరించాలని, నీట్‌పై చర్చించేందుకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. సభా సమావేశాలకుముందు ఇండియా కూటమి నాయకులంతా ఖర్గే ఛాంబర్‌లో సమావేశం అయి ఉభసభలలో అధికార పార్టీని నిలదీయాలని నిర్ణయించారు. బుధవారం పార్లమెంటు కాంప్లెక్స్‌లోనే అజాద్ సమాజ్‌పార్టీ కాన్షీరామ్ విభాగం ఎంపి చంద్రశేఖర్ ఆజాద్ ఆకస్మిక నిరసనకు దిగారు. కేంద్రమంత్రి ధర్మేంప్రధాన్ రాజీనామాచేయాలని నిరసన తెలుపుతూ బైఠాయించారు. అలాగే పార్లమెంటు బయట ఆప్ ఎంపిలు కూడా నిరసన నిర్వహించారు. ఆప్ ఎంపి సంజయ్‌సింగ్ ఆధ్వర్యంలో పోలీసు లాఠీఛార్జికి నిరసనగా ఇతర పార్టీనేతలతోకలిసి నిరసన తెలిపారు.

### కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో

# మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

## ఎపి రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపై చర్చ

**విజయవాడ, జులై 21,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, పంటలకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లు, మార్కెటింగ్ సదుపాయాల బలోపేతం, రైతుల ఆదాయాన్ని పెంచే చర్యలు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి తదితర కీలక అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. సిఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సకాలంలో అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులకు సాగు సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవసాయ శాఖ పనిచేస్తోందని, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని వివరించారు.

# దేశంలోనే ఆదర్శంగా మంగళగిరి

>> ఈరోజుతో ఆ భయం పోతుంది, భూమిపై శాశ్వత హక్కును కూటమి ప్రభుత్వం కల్పిస్తుంది. సుమారు వెయ్యికోట్ల విలువైన భూమిని ఈరోజు అందిస్తున్నాం. మీ భూమిని ఇకపై కుటుంబ అవసరాలకు బ్యాంకులో పెట్టి లోన్ తీసుకోవచ్చు. ఎవరు వచ్చినా మీ భూమిని తీసుకోలేరు.

**ప్రజలు ఇచ్చిన బలమే ముందుకు నడిపిస్తోంది..**

2019 ఎన్నికల తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నాను. కొడుకును గెలిపించుకోలేకపోయావని కొందరు మా నాన్నను అవమానించారు. ఎన్నికలకు ముందు నేను గతంలో ఓటమిపాలైన 5300 పక్కన ఒక్క సున్నా పెట్టి గెలిపించమని చెప్పా. ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలో టాప్ 3 మెజారిటీ ఇచ్చారు. మీరిచ్చిన బలమే ఇప్పుడు నన్ను ముందుకు నడిపిస్తోంది. కూటమి ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్ల బండిలా సాగుతున్నాయి. మంగళగిరిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, 24గంటలు తాగునీరు, పార్కులు, శ్మశానాల అభివృద్ధి వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. రాష్ట్రస్థాయిలో 4వేల పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నక్యాంటీన్లు వంటివి అమలు చేస్తున్నాం. ప్రజలంతా ఒక విషయం గుర్తుపెట్టుకోవాలి. గతంలో రాష్ట్ర ఆదాయం రూపాయి అయితే ఖర్చు 1.60పైసలు ఉండేది. గత రెండేళ్లుగా అహర్నిశలు కష్టపడి పరిశ్రమలు తెచ్చి, ఆగిపోయిన పనులు ప్రారంభించాం. ఇప్పటికీ రూపాయి ఆదాయానికి ఖర్చు 1.40పైసలుగా ఉంది. ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఎన్నికల సమయంలో బట్టలు పెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నేడు నెరవేర్చా. ఎపిలో టిడిపి, జనసేన, బిజెపి కలసికట్టుగా పనిచేస్తున్నాయి. డిల్లీలో ఎన్డీఎ ప్రభుత్వం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. ప్రధానిమంత్రి మోడీజీ అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. విశాఖపట్నం రైల్వే జోన్‌కల నెరవేర్చారు. పోలవరం, అమరావతికి నిధులిచ్చారు. అమరావతికి చట్టబద్ధత కల్పించారు. బాబుగారిని తప్పుడు కేసులో జైలుకు పంపినపుడు అన్నగా నిలబడతా అని పవనన్న భరోసా ఇచ్చారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటా. రాష్ట్రాన్ని సరైన దారిలో పెట్టేందుకు అందరం కలసి పనిచేస్తున్నాం.

మీరిచ్చిన బాధ్యతను పద్ధతి ప్రకారం ముందుకు తీసుకెళ్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంతో పాటు మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నా. మంగళగిరి అభివృద్ధికి అన్నివిధాలు సహాయ, సహకారాలు అందిస్తున్న మోడీజీ, చంద్రబాబు, పవనన్నకు ధన్యవాదాలు. పట్టాల పంపిణీకి ముందుకు మూడు పార్టీల నాయకులు మీ ఇళ్లకు వచ్చారు. ఒక కప్పు కాఫీ కూడా తీసుకోలేదు. పారదర్శకంగా వాస్తవ లబ్ధిదారులకు ఈరోజు పట్టాలు పంపిణీ చేస్తున్నాం, మీ అందరి కోసం పనిచేస్తున్న ప్రజాప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని మంత్రి లోకేష్ కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, జనసేన ఇన్చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నేతలు పోతినేని శ్రీనివాసరావు, వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# వర్షసూచన

>> మంగళ, బుధ వారాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని.. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముందని వాతావరణ శాఖ అంచనావేసింది. ఇక గురువారం వర్షాలతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో ఈదురుగాలులు కూడా వీచే అవకాశముందని స్పష్టం చేసింది. ఇక రాయలసీమలోనూ రాబోయే మూడు రోజులు తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మంగళ, బుధవారంలో వర్షంతో పాటు గంటకు 40-50 కిలోమీటర్ల వేగముతో, గురువారం గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## వారం - వర్జ్యం

22-07-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
నవమి పూర్తి,
స్వాతి పూర్తి
వర్జ్యం : తె.5.18-ఉ.7.05
దు. ఉ.11.47-మ.12.39
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** ఏపనిని చేపట్టినా ఆటంకాలు ఎదురై చికాకు కలిగిస్తాయి. దీర్ఘకాలికి సమస్యలు తీరి ఊరటచెందుతారు.

**వృషభం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారమవుతాయి. ఇంటియందు శుభ కార్యాలు నిర్వహిస్తారు. ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

**మిథునం:** నిలకడ లేని గెలుపుకన్నా దైవాన్ని బాగా నమ్ముకొని లాభపడతారు. కలిగిన దానితో తృప్తి పడుతారు.

**కర్కాటకం :** ఇంట్లో ఒకరి ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి.

**సింహం:** ఎల్లవేళల సలహాలను తీసుకొనే వారివద్ద కాకుండా మరొక నిపుణుని సలహాలు తీసుకోవటం వలన లాభపడతారు.

**కన్య :** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. రాజకీయ రంగాలలోని వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** ఆర్థికముగా పరిస్థితి బాగున్నా ఖర్చు అధికమవుతుంది. సుదూర ప్రాంతముల లోని వారియొక్క క్షేమ సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** ఇతరుల కార్యకలాపాలు, వారికి సహాయ సహకారాలు అందించటంతోనే కాలం గడుస్తుంది. ఉద్యోగాలు సానుకూలంగా ఉంటాయి.

**ధనుస్సు:** జీవితంలో ముఖ్యము అని భావించే కార్యక్రమాలను ప్రారంభించ టానికి విశేషంగా కృషిచేసి కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**మకరం:** బాధ్యతయుతంగా ప్రవర్తించి కార్యాలయంలో గౌరవం పెంపొందించు కుంటారు. ఆర్థిక వ్యవహారాలు మధ్యస్తంగా ఉంటాయి.

**కుంభం:** మీలో దాగి వున్న నైపుణ్యం వెలుగులోకి వస్తుంది. కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మీనం :** బ్యాంకు లావాదేవీలలోని తేడాలను, లోపములను పరిశీలించుకొని లాభపడతారు. వివాహ యత్నాలు ఫలిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రధాని నివాసం ముట్టడి.. ఉద్రిక్తం

>> ఈ ర్యాలీతో ఢిల్లీ వీధులన్నీ ఉద్రిక్తంగా మారాయి. కేంద్ర ప్రభుత్వంపై దాడిని మరింత ఉధృతం చేస్తూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు మంగళవారం ప్రధాని అధికారిక నివాసం లోక్ కల్యాణ్ మార్గ్ వైపు నిరసన ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ వాద్రా, కే.సి. వేణుగోపాల్, పవన్ ఖేరా తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. అనంతరం వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యకు బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఆందోళనలకు మద్దతుగా ఈ నిరసన చేపట్టినట్లు తెలిపారు. రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందిస్తూ, "నిన్న యువ విద్యార్థులపై జరిగిన క్రూరమైన పోలీసు చర్యకు ప్రధాని మోదీ సమాధానం చెప్పాలి. ప్రభుత్వం బాధ్యత వహించేందుకు సిద్ధంగా లేదు. పార్లమెంట్‌లో కూడా ఈ అంశంపై చర్చించేందుకు నిరాకరిస్తోంది. దేశ యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు ప్రధాని, కేంద్ర హోంమంత్రి రాజీనామా చేయాలని పేర్కొన్నారు. నిరసన సందర్భంగా కాంగ్రెస్ నేతలు, పోలీసుల మధ్య తోపులాట చోటుచేసుకున్నట్లు వైరల్ అయిన దృశ్యాల్లో కనిపించింది. ప్రధానినివాసంముందునుంచి రాహుల్‌ను తరలించే సమయంలో పోలీసులు రాహుల్‌పై దురుసుగా వ్యవహరించారనినేతలు ఆరోపించారు. రాహుల్ ముక్కునుంచి రక్తంకారిన దృశ్యాలను పార్టీ వైరల్‌చేసింది. అంతకుముందు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు రామ్ మనోహర్ లోహియా (ఆర్‌ఎంఎల్) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు. సోమవారం పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడంతో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో, పోలీసుల దౌర్జన్యం, లాఠీచార్జిలో గాయపడిన విద్యార్థులను రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, కే.సి. వేణుగోపాల్ పరామర్శించారు. దేశ విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుండగా, తమ హక్కుల కోసం గొంతెత్తిన వారిపై లాఠీలు ఎత్తడం అత్యంత దురదృష్టకరం. ప్రశ్నపత్రాల లీకేజీకి ప్రభుత్వం బాధ్యత వహించి, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పార్టీ పేర్కొంది. పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను కలిసి విద్యార్థుల సమస్యపై సభలో చర్చ నిర్వహించాలని కోరామని తెలిపారు. దీనికి స్పందించిన స్పీకర్ ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారని, దీంతో పార్లమెంట్‌లో చర్చ కూడా ప్రభుత్వ అనుమతిపైనే ఆధారపడుతోందని ఆయన విమర్శించారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన అంశం. యువతపై ఇలాంటి దాడులు జరగడం భారతీయ విలువలకు విరుద్ధం. జరిగిన ఘటనపై ప్రధాని మోదీ ఇప్పటికీ క్షమాపణ చెప్పలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు. కాగా, పరీక్షా వ్యవస్థలో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న నిరసనకారులు ముందురోజు పార్లమెంట్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు బాష్పవాయు గోళాలు ప్రయోగించి, లాఠీచార్జి చేసి వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనలో పలువురు పోలీసులు, నిరసనకారులు గాయపడ్డారు. ప్రస్తుతం నిరసనకారులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉంటే బైఠాయింపులో పాల్గొన్న కాంగ్రెస్‌నేతలనందరినీ వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించి తదనంతరం విడుదలచేసారు.

**రాహుల్‌గాంధీతో నిరసనలోనే కేంద్ర మంత్రి చర్చలు..!**

మోడీ నివాసం ముందు బైఠాయించిన కాంగ్రెస్ నేతలతో ప్రత్యేకించి రాహుల్‌గాంధీతో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ చర్చలుజరిపారు. పార్లమెంటులో చర్చించాలని, నీట్ లీకేజికి బాధ్యులైనవారిపై కఠిన చర్యలుండాలని, నీట్ లోపాలు, సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జి అంశాలపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలని రాహుల్ గాంధీ స్పష్టంచేసారు. సిజెపి ర్యాలీలోనిర్వహించిన లాఠీ ఛార్జికి ప్రధానిమోడీ క్షమాపణలు చెప్పాలని రాహుల్ డిమాండ్‌చేసారు. దేశ విద్యావ్యవస్థలో సంస్కరణలురావాలని, పేపర్ లీకేజిలకు వ్యతిరేకంగా యువత నిరసన తెలుపుతుండగా వారిపై లాఠీ ఛార్జిజరిగిందని తెలిపారు.

**రాహుల్‌రహస్య ఆపరేషన్ సక్సెస్?..!**

హటాత్తుగా ఇచ్చిన పిలుపుతో మోడీ నివాసం ముందు కాంగ్రెస్‌నేతలు ఎంపిలు నాయకులు నిర్వహించిన ముట్టడి విజయవంతం కావడం రాహుల్ నిర్వహించిన రహస్య ఆపరేషన్ అని తెలుస్తోంది. ముందు 10 రాజాజీ మార్గ్‌లోని ఖర్గే నివాసానికి చేరిన నేతలు ఎఐసిసి అధ్యక్షుడు 84వ జన్మదినశుభాకాంక్షలు తెలియజేసేందుకు చేరుకున్నారు. అక్కడినుంచి సుమారు 2.3 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న 7,లోక్‌కల్యాణ్‌మార్గ్‌లోని ప్రధాని నివాసానికి కాంగ్రెస్ నేతలు హటాత్తుగాచేరుకుని నిరసన చేపట్టారు. తొలుత విజయ్‌చౌక్‌వరకూ నిరసన ర్యాలీ చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది సమాచారం ముందుగానే లీక్ అవడంతో పోలీసులు అడ్డుకుంటారనే అంచనాతో ప్లాన్‌మార్చి ప్రధానిమోడీనివాసం ముందు బైఠాయింపును నిర్వహించారు. ఖర్గే పుట్టినరోజుకు భోజనానికి వస్తున్నట్లుగా భావించిన భద్రతా అధికారులకు ఎలాటి అనుమానం రాలేదు. అలాగే ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా ముందుగా పసిగట్టలేకపోయాయి. నీట్ పేపర్ లీక్కు వ్యతిరేకంగా బొద్దింకల జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఉద్యమాన్ని కాంగ్రెస్ హైజాక్ చేసింది. సోమవారం యువ విద్యార్థులు, బొద్దింకల పార్టీ నాయకులపై దృష్టి సారించిన ఈ ఉద్యమం.. మంగళవారం రాహుల్ గాంధీ వైపు మళ్లడంతో చర్చ తీవ్రరూపం దాల్చింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానమంత్రి నివాసానికి చేరుకున్నారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడమే తన ఏకైక డిమాండ్ అని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఒకవేళ ఇది జరగకపోతే రాత్రంతా ప్రధానమంత్రి నివాసం బయటే గడుపుతానని ప్రకటించారు. ప్రధానమంత్రి నివాసం బయట నిలబడి ఉన్న కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ మాట్లాడుతూ 120 మంది ఎంపీలు తనతో ఉన్నారని పేర్కొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీసన్ కూడా చేరుకున్నారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి జితేంద్ర సింగ్ బయటకు వచ్చి రాహుల్ గాంధీని కలిసి డిమాండ్లను పరిశీలిస్తామని చెప్పారు. అంతేకాకుండా నీట్ పేపర్ లీక్ విషయంపై సభలో చర్చిస్తామని తెలిపారు. అయితే రాహుల్ గాంధీ తాను తన డిమాండ్లకు కట్టుబడి ఉన్నానని స్పష్టంగా చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తాను ఇక్కడి నుంచి వెళ్లనని అన్నారు. అంతేకాకుండా తాను రాత్రికి ఇక్కడే ఉంటానని కూడా తెలిపారు.

# కొవిడ్ నిరోధానికి ఏర్పాట్లు ముమ్మరం

>> ఉండాలని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని దశల వారీ కార్యాచర ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను కార్యదర్శి ఆదేశించారు. రాష్ట్రంలోని 17 బోధనాసుపత్రుల్లో మొత్తం 255 ప్రత్యేక కోవిడ్ పడకలను సిద్ధం చేశారు. సెకండరీ ఆసుపత్రుల్లోనూ అవసరమైతే వినియోగించేందుకు ప్రత్యేక పడకలను కేటాయించేందుకు ఏర్పాటు జరిగాయి బోధనాసుపత్రుల్లో 6,77,936 ట్రిపుల్ లేయర్ మాస్కులు, కేంద్ర ఔషధ నిల్వ కేంద్రాల్లో మరో 5.26 లక్షల మాస్కులు ఉన్నాయి. అదనంగా 58,790 ఎన్95 మాస్కులు, 4,436 పిపిఇ కిట్లు, 2,572 శానిటైజర్లు అందుబాటులో ఉంచారు. కోవిడ్ చికిత్సకు అవసరమైన యాంటీబయాటిక్స్, ఐవీ ఫ్లూయిడ్స్ తదితర మందుల నిల్వలు కూడా తగిన స్థాయిలో ఉన్నాయని అధికారులు తెలిపారు. రెమిడిసివిర్ ఇంజెక్షన్లు, టెస్టింగ్ కిట్లు, శానిటైజర్లు తదితర అత్యవసర సామగ్రిని వెంటనే కొనుగోలు చేసేందుకు ఆసుపత్రుల సూపరింటెండెంట్లకు లోకల్ పర్చేజ్ అధికారాలు కల్పిస్తూ డిఎంఇ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రస్థాయి సరఫరా కోసం వేచి చూడకుండా అవసరమైన సామగ్రిని స్థానికంగానే సమకూర్చుకునే వెసులుబాటు కల్పించడంతో అత్యవసర పరిస్థితుల్లో స్పందన మరింత వేగవంతం కానుంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ..51,700 ఆర్ఎన్ఏ ఎక్స్‌ట్రాక్షన్ కిట్లు, 27,552 ఆర్టీపీసీఆర్ కిట్లు,, పిసిఆర్ టిప్స్, ఫిల్టర్ టిప్స్, మైక్రో ట్యూబ్స్, నైట్రైల్ గ్లౌవ్స్ కొనుగోళ్లకు ఏపీఎంఎస్ఐడీసీ ఆర్డర్లు జారీ చేసింది. అదనంగా ప్రతి ఆసుపత్రికి 50 చొప్పున రెమిడిసివిర్ ఇంజెక్షన్లు అందించే చర్యలు చేపట్టింది. మైక్రో ట్యూబ్స్, నైట్రైల్ గ్లౌవ్స్ సరఫరా తుది దశకు చేరుకోగా, పిసిఆర్ స్ట్రిప్స్, ఫిల్టర్ టిప్స్ పంపిణీ ప్రారంభమైంది..

# గుంటూరులో కరోనా కలకలం

## జిజిహెచ్‌లో మూడు కొత్త కేసులు నమోదు

**గుంటూరు మెడికల్, జులై 21, ప్రభాతవార్త:** గుంటూరు జిల్లాలో మరోసారి కరోనా కేసులు నమోదవడంతో ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్) వైరాలజీ పరిశోధనా ప్రయోగశాలలో నిర్వహించిన ఆర్‌టీపీసీఆర్ పరీక్షల్లో ముగ్గురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం యాక్టివ్ కరోనా కేసుల సంఖ్య నాలుగుకు చేరింది. వైద్యుల వివరాల ప్రకారం, కరోనా నిర్ధారణ అయిన వారిలో మంగళగిరి, బాపట్ల, మేడికొండూరు ప్రాంతాలకు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు. వీరిలో బాపట్లకు చెందిన వ్యక్తి బాపట్ల ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, మేడికొండూరుకు చెందిన వ్యక్తి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండటంతో హోం ఐసోలేషన్‌లో ఉంచి వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. మంగళగిరికి చెందిన వ్యక్తికికూడా తగిన వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# నేటి నుండి 'తల్లికి వందనం' ఖాతాల్లోకి నగదు!

**విజయవాడ.జులై21, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పేద విద్యార్థుల తల్లులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "తల్లికి వందనం" పథకం నిధుల పంపిణీ ప్రక్రియ జులై 22నుంచి షురూ కానుంది. ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.13 వేల చొప్పున నగదు జమ కానుంది. ఈ నెల 22 నుంచి 24వ తేదీల లోపు దశలవారీగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోకి నేరుగా ఈ నిధులు చేరనున్నాయి.

**అప్రమత్తంగా ఉండాల్సిందే.**

ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు 'తల్లికి వందనం' పేరుతో పంపిణీ చేసే అనుమానాస్పద లింకుల పట్ల లబ్ధిదారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులు సూచించారు. "మీ ఖాతాలో డబ్బులు పడాలంటే ఈ లింక్‌పై క్లిక్ చేయండి ' లేదా' వెంటనే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోండి" అంటూ మొబైల్ ఫోన్లకు వచ్చే ఫేక్ మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. వాటిని క్లిక్ చేస్తే అకౌంట్లలో ఉన్న సొమ్ము మొత్తం సైబర్ దొంగల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు.




ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

22-7-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 172 పేజీలు: 8+4 వెల: 6.50


నేటి నుండి 'తల్లికి వందనం' ఖాతాల్లోకి నగదు! 2లో

ఉపరాష్ట్రపతితో కేంద్ర, రాష్ట్ర మంత్రులు భేటీ

## కొనసాగిన 'కాక్రోచ్' నిరసనలు

**న్యూఢిల్లీ, జూలై 21:** నీట్ వైఫల్యాలు, సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జికి నిరసనగా ఆ పార్టీ ఛీఫ్ అభిజిత్ దీప్కేఆధ్వర్యంలో మంగళవారంకూడా జంతర్‌మంతర్‌వద్ద నిరసనలు కొనసాగాయి. కాగా లాఠిఛార్జిలో గాయపడిన విద్యార్థులందరినీ స్థానిక రామ్‌మనోహర్‌లోహియా ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకవిద్యార్థినిని ఐసియులో ఉంచి చికిత్స జరుపుతున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సిజెపి కేడర్‌నున ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ ఎంపిలు రాహుల్, ప్రియాంక, కెసి వేణుగోపాల్; జైరామ్‌రమేష్ వంటి వారు పరామర్శించి ధైర్యం చెప్పారు.



# ప్రధాని నివాసం ముట్టడి

# ఉద్రిక్తం



ఢిల్లీలో మంగళవారం రాహుల్ గాంధీని అదుపులోకి తీసుకుని తరలిస్తున్న పోలీసులు

- రాహుల్‌నాయకత్వంలో పెద్ద ఎత్తున ధర్నా
- పాల్గొన్న ఖర్గే, ప్రియాంక, వేణుగోపాల్ తదితరులు
- విద్యార్థులపై చర్యకు ప్రధాని జవాబు చెప్పాలని,
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- పోలీసుల లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం
- రాహుల్ సహా నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- తోపులాటలో రాహుల్ ముక్కునుంచి కారిన రక్తం

**న్యూఢిల్లీ, జూలై 21:** నీట్‌పరీక్షల్లో లోపాలపై కాక్రోచ్‌జనతాపార్టీచేపట్టిన సంసద్‌ర్యాలీలో సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జిని తీవ్రంగా నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ ర్యాలీ తీసింది. మంగళవారం జరిగిన >>2



రాహుల్‌గాంధీతో కేంద్ర మంత్రి జితేందర్ చర్చలు



## పార్లమెంటులో మళ్లీ గందరగోళం

### నీట్, అయోధ్యపై చర్చకు విపక్షాల పట్టు

### ఉభయ సభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 21:** పార్లమెంటు రెండోరోజు సమావేశాల్లోను ఉభయసభలు నిరసనలతో దద్దరిల్లాయి. నీట్ లోపాలపై ఆందోళనచేస్తున్న బొద్దింకలపార్టీ కార్యకర్తలు, ఆందోళన కారులపై లాఠీఛార్జి, అమానుషంపై చర్చించాలని, అయోధ్య విరాళాల చోరీకేసును చర్చకు పెట్టాలని కోరుతూ విపక్షాలు పట్టుబట్టాయి. ఉభయ సభలు ప్రారంభంనుంచే విపక్ష నేతలు బ్యానర్లు చేతబట్టి నిరసనలతో మారుమోగించారు. విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాచేయాలని, ప్రధానిమోడీ విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ ఇతర పక్షాలనాయకులు డిమాండ్ చేసారు. లోక్‌సభ ఉదయం 11 గంటలకు ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు నీట్ పేపర్‌లీక్‌పై నినాదాలు ప్రారంభించారు. అలాగే సిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జి సిగ్గుసిగ్గు అంటూ నిరసన తెలిపారు. లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా విపక్ష సభ్యులను పదేపదే వారిస్తూ వారివారి సీట్లలోకి వెళ్లి కూర్చోవాలంటూ విజ్ఞప్తిచేసారు. ఎంతసేపటికీ సభ్యులునిరసన విరమించకపోవడంతో మధ్యాహ్నం వరకూ బిర్లా సమావేశా లను వాయిదా వేసారు. >>2

# ఇక యుఎఇ ఆహార పెట్టుబడులు

- సిఎం చంద్రబాబు, యుఎఇ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఒయు
- ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ రూ. 100 కోట్ల పెట్టుబడులు
- తొలుత చిత్తూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్
- ఆహార శుద్ధిలో పలు కంపెనీల ఏర్పాటుకు యుఎఇ అంగీకారం



మంగళవారం సచివాలయంలో సిఎం చంద్రబాబు, యుఎఇ మంత్రి అబ్దుల్లాబిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఒయు కుదుర్చుకున్న దృశ్యం

**విజయవాడ జూలై 21,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ యేడాది దావోస్ లోని ప్రపంచ ఆర్థిక సదస్సులో కుదుర్చుకున్న మరో ఒప్పందం ఇవాళ సాకారమైంది. యుఎఇ ఫుడ్ క్లస్టర్ ద్వారా ఎపిలోని ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఎగుమతులు, వాణిజ్యం, పెట్టుబడులను పెట్టేలా ఎపి ఇడిబియుఎఇకి చెందిన ఫుడ్ క్లస్టర్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈమేరకు రాష్ట్ర సచివాలయంలో సిఎం చంద్రబాబు నాయుడు, యుఎఇ ఆర్థిక, పర్యాటక విభాగం మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఎపిలో యుఎఇ ఫుడ్ క్లస్టర్ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతులు, విదేశీ వాణిజ్యం సహా యూఏఈకి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టేలా ఈ ఒప్పందం కుదిరింది. ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ఎపి సచివాలయంలో సిఎం చంద్రబాబుతో యుఎఇ ప్రతినిధుల బృందం చర్చలు జరిపింది. ఈ యేడాది జనవరిలో దావోస్ పర్యటనలో ఎపిలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంబంధించి యుఎఇ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహారశుద్ధి రంగంలో ఎపిలో వ్యాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యుఎఇ నిర్ణయించింది.

ఇందుకోసం ఎపి ప్రభుత్వం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తూ ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. మామిడి, అరటి, కోకో లాంటి వివిధ ఉద్యాన ఉత్పత్తులకు సంబంధించి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, విలువ జోడించిన ఉత్పత్తుల ఎగుమతులు, వాణిజ్యం లాంటి అంశాల్లో ఈ ఎంఓయూ సహకరించనుంది. ఈ ఒప్పందంలో తొలి అడుగుగా యూఏఈకి చెందిన ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఎపిలోని చిత్తూరులో రూ.100కోట్లను పెట్టుబడిగాపెట్టేందుకు ముందుకు వచ్చింది.

చిత్తూరు జిల్లా, గంగాధర నెల్లూరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ఈ సంస్థ ప్రపంచ శ్రేణి ఉత్పత్తులను తయారు చేయనుంది. దుబాయ్, యుఎఇ కేంద్రంగా పనిచేస్తున్న ఫ్లోర్ మాస్టర్స్ ఇంటర్నేషనల్ సంస్థ దాదాపు 25 దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది. ఎపిలో ఏర్పాటు చేయనున్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచికూడా అంతర్జాతీయ మార్కెట్లకు ఉత్పత్తులను ఎగుమతి చేయ >>2

## నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

### భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభానికి ప్రధానిని ఆహ్వానించనున్న సిఎం

**విజయవాడ జులై 21,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్రమంత్రులను సిఎం చంద్రబాబు కలవనున్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మితమైన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం ఆగస్టు 1వ తేదీన ప్రారంభం కానుంది. దీన్ని ప్రధాని మోడీ చేతులు మీదుగా ప్రారంభించనున్నారు. ఈనేపథ్యంలో సిఎం చంద్రబాబు ఢిల్లీవెళ్లి ప్రధానిని ఆహ్వానించనున్నారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్‌షానుకూడా సిఎం చంద్రబాబు కలవనున్నారు. అదేవిధంగా కేంద్రమంత్రులు పియూష్ గోయల్, మనోహర్‌లాల్ ఖట్టర్, సిఆర్ పాటిల్‌నుకూడా సిఎం చంద్రబాబు కలిసే అవకాశం ఉంది. సిఎం చంద్రబాబు బుధవారం ఉదయం 07.30 గంటలకు అమరావతి నుంచి బయలుదేరి 10.00 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసిన అనంతరం రేపు ఢిల్లీలోనే ముఖ్యమంత్రి బసచేస్తారు. ఢిల్లీలో కార్యక్రమాలను ముగించుకుని గురువారం ఉదయం సచివాలయానికి చేరుకుంటారు.

# దేశంలోనే ఆదర్శంగా మంగళగిరి


- ప్రతి ఎన్నికల హామీ అమలు చేస్తున్నాం
- 'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో 3 వేల మందికి శాశ్వత పట్టాలు పంపిణి

### బట్టలుపెట్టి పట్టాలిస్తానన్న ప్రధాన హామీని నెరవేర్చా: మంత్రి లోకేష్



మంగళవారం 'మన ఇల్లు-మన లోకేష్' కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి లోకేష్

**విజయవాడ,జులై 21,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా కూటమి అడుగులు వేస్తుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు.ప్రజా సంక్షేమం కోసం సిఎం చంద్రబాబు స్ఫూర్తితో ప్రతి విషయంలో కార్యచరణ చేపట్టామన్నారు. మంగళగిరి ప్రజలకు ఎల్లప్పుడూ అండగాఉంటా, ఏ సమస్య వచ్చినా పరిష్కరిస్తా అన్నారు. అన్నిరంగాల్లో మంగళగిరి నెం.1గా నిలబడాలి. భారతదేశంలోనే మంగళగిరిని ఆదర్శ నియోజకవర్గంగా తయారు చేయాలన్నదే తన ధ్యేయమని పేర్కొన్నారు. 'మన ఇల్లు - మన లోకేష్' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన పేదలకు శాశ్వత పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2024 ఎన్నికల తర్వాత మంగళగిరి ప్రజలే నా నమ్మకమయ్యారు. 2019 ఎన్నికల్లో నేను స్థానిక ప్రజలను అర్థం చేసుకునేలోపు ఎన్నికలు అయిపోయాయి, ఫలితంగా 5,300 ఓట్లతో ఓడిపోయాను. రెండురోజులు బాధపడినా మీ మనసు గెలవాలని ఆనాటి నుంచి నా ప్రయాణం ప్రారంభించా. ఐదేళ్లలో ఎప్పుడు ఎవరిని కలిసినా మా భూమికి శాశ్వత హక్కు కావాలని అడుగుతూ వచ్చారు. ఒకేసారి అందరి భూములను రెగ్యులరైజ్ చేయలేను, అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని చెప్పాను. ఈరోజు 3వేలమందికి శాశ్వత పట్టాలు అందజేస్తున్నాం. దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు ఎవరు వచ్చి తమ ఇళ్లు, స్థలాలు లాగేసుకుంటారోనని భయంతో బతికారు, >>2



# కోవిడ్ నిరోధానికి ఏర్పాట్లు ముమ్మరం

### చికిత్స, పరీక్షలకు పూర్తి సన్నాహాలు

**విజయవాడ. జులై21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో నమోదవుతున్న కోవిడ్ కేసుల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలను వైద్య, ఆరోగ్య శాఖ మరింత వేగవంతం చేసింది. కేసుల సంఖ్యపై ఎప్పటికప్పుడు నిఘా కొనసాగిస్తూనే, అనుమానితులకు పరీక్షలు, బాధితులకు తక్షణ చికిత్స అందించేలా ప్రభుత్వాసుపత్రులను పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తోంది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు పరీక్షల కిట్లు, మందులు, ప్రత్యేక పడకలు, రక్షణ సామగ్రి, అత్యవసర ఔషధాలను అందుబాటులో ఉంచేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. గత వారం మంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రజలు కోవిడ్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే వైద్య శాఖ మాత్రం ఏమాత్రం నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అనుమానిత లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలునిర్వహించి, అవసరమైన చికిత్స అందించేలా అన్ని ప్రభుత్వాసుపత్రులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్ యధావిధిగా రోజూ వారీ చర్యల్లో మాదిరిగానే మంగళవారం కూడా డీఎస్‌హెచ్ డాక్టర్ చక్రధర్‌బాబు, డిఎంఇ డాక్టర్ విష్ణువర్ధన్, ప్రజారోగ్య శాఖ, ఏపీఎంఎస్ఐడీసీ తదితర విభాగాల అధికారులతో వర్చువల్ సమీక్ష నిర్వహించి సన్నద్ధత పై చర్చించారు. కోవిడ్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా >>2

## గుంటూరులో కరోనా కలకలం

### జిజిహెచ్‌లో మూడు కొత్త కేసులు నమోదు 2లో



## 3 రోజులు భారీ వర్షసూచన

**విజయవాడ. జులై21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కీలక సూచనలు జారీ చేసింది. రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉత్తర బంగాళా ఖాతంలోని ఉపరితల ద్రోణి పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఉన్న ఉపరితల ఆవర్తనం నుండి, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, దక్షిణ రాజస్థాన్, గుజరాత్‌ల మీదుగా ఈశాన్య అరేబియా సముద్రం వరకు సముద్ర మట్టానికి 3.1 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజులుపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలుకురిసే అవకాశం ఉందని తెలిపింది. వాతావరణశాఖ ప్రకారం.. రేపు, ఎల్లుండి పలుజిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండుచోట్ల కురిసే అవకాశముంది. అలాగే వర్షాలు కరిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగముతో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశముంది. దక్షిణకోస్తాంధ్ర జిల్లాల్లో >>2

## తమ్మినేనికి హైకోర్టులో ఎదురు దెబ్బ

**విజయవాడ.జులై21.ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ సీనియర్ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో సోమవారం మరో ఎదురుదెబ్బ తగిలింది. నకిలీ పత్రాలతో భూకబ్జా చేశారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనతో పాటు కుటుంబ సభ్యులు ప్రస్తుతం అరెస్టు భయంతో పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని సీతారాం హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. దీనిపై ఇవాళ విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం.. కేసు క్వాష్ చేసేందుకు మాత్రం నిరాకరించింది. ఈ కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని హైకోర్టు తెలిపింది. కాబట్టి ఈ దశలో జోక్యం చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. అయితే తమ్మినేనికి మరో ఆప్షన్ మాత్రం ఇచ్చింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. దీంతో తమ్మినేని ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో తదుపరి విచారణను జులై 29కి వాయిదా పడింది. తమ్మినేని సీతారాంపై పోలీసులు నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో కేసు నమోదు చేశారు. దీంతో ఇవాళ తెల్లవారుజామునే ఆముదాలవలసలోని ఇంటి నుంచి అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

## ముడి పొగాకుపై జిఎస్టీ 28శాతానికి తగ్గించాలి

### కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతి

**శ్రీకాకుళం, జులై 21 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని పార్లమెంట్‌లో కలిసి ముడి పొగాకుపై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జిఎస్టీని 28 శాతానికి తగ్గించాలనికోరుతూ వినతిపత్రంఅందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, >>2


పువ్వు ఎంత అందంగా ఉన్నా పరిమళంలేకపోతే అది వ్యర్థమే. అలాగే క్రియాశూన్యమైన మాటలు వినడానికి ఎంత సొంపుగా ఉన్నా నిష్ప్రయోజనమే.

-మెకాలే

# కొవిడ్‌కు దారేది?

కొవిడ్ వచ్చేసిందనో, వచ్చేస్తోందనే భయపడదామా? ముందు జాగ్రత్తలతో అప్రమత్తమవుదామా? అంటే ఎంతో మంది రెండో దానికే ప్రాధాన్యత నిస్తారు. కానీ తెలిసీ తెలియని పరిస్థితుల్లో మరెంతో మంది అంతర్లీనంగా భయపడి వణికిపోతుంటారు. ఏదిఏమైనా 'కోవిడ్' భూతం మళ్లీ నేరుగానో మరో రూపంలోనో మానవాళి మధ్యన చేరినట్లే ఉంది. దేశవ్యాప్తంగా దాదాపు 500 కేసులకిపైగా కోవిడ్ పాజిటివ్ వచ్చినా అక్కడక్కడ ఆ లక్షణాలున్న రోగాలు బయటపడుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో దాదాపు కోవిడ్ రోగ లక్షణాలకు దగ్గరగా ఉన్నా కొన్ని లక్షణాలు రోగులను భయభ్రాంతుల్ని చేస్తున్న సమాచారం విస్తృతంగా ఉంది. అలా అని కరోనా వ్యాప్తి జరగదని కానీ, జరుగలేదనీ కానీ ధృవీకరించే సమాచారమేదీ అందుబాటులో లేదు. ఈ మధ్య ఆంధ్రప్రదేశ్‌లో కోవిడ్ పరీక్షలు చేసినప్పుడు కొంత మందికి పాజిటివ్ రావడంతో ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. నెల్లూరు ఎన్టీఆర్ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరగడంతో ఆ ప్రాంతంలో కొంత అలజడి బయలుదేరింది. మళ్లీ మాస్కుల దుమ్ము దులుపుతున్నారు. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండల నిడిగుంట పాలెంకు చెందిన మూడేళ్ల బాలుడు కేన్సర్ చికిత్స కోసం పుదుచ్చేరి వెళ్లగా అక్కడ కరోనా సోకినట్లు వైద్యులు ధృవీకరించారు. అతని బంధువులందరికీ 'నెగిటివ్ అని తేలడంతో కొద్దిగా ఊపిరి పీల్చుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రోలపాడు నివాసం 13 ఏళ్ల బాలిక 'కిడ్నీ' వ్యాధితో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేరగా ఆమెకూ 'కోవిడ్ పాజిటివ్' ధృవీకరణతో ఆ రాష్ట్రమంతా అప్రమత్తమైంది. సాధారణ వ్యక్తులెవరికీ 'కోవిడ్' పాజిటివ్ రాకపోవడం మంచిదైంది. లేకుంటే సాధారణ జనంలో అనవసరంపు ఆందోళనలు మొదలయ్యేవి. ఆంధ్ర రాష్ట్రంలో జూన్ 26 నుంచి జులై 19 మధ్యకాలంలో 19 కోవిడ్ కేసులు చికిత్సలో ఉండగా నాలుగు మరణాలు నమోదయ్యాయి. అయితే తెలంగాణ రాష్ట్రంలో ఇలాంటి లక్షణాలున్న ఒక్క కేసుకూడా నమోదవలేదు. దాంతో తెలంగాణ ప్రభుత్వం కాస్త ఊపిరి పీల్చుకుంది. కోవిడ్ లక్షణాలు స్వల్పంగా కనిపించినా హోమ్ ఐసోలేషన్‌లో ఉన్నవారెవరికీ పాజిటివ్ రాలేదు. తీవ్రమైన దీర్ఘకాల వ్యాధులు ఉన్నవారే వ్యాధి నిరోధక శక్తి తగ్గి కోవిడ్ బారినపడ్డారు. ఈ కారణాల చేత మరో కోవిడ్ 'వేవ్'వచ్చిందనే ఆరోపణలను వైద్యులు కొట్టి పారేస్తున్నారు. అయితే వర్షాకాలం రీత్యా జ్వరాలు, ఫ్లూ, దగ్గు, జలుబు వంటి సాధారణ అనారోగ్య లక్షణాలపై ఆస్పత్రులకు వెళ్తున్నారు. తొలి దశలోనే వ్యాధినిరోధకత చికిత్స తీసుకోవడం మంచిది. కోవిడ్ వైరస్‌లో స్వల్ప మ్యూటేషన్‌ల కారణంగా క్లస్టర్లుగా మాత్రమే కోవిడ్ వ్యాప్తిని గుర్తిస్తున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు. ఈ కేసుల విస్తృత వ్యాప్తి నేపథ్యంలో ఒమిక్రాన్ సబ్‌వేరియంట్‌పై నిర్ధారణ జరిగాకనే వైద్యాధికారులు వాటి నమూనాలను జీనోమ్ సీక్వెన్సింగ్‌కు పంపారు. మహారాష్ట్ర, కేరళ, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లోనూ కోవిడ్ కేసులు పెరగడంతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. కానీ ప్రజల్లో కోవిడ్ నాలుగో వేవ్‌ను చూడబోతున్నామా?అనే ఆందోళనతో ఉన్నారు. అదేంకాదు కానీ కేవలం స్కాటర్ట్ ట్రాన్స్‌మిషన్‌గా శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలో 48కేసులు ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులున్నాయి. చాలా కేసులు ఇతర వ్యాధులకు టెస్ట్ చేస్తున్న సందర్భాల్లో బయటపడినవే. ప్రముఖ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులన్నీ ఏరుగ్మతకు శస్త్రచికిత్స చేయాల్సినా ఆ సందర్భంలోనూ కోవిడ్ టెస్ట్ తప్పనిసరి చేస్తున్నారు. అలాబయటపడినవే ఈ కొన్నీ కూడా. కోవిడ్‌కు పునఃప్రవేశం లేదని చెప్తున్న శాస్త్రజ్ఞులు సైతం వాటి నుంచి వచ్చిన కొత్త వేరియంట్‌లకు అవే లక్షణాలున్నా కరోనా వైరస్‌అంతప్రమాదం కాదని చెబుతున్నారు. ఈ మాట కోవిడ్ రోగులకు వర ప్రసాదంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 73దేశాల్లో పాజిటివిటీ రేటు 11శాతానికి చేరినట్లు లెక్క. ఇప్పటికీ ఆలస్యం లేదు. జాగ్రత్తలు తీసుకోవడంలో తప్పులేదు. సాధారణ జ్వరాలే అయినా చికిత్సకు వెళ్లాలి. వృద్ధులు డయాబిటిస్, బి.పి, గుండె జబ్బులున్నవారు 'మాస్క్' ధరించడం అలవాటు చేసుకోవాలి. సర్వైలెన్స్, జీనోమ్ సీక్వెన్సింగ్‌ను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంమీద ఉంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ బెడ్‌లు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లను సిద్ధంగా ఉంచుకోవాలి. మాస్క్, శానిటైజర్, టెస్ట్ అత్యవసరం. కోవిడ్‌తో కలిసి బతకడం ఇంత క్రితమే అలవాటయింది. కనుక అదేదారిలో ఈసారి కూడా వైద్యచికిత్సలు, సామాజిక జాగ్రత్తలు తీసుకోవాలి. గతంలో కోవిడ్ బాధితులకు తర్వాత క్రమంలో డెంగీ లక్షణాలు వస్తుంటాయని కూడా కొన్ని అధ్యయనాలున్నాయి. ఈకారణం చేత డెంగీ వ్యాధిసోకిగా నాలుగు రోజులకు తగ్గిపోతుంది లే! అని అశ్రద్ధ చేసేందుకు వీలులేదు. దేశంలో డెంగీ వ్యాధి నివారణకు 'క్యూడెంగా' అనే కొత్త టీకా త్వరలో భారత్‌లో విడుదల కాబోతోంది. జపాన్‌కు చెందిన తకేడా బయోఫార్మస్యూటికల్స్ సేవలు అభినందించాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా డెంగీ కేసుల్లో మూడోవంతు భారత్‌లోనే నమోదవుతున్నందున భారతీయులకీ టీకా వర ప్రసాదమే. మనదేశంలో ఆమోదం పొందిన తొలి డెంగీ టీకాను స్వాగతిద్దాం. ఒక్కోసారి పుట్టిన వైరస్ మళ్లీమళ్లీ సోకే అవకాశం ఉన్నందున వ్యాధి నివారణ కన్నా వ్యాధి నిరోధకత మేలు. సింగపూర్, ఆగ్నేయాసియా దేశాలలో విస్తృతంగా ఉన్న ఒమిక్రాన్ ఆర్‌ఎఫ్ 5 వేరియంట్ కోవిడ్ వైరస్ భారత్‌లోకి ఎలా ప్రవేశించిందో భారత్ పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

నిన్నటి తప్పుల గురించి కానీ రేపు రాబోయే కష్టం గురించి కానీ దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



యం.కె. గాంధీ

నేర్చుకున్నదాంట్లో ఒక గ్రాము ఆచరణలో పెట్టేందుకు పది గ్రాముల ఇంగిత జ్ఞానం అవసరం.



ఆల్బర్ట్ కామూ

## ప్రజావాక్కు



### అడుగు అంతరిక్ష విజయం వైపు

భారత్‌లో స్కైరూట్ ఏరోస్పేస్ అన్న ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో తొలి రాకెట్, విక్రమ్1 ప్రయోగం విజయవంతం కావడం ముదావహం. అటూ ఇటుగా పాతికేళ్ల వయస్సు యువశాస్త్రవేత్తల బృందం సాధించిన ఈ ఘనత భారత్ అంతరిక్ష రంగంలో కీలక మలుపు. 2020లో రోదసీ ప్రయోగాల,పరిశోధనల రంగంలోప్రైవేట్‌సంస్థలకు చోటిచ్చేలా భారత్ తన విధానాన్ని మార్చుకుంది. దేశ భద్రత తదితర కారణాలతో ప్రభుత్వానికే పరిమితమైన ఈ రంగంలోఇస్రో ఎన్నోవిజయాల్నినమోదు చేసినా,ప్రపంచ మార్కెట్లో మరింత దూసుకుపోయే అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి ప్రైవేట్‌భాగస్వామ్యం అవసరమని ప్రభుత్వం గుర్తించింది. అంతరిక్ష వాణిజ్యంలో దేశం వాటా కేవలం రెండు శాతమేఉండడం,వరుస విజయాలతో,వేరే దేశాలతోపోల్చినపుడు తక్కువఖర్చుతో విజయాల్ని నమోదు చెయ్యడం గమనంలోకి తీసుకుని ఎదిగే అవకాశాల్ని గుర్తించింది. ఇప్పుడు ఆదిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో మొదటి విజయం లభించింది. అమెరికా, చైనాల సరసన మూడో దేశంగా నిలిచింది.

- డా.డి.వి.జి. శంకరరావు, విజయనగరం

### రక్షణ మార్గాలను ఏర్పాటు చేయాలి

తిరుపతి తిరుమల ఘాట్ రోడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పైనుండి బండ రాళ్ళు కిందికి పడే అవకాశం ఉంది. ఈ ఘాట్‌రోడ్‌లో నిత్యం బస్సులు లక్షల ప్రయాణీకుల్ని తీసుకువెళ్తాయి. ఏడాది పాటు ట్రాఫిక్ ఉంటుంది. దశాబ్ద కాలం నుండి ఈ ఘాట్ రోడ్, పైన కొండలు,మలుపులు పూర్తిగా చూసి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక సాంకేతిక పరిజ్ఞానం ఉన్న నిపుణులు ఒక పూర్తి అభిప్రాయం ఇచ్చారు గనుక అప్పటినుండే ప్రమాద సూచన ఉన్నట్లు.నిపుణులు సూచించే రక్షణ మార్గాలు పక్కగా ఇంజనీ రింగ్ విభాగం చర్యలు చేపట్టాలి.

- బి. మేఘనాథం, విశాఖపట్నం

### ఆలోచించాల్సిందే..

పాలన ఎంత బాగా చేసినా ప్రజలకు ఎన్ని సంక్షేమ పథకాలు అందించినాకొంతకాలానికి ప్రభుత్వాలపై వ్యతిరేకత రావటం సహజం. ప్రజావ్యతిరేకత కారణంతోనే రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారుతుంటాయి.ప్రభుత్వాలపై వ్యతిరేకతవచ్చినా పాలకులు పట్టించుకోకుండాప్రజల సమస్యలను పరిష్కరిస్తేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

- ఎమ్. జగన్నాథం, హైదరాబాద్

### మధుర జ్ఞాపకాలు

ఒకప్పుడు ఫొటోదిగాలంటే గంటల కొద్దీగామస్తాబయి స్టూడియోకు వెళ్లేవాళ్లం. సంబరం అంతలా ఉంటుంది మరి. నేడు దాదాపు అందరి దగ్గర అన్ని సౌకర్యాల గల స్మార్ట్‌ఫోన్ ఉంటుంది. దాంతో ఎన్ని కావాలంటే అన్నిఛాయాచిత్రాలు, వీడియోలు తీసుకోవచ్చు. బ్లాక్ అండ్ వైట్ నుంచి అనతికాలంలో ప్రగతి సాధిస్తున్న వైనంఅబ్బురపరుస్తుంది. ఏదిఏమైనప్పటికీ అప్పటి నుంచి ఫోటలకున్న విలువ అంతా ఇంతా కాదు. తిరునాళ్లలో జాతరల్లో అంతే కలియతిరిగి, ఫోటో తీయించకపోతే ఏదో వెలితిగా ఉంటుందంటే అతిశయోక్తికాదు. పాత జ్ఞాపకాల పెన్నిధి అలనటి ఛాయాచిత్రాల, ఆల్బమ్‌ను చూస్తున్నంత సేపు ఎన్నో మధుర బంధాలు మాటలకందనిది, గుండెల్లో కూడుకట్టుకుంటాయి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### నైతిక విలువలను నేర్పించాలి

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో ఎల్కేజీ యూకేజీ నుండి డిగ్రీ స్థాయి వరకు విద్యార్థులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సోమవారం మధ్యాహ్నం విద్యార్థులకు నైతిక విలువల గురించి ఒక ప్రత్యేకమైన క్లాస్ బోధించాలి. విద్యార్థులను దండించడం, క్రమశిక్షణ నేర్పడం చాలా అవసరం. ఇది లేకపోవడం వలనసమాజంలోచాలా ఇబ్బందులుఎదురవుతున్నాయి. గురుకుల జూనియర్‌కళాశాలలో విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. కొన్నిచోట్ల స్మోకింగ్ మద్యం సేవించడం వ్యవసాయ బావులలో స్నానాలకు వెళ్లడం జరుగుతుంది. హౌస్ మాస్టర్ పర్మిషన్ లేకుండా బయట జులాయిగా తిరుగుతున్నారు. గురువులను గౌరవించడం, పూజించడం, నమస్కరించడం, సీనియర్లను గౌరవించడం,జూనియర్లను ప్రేమించడం, కుటుంబ సభ్యులను,పెద్దలను గౌరవించడం వంటి నైతిక విలువలను విద్యార్థులకు తప్పనిసరిగా నేర్పించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### ప్రత్యామ్నాయ పంటలవైపు రైతులు

పాలకుర్తి జనగామ దారిలో ప్రయాణం చేస్తుంటే కలవరం అవుతున్నది. వాన చినుకుల మీద ఆధారపడి నాట్లు వేసిన భూములు కొన్ని బోరుబావులపైన ఆధారపడి వేసిన నాట్లు ఇవన్నీ దేనికి సంకేతం. మునుపటి బీడు తెలంగాణకే. ఇందులో ఎంత మాత్రం సందేహం లేదు. తెలంగాణ విశిష్ట పంటలవైపు రైతులను మళ్లించడం కనీసం ఒక అర ఎకరమైనా మునుగా వైపు మళ్లించడం చేయాలి.ఏడాది పాటు ఉపాధి హామీ స్థిరీకరణ సాధ్యం అవుతుంది. అంతే కాదు గ్రామీణా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా ఉంటుంది.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# ఆకలి మరణాలను అదుపు చేయలేమా?

***భారత దేశంలో జరిగే ఆకలి మరణాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కప్పి పుచ్చుతున్నాయని అనేక మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తు న్నారు. ఒకవ్యక్తి ఆకలితో మరణించినప్పుడు, పోస్టుమార్టమ్ నివేదికలో మరణానికి గల కారణాన్ని పోషకాహార లోపంతో వచ్చిన గుండె వైఫల్యం లేదా అతి సారవ్యాధి అని రాస్తారే తప్ప నేరుగా ఆకలిచావు అని నమోదు చేయరని రైట్టుఫుడ్ క్యాంపియన్ వంటి సంస్థలు చెబుతున్నాయి. భారతదేశంలో జరుగుతున్న ఆకలిచావులను ఈ నేపథ్యంలో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా పేదరికానికి, ఆకలి మరణాలకు పెట్టుబడి దారీ, భూస్వామ్య వ్యవస్థలే కారణం. ఈ వ్యవస్థల స్థానం లో నూతన ప్రజాతంత్ర వ్యవస్థలు, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడినప్పుడే పేదరికం తొలిగి ఆకలిమరణాలు ఆగుతాయి. అందుకు వెనుకబడిన దేశాల, పెట్టుబడి దారీ దేశాల ప్రజలు నేటివ్యవస్థల మార్పు కోసం ఉద్యమించాలి.***

**బొల్లిముంత సాంబశివరావు**

పెట్టుబడిదారీ వ్యవస్థ పేదలను, ధనికులను సృష్టిస్తుంది. కష్టజీవులు, కార్మికులు ఉత్పత్తుల ద్వారా సంప దలు సృష్టించినా దానిపై హక్కు లేక పేదరికంలో మగ్గుతున్నారు. ఏ కష్టం చేయని వారు సంపన్నులు అయ్యారు. పెట్టుబడిదారులుగా మారిన వీరు అనేక దేశాల్లో పారిశ్రామిక రంగాన్ని తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వెనుకబడిన దేశాల్లో సేద్యం చేయని భూకామందుల వద్ద భూమి పోగుబడి ఉంది. సేద్యం చేసే గ్రామీణ పేదలు భూమికి దూరం అయ్యారు. ఈ నేపథ్యంలోనే ప్రజల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు తీవ్రమైనాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన ఆర్థిక వ్యత్యాసాల వల్ల మొత్తం ప్రపంచ సంపదలో 10 శాతం కుబేరుల వద్ద 75శాతం సంపద ఉంటే, 90 శాతం ప్రజల వద్ద 25శాతం సంపద మాత్రమే ఉంది. అత్యంత ధనవంతులైన 1శాతం కుబేరుల వద్ద37శాతం పైగాసంపద పోగుబడి ఉంది. ప్రపంచంలో 100 బిలియన్ల అమెరికా డాలర్ల కంటే ఎక్కువ సంపద కలిగిన వారి సంఖ్య 15 శాతానికి చేరింది. ఎలన్‌మస్క్ 936 బిలియన్ యుఎస్ డాలర్లు, లారీఫేజ్ 299 బిలియన్ డాలర్లు, సెర్గీబ్రిన్ 275 బిలియన్ డాలర్లు, మైఖేల్డెల్ 229 బిలియన్ డాలర్లు, జెఫ్బెజోస్ 225 బిలియన్ డాలర్లతో ప్రపంచటాప్ ఐదుగురు కుబేరులుగా ఉన్నారు. భారతదేశంలో అత్యధిక ఆర్థిక అసమానతలు ఉన్నట్లు, ప్రపంచ అసమానతల నివేదిక తెలిపింది. టాప్ 10శాతం కుబేరుల వద్ద దేశం మొత్తం సంపదలో 65శాతం ఉండగా, వీరిలో ఒకశాతం అత్యంత కుబేరుల వద్ద ఏకంగా 40శాతం సంపద ఉంది. దిగువ 50 శాతం ప్రజల వద్ద కేవలం 15శాతం సంపద ఉంది. పెట్టుబడిదారీ విధానాల ఫలితంగా ప్రపంచంలో ఆర్థిక అసమానతలతో పాటు సంపద కొద్ది మంది వద్ద పోగుబడి ఉండటం వల్ల ప్రపంచంలో పేదరికం తీవ్రంగాఉంది. ప్రపంచజనాభాలోని 70కోట్లకు పైగా ప్రజలు అంతర్జాతీయ దారిద్ర్యరేఖ ప్రకారం తీవ్ర పేదరికంలో ఉన్నారు. రోజుకి మూడుఅమెరికా డాలర్లు, భారతీయ కరెన్సీలో 250 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవించే వారిని తీవ్ర పేదరికంలో ఉన్నవారిగా అంతర్జాతీయ సంస్థలైన ఐక్యరాజ్యసమితి, ప్రపంచ బ్యాంక్ పరిగణిస్తున్నాయి. సబ్సహారా ఆఫ్రికా ప్రాంతం అత్యంత పేద ప్రాంతం. అక్కడ సుమారు 4కోట్ల, 30 లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. భారత దేశం పేద జనాభా సంఖ్యరీత్యా ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది.దేశంలో 23.4 కోట్ల మంది తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారని ఐక్యరాజ్య సమితి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రోజు వారి ఆదాయం మూడు డాలర్లకన్నా తక్కువ ఉన్నవారిని ప్రామాణికంగా తీసుకుంటే, భారతదేశంలో తీవ్రపేదరికంలో ఉన్నవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటుంది. దేశం రోజు మూడు డాలర్ల ఆదాయం అత్యధిక ప్రజలకు లభించకపోవడమే అందుకు కారణం. భారతదేశంలో, పాకిస్థాన్, ఇథియోపియా, నైజీరియా దేశాలకన్నా పేదలు ఎక్కువగా ఉన్నారు. సంపద వ్యత్యాసాల వల్ల ప్రజలు



పేదరికంలో మగ్గుతూ ఆకలితో అలమటిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 90 లక్షల మంది ప్రజలు ఆకలితో మరణిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ,వివిధ అంతర్జాతీయ సంస్థల నివేదికల ప్రకారం ఈ గణాంకాలు నమోదు అయ్యాయి. ప్రతిరోజు ప్రపంచవ్యాప్తంగా 25 వేల మంది ఆకలి వల్ల మరణిస్తున్నారు. యుద్ధాలు, అంతర్గత కలహాలు నడుస్తున్న దేశాల్లోనే ఆకలి వల్ల వేలాది మంది చనిపోతూన్నారని ఆక్స్ఫాం నివేదిక పేర్కొంది. ఆకలి మరణాలలో మూడింట ఒకవంతు (30లక్షల మంది ) 5 సంవత్సరాలలోపు ఉన్న చిన్న పిల్లలే ఉంటున్నారు. తీవ్ర ఆహార లోపం వల్ల పిల్లల రోగనిరోధక శక్తి క్షీణించి, సాధారణ వ్యాధులు కూడా ప్రాణాంతకం అవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం 73.3కోట్లమంది ప్రతిరోజు రాత్రిపూట ఆకలితో నిద్రపోతున్నారు. సూడాన్, పాలస్తీనా(గాజా) దక్షిణ సూడాన్ ,హైతీ, మాలి వంటి దేశాల్లో కరవు పరిస్థితులు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయి. 2030 నాటికి ఆకలి రహిత ప్రపంచం అనే ఐక్యరాజ్యసమితి లక్ష్యం నెరవేరేపరిస్థితి కనుచూపు మేర కల్పించడంలేదు. భారతదేశంలోతాజా గ్లోబల్ హంగర్ ఇండెక్స్ ప్రపంచవ్యాప్తంగా సర్వేచేసిన123 దేశాల్లో, భారతదేశం ఆకలిసూచిలో 102వ స్థానంలోఉంది. మన దేశానికి లభించిన 25.8స్కోర్తో ఆకలి పోషకాహార లోపం తీవ్రతను తీవ్రమైనదిగా వర్గీకరించారు. దేశ జనాభాలో అవసరమైన క్యాలరీల ఆహారం లభించని వారు 12 శాతంగా ఉన్నారు. 5 ఏళ్లలోపు పిల్లల్లో వయస్సుకు తగ్గ ఎత్తులేని పిల్లలు32.9శాతంగా ఉన్నారు. ప్రతి ముగ్గురులో ఒకరు ఎత్తుకు తగ్గ బరువు లేరు. తీవ్రపోషకాహార లోపం ఉన్నపిల్లలు 18.7శాతం ఉన్నారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ నివేదిక ప్రకారం దేశంలో 50 మంది గర్భిణీలుస్త్రీలు, కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఐక్య రాజ్యసమితి నివేదిక ప్రకారం భారతదేశంలో తీవ్ర పోషకాహార లోపం వల్ల 5సంవత్సరాలలోపు పిల్లలు ఏటామూడు లక్షలకుపైగా చనిపోతున్నారు. భారతదేశంలో ప్రత్యక్షంగా ఆకలిలేక అన్నం లేక చనిపోయిన వారి మరణాలు నమోదు కాలేదని, దేశంలో ఆకలి చావులు లేవని కేంద్రప్రభుత్వం చెబుతున్నది. కాని అంతర్జాతీయ సంస్థలు (యునిసెఫ్, ఎఫ్ఎఒ) వివిధ స్వచ్ఛంద సంస్థల పరిశోధనల ప్రకారం తీవ్రమైన పోషకాహార లోపం వల్ల ఏర్పడే అనారోగ్య సమస్యల వల్ల భారత్లో ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారు. భారత దేశంలో జరిగే ఆకలి మరణాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కప్పి పుచ్చుతున్నాయని అనేక మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవ్యక్తి ఆకలితో మరణించినప్పుడు, పోస్టుమార్టమ్ నివేదికలో మరణానికి గల కారణాన్ని పోషకాహార లోపంతో వచ్చిన గుండె వైఫల్యం లేదా అతి సారవ్యాధి అని రాస్తారే తప్ప నేరుగా ఆకలిచావు అని నమోదు చేయరని రైట్టుఫుడ్ క్యాంపియన్ వంటి సంస్థలు చెబుతున్నాయి. భారతదేశంలో జరుగుతున్న ఆకలిచావులను ఈ నేపథ్యంలో చూడాలి. ప్రపంచవ్యాప్తంగా పేదరికానికి, ఆకలి మరణాలకు పెట్టుబడి దారీ, భూస్వామ్య వ్యవస్థలే కారణం. ఈ వ్యవస్థల స్థానంలో నూతన ప్రజాతంత్ర వ్యవస్థలు, సోషలిస్టు వ్యవస్థలు ఏర్పడినప్పుడే పేదరికం తొలిగి ఆకలిమరణాలు ఆగుతాయి. అందుకు వెనుకబడిన దేశాల, పెట్టుబడి దారీ దేశాల ప్రజలు నేటివ్యవస్థల మార్పు కోసం ఉద్యమించాలి. ●

# నీటి ప్రాజెక్టులతోనైనా రైతుల కష్టాలు తీరుతాయా?

**దాడిశెట్టి శ్యామ్ కుమార్**

దేశంలో ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి సాధారణ స్థాయి కన్నా తక్కువగా ఉండడం వలన వ్యవసాయరంగంపై ఆధారపడిన రైతాంగం వర్షం లేకపోవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉందనిపిస్తుంది. ఈ క్రమంలో నీటివనరులపై ఆధారపడాల్సి వచ్చినా బోర్లు చెరువులు కుంటల్లో నీరు అడుగంటి పోవడం నీటి కరువు తలపించే విధంగా ఉన్నందున వ్యవసాయ రంగంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న అతి ముఖ్యమైన సమస్యగా ఉంటుంది. వర్షాభావం అనుకున్న స్థాయిలో లేకపోవడం ఒక ఎత్తుఅయితే, ప్రస్తుతం నైరుతి రుతుపవనాల ప్రభావం అంతగా వ్యవసాయ రంగంపై ప్రభావం చూపకపోవడం మరోఎత్తుఅవుతున్నది. దీనికి తోడు సూపర్ ఎల్‌నినో వాతావరణ ప్రభావం కూడా ఉన్నట్టు చర్చ జరుగుతోంది. తద్వారా రైతులు జూన్ మాసంలో ఖరీఫ్ పంటలు వేసుకునేందుకు పెట్టుబడి పెట్టి పొలాన్ని చదును చేసి విత్తనాలను నాటే సమయంలో వర్షాలు అనుకున్న స్థాయిలో కురవకపోవడం ముఖ్యంగా వరి పొలానికి కావలసిన నీరు తగినంత నిలువ లేకపోవడం వ్యవసాయంపై ఆధారపడి జీవించే రైతాంగానికి ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం నిరాశను కలిగిస్తున్నాయి. వరి, మొక్కజొన్న పత్తి లాంటి వాటిని పండించడానికి జూన్ మాసం నుండి అనుకూలంగా ఉన్నప్పటికీ, ఎల్‌నినో ప్రభావం అధికంగా ఉండడం ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో వ్యాపార వాణిజ్య పంటలను పండించే రైతులు సాగు నీరు లేక వ్యవసాయ సేద్యానికి అనుకూలంగా లేని పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఈ ఏడాది వర్షాకాలంలో సాధారణ వర్షపాతం కూడా లేకపోవడం వ్యవసాయ రంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపెడుతున్నాయి. సాగు నీటితో పాటు ప్రజలకుసరిపడా త్రాగునీరు లేకపోవడం నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతుండడం విచారకరం. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటలను పండించాలి అనుకున్న రైతులు సంకోచిస్తున్నారు. ఇప్పటికే వరినాట్లు వేసి వర్షంకోసం ఎదురు చూస్తున్నరైతులు వేరేపంటలు వేయడానికి ముందుకుపోలేకపోతున్నారు. మొక్కజొన్న పత్తిలాంటి పంటలను సాగుబడి చేయాలన్నా కావలసిన భూగర్భనీటినిల్వలు ఎండిపోతుండంతో ఇలాంటి గడ్డు పరిస్థితుల్లో ఏ పంటను వెయ్యాలోఅర్థంకాని పరిస్థితిలో కొందరు రైతులు సందిగ్ధంలో ఉంటున్నారు. గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో సైతం నీటి ఎద్దడి నెలకొని బావులు చెరువులు కుంటలు ఎండి పోవడం వలన త్రాగు నీటితో పాటు సాగునీరు కూడా ఇప్పట్లో అనుకూలంగా లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన నీటి ప్రాజెక్టుల మీద రైతులతో పాటు ప్రజానీకంకొండంత ఆశలు పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా శ్రీశైలం నాగార్జున సాగర్ కాళేశ్వరం లాంటి భారీనీటి ప్రాజెక్టులు తెలంగాణలో ఉన్నప్పటికీ,దేవాదుల ప్రాజెక్టు తప్పమిగతా ప్రాజెక్టుల నుండి మరింతగా జలాశయాలు విడుదల కావలసి ఉంది అనే చర్చజరుగుతుంది. అయితే కరవు పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని రాజకీయాల కతీతంగా కారణాలేవైనా ఇంతకాలం నీటిని ఎత్తిపోయలేని కాళేశ్వరం ప్రాజెక్ట్ లోపాలను సరిదిద్ది అవసరమైన నీటిని అందించేందుకు ప్రభుత్వాల ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతాయనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నవారు లేకపోలేదు. త్వరితగతిన పనులు సఫలమైతే త్రాగునీటికి సాగునీటికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉండగలదని అభిప్రాయపడుతున్న వారులేకపోలేదు. ప్రస్తుతం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తెలంగాణలో కొంతమేర సహకరిస్తుందని అనుకున్నప్పటికీ గత రెండు మూడుసంవత్సరాల నుండి కారణాలేవైనా కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు త్రాగునీరు సాగునీరును అందించలేని పరిస్థితిలోఉండడం గమనార్హం. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు తెలంగాణ ప్రాంతానికి విరివిగా నీరు అందించింది అని చెప్తున్నారు కానీకాళేశ్వరం ప్రాజెక్టు స్థితిగతుల గురించి నిపుణులతో లోపాలను సవరించే విధానంలో ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉండడం కొంత ఆశాజనకంగా కనబడుతుంది. ఒకవేళ కరవుపరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఇలానే కొనసాగితే ఎలాంటి పరిస్థితులనైనా తట్టుకొని ప్రాజెక్టులనుండి వీలైనంత త్వరగా నీటిని ఎత్తిపోతల ద్వారా తెలంగాణకు కరవు నుండి విముక్తి కలిగించే దిశగా రాజకీయాల కతీతంగా ప్రభుత్వాలు కూడా సానుకూలంగా ఆలోచించడం శుభ పరిణామం. రాష్ట్రంలో ఎక్కువ శాతం ప్రజలువ్యవసాయంపై ఆధారపడి జీవిస్తుంటారు అలాంటి వ్యవసాయాధారిత రైతాంగానికి ఖరీఫ్,రబీ కాలాలు చాలా ముఖ్యమైనవి వర్షాకాలంలో అంత జూన్ మాసం నుండి ఖరీఫ్ సీజన్ ప్రారంభదశ నుండి పండించవలసినపంటలు అవసరమైన నీరులేకపోవడంతో వర్షాభావం తక్కువ ఉండడంతో కొంతమంది నాటువేయడానికి కూడా వెనుకంజ వేస్తున్నారు. వేసిన విత్తనాలు సరిగామొలకెత్తని పరిస్థితు లు నెలకొంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ రైతులకు ఖరీఫ్ సీజన్ జూన్‌మాసం నుండి ఆగస్టు వరకు వ్యవసాయానికి అనుకూలం అయినప్పటి కనీసంసెప్టెంబర్ నెల వరకైనా కరవుపీడిత ప్రాంతాల్లో పంటలు పండించాలంటే అవసరమైన పూర్తిసాగునీరు అందాల్సి ఉంటుంది. తద్వారా ఖరీఫ్ పంటలను రైతులు చేయగలిగితే ఆహార ఉత్పత్తులతో రైతులకు లాభసాటిగా ఉండడమే కాకుండా ప్రజలకు ఆహారధాన్యాల కొరత సమస్య తీరిపోతుందేమో అయితే అక్టోబర్ డిసెంబర్ మధ్యలో రబీసీజన్‌ప్రారంభమవుతుంది. కాబట్టి పూర్తిస్థాయిలో ఈలోపే సాగునీరు తాగునీరు అందాల్సిన అవసరం ఉంటుంది. తద్వారా రైతులు కనీసం రబీ సీజన్‌లలోనైనా పంటలను పండించేందుకు సన్నద్ధంగా ఉండగలుగుతారు. అందుకు వర్షభావం కూడా అనుకూలంగా ఉండాలి లేకుంటే ప్రాజెక్టులనుండివచ్చేసాగు నీరైనా వ్యవసాయ రంగానికి అందేలా చూడాలి. ●

# హైడ్రోజన్ రైళ్లు పట్టాలపై కొత్త మలుపు

**తిప్పర్తి శ్రీనివాస్**

భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి నాంది పలికింది. శతాబ్దాలుగా దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన రైల్వే వ్యవస్థ ఇప్పుడు పర్యావరణ పరిరక్షణ దిశగా మరింత ముందడుగు వేస్తోంది. దేశంలో తొలిసారిగా హైడ్రోజన్ ఇంధన ఆధారిత రైలును ప్రవేశపెట్టడం ద్వారా భారత రైల్వే రంగం సాంకేతిక పరివర్తనలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇది కేవలం ఒక కొత్త రైలు ప్రారంభం మాత్రమే కాదు, భవిష్యత్‌లో స్వచ్ఛమైన, స్థిరమైన రవాణా వ్యవస్థ నిర్మాణానికి దిశా నిర్దేశం చేసే పరిణామం. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం వంటి సమస్యలు మానవాళికి పెద్ద సవాళ్లగా మారాయి. రవాణా రంగం కార్బన్ ఉద్గారాలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అన్వేషణ వేగవంతమైంది. సౌర, పవన విద్యుత్‌లతో పాటు హైడ్రోజన్ ఇంధనం భవిష్యత్తు శక్తి వనరుగా ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో భారత రైల్వే హైడ్రోజన్ సాంకేతికతను స్వీకరించడం పర్యావరణ అనుకూల అభివృద్ధి వైపు ఒక సాహసోపేతమైన అడుగుగా భావించాలి. హైడ్రోజన్ రైళ్ల ప్రత్యేకత ఏమిటంటే ఇవి సంప్రదాయ డీజిల్ ఇంజిన్ల మాదిరిగా కాలుష్యకరమైన ఉద్గారాలను విడుదల చేయవు. హైడ్రోజన్ ఇంధన కణాలు (ఫ్యూయల్ సెల్స్) ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసి రైలును నడిపిస్తాయి. ఈ ప్రక్రియలో ప్రధాన ఉపఉత్పత్తిగా నీటి ఆవిరి మాత్రమే విడుదల అవుతుంది. ఫలితంగా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ వంటి హానికర వాయువుల మోతాదు తగ్గుతుంది. ఇది పర్యావరణ పరిరక్షణకు మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించేందుకు కూడా ఉపయోగపడుతుంది. హైడ్రోజన్ రైలు మరో ముఖ్యమైన లక్షణం స్వయం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం. విద్యుత్ గ్రిడ్‌పై పూర్తిగా ఆధారపడకుండా, రైలులోనే హైడ్రోజన్ ఆధారిత వ్యవస్థ ద్వారా అవసరమైన శక్తిని ఉత్పత్తి చేసుకోవడం సాధ్యమవుతుంది. ముఖ్యంగా విద్యుదీకరణ పూర్తికాని రైల్వే మార్గాల్లో ఈ సాంకేతికత ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. దేశంలోని మారుమూల ప్రాంతాల్లో రైల్వే కనెక్టివిటీని మెరుగుపరచడంలో కూడా ఇది కీలక పాత్ర పోషించవచ్చు. ప్రపంచ స్థాయిలో పరిశీలిస్తే హైడ్రోజన్ రైళ్ల వినియోగం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. హైడ్రోజన్ ఆధారిత రైలును తొలిసారిగా ప్రవేశపెట్టిన దేశంగా జర్మనీ గుర్తింపు పొందింది. అక్కడ ఈ సాంకేతికతపై ప్రయోగాలు జరిపి పరిమిత స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చారు. ఫ్రాన్స్, ఇటలీ, చైనా, జపాన్ వంటి దేశాలు కూడా హైడ్రోజన్ రవాణా వ్యవస్థపై



పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇది ఇంకా అభివృద్ధి చెందుతున్న రంగమే. ఈ పరిస్థితుల్లో భారత్ ఈ సాంకేతికతను స్వీకరించడం దూరదృష్టితో కూడిన నిర్ణయంగా చెప్పవచ్చు. అయితే హైడ్రోజన్ రైళ్ల ప్రయాణం సవాళ్ల రహితమైనది కాదు. హైడ్రోజన్ ఉత్పత్తి, నిల్వ, రవాణా వంటి అంశాలు సాంకేతికంగా క్లిష్టమైనవి. ముఖ్యంగా పర్యావరణానికి అనుకూలమైన 'గ్రీన్ హైడ్రోజన్' ఉత్పత్తి చేయడానికి పునరుత్పాదక ఇంధనవనరుల వినియోగం పెరగాలి. ప్రస్తుతం హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చు అధికంగాఉండటం కూడా ఒక ప్రధాన సవాలు. ఈ సమస్యలను అధిగమించేందుకు పరిశోధనలు, పెట్టుబడులు,ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాలు అవసరం. భద్రత విషయంలో కూడా ప్రత్యేక జాగ్రత్తలు అవసరం. హైడ్రోజన్ అత్యంత తేలికైన,మండేవాయువు కావడంతో దాని నిర్వహణలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి. అయితే ఆధునిక హైడ్రోజన్ రైళ్లలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంధన నిల్వ ట్యాంకులు, పీడన నియంత్రణ పరికరాలు,అత్యవసర రక్షణ వ్యవస్థలు వంటి సాంకేతిక పరిజ్ఞానాలు ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పిస్తాయి. భారతదేశం 2030 నాటికి కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ లక్ష్య సాధనలో రైల్వే రంగం కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. ఇప్పటికే విద్యుదీకరణ, సౌర విద్యుత్ వినియోగం, శక్తి సామర్థ్య పెంపు వంటి చర్యలు చేపడుతున్న భారతీయ రైల్వే ఇప్పుడు హైడ్రోజన్ సాంకేతికతను కూడా స్వీకరిస్తోంది. ఇది దేశం గ్రీన్ ఎనర్జీ మార్గంలో సాగుతున్నదానికి నిదర్శనం. అయితే హైడ్రోజన్ రైలును ప్రారంభించడం అంతిమ లక్ష్యం కాదు. అది ఒక ప్రారంభం మాత్రమే. ఈ సాంకేతికతను విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరం. దేశీయంగా హైడ్రోజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, మౌలిక వసతులను అభివృద్ధి చేయడం, ఖర్చులను తగ్గించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అప్పుడే హైడ్రోజన్ రైళ్లు భారత రవాణా వ్యవస్థలో కీలక భాగంగా మారగలవు. భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు కాలానుగుణ మార్పులను స్వీకరించింది. ఆవిరి ఇంజిన్ల నుంచి డీజిల్, విద్యుత్ రైళ్ల వరకు సాగిన ప్రయాణం ఇప్పుడు హైడ్రోజన్ యుగంలోకి అడుగుపెడుతోంది. ఈ పరిణామం కేవలం సాంకేతిక అభివృద్ధి కాదు, పర్యావరణ బాధ్యతతో కూడిన జాతీయ సంకల్పానికి ప్రతీక. భవిష్యత్ భారతదేశం శుభ్రమైన శక్తిఆధారంగా అభివృద్ధి చెందాలంటే ఇలాంటివినూత్న ప్రయత్నాలు మరింత వేగం పుంజుకోవాలి. హైడ్రోజన్ రైలు భారత రైల్వేకు మాత్రమే కాదు, దేశ హరిత భవిష్యత్తుకు ఒక ఆశాకిరణం. సాంకేతికత, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక అభివృద్ధి ఈ మూడు అంశాలను సమన్వయం చేసే మార్గంలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి. సరైన విధానాలు, నిరంతర పరిశోధనలు, ప్రజల సహకారంతో హైడ్రోజన్ విప్లవం భారత రవాణా రంగాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ●

# కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మతో మంత్రి అచ్చెన్నాయుడు భేటీ

## • రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ బలోపేతంపై కీలక చర్చలు



**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు న్యూఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి తదితర అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు మరింత మెరుగైన మద్దతు అందించడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చేపట్టాల్సిన చర్యలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, రైతులకు మార్కెట్ సౌకర్యాలు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, పంటల విలువ ఆధారిత ఉత్పత్తుల ప్రోత్సాహం వంటి అంశాలను మంత్రి అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ దృష్టికి తీసుకెళ్లారు.

రైతుల ఆదాయాన్ని పెంచే విధంగా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధికి ఉన్న విస్తృత అవకాశాలను కూడా ఈ సందర్భంగా చర్చించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం, మౌలిక వసతులు, సముద్రతీరం, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు వంటి అనుకూలతలను వినియోగించుకుని మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అచ్చెన్నాయుడు వివరించారు. పరిశ్రమల అభివృద్ధి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధితో పాటు పారిశ్రామిక పురోగతికి సమాన ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై కేంద్ర సహకారం, సమన్వయంతో ముందుకు సాగేందుకు ఇరువురు నేతలు సానుకూలంగా చర్చించారు. రాష్ట్రానికి అవసరమైన సహకారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, పరిశ్రమలు, గ్రామీణాభివృద్ధి రంగాల్లో మరింత వేగంగా పురోగతి సాధించేందుకు ఈ భేటీ దోహదపడుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## గిరిజనుల సమస్యలపై అధికారుల సమావేశం

### - మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశాలు జారీ



**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజనుల సమస్యల పరిష్కారానికి బుధవారం సమావేశం నిర్వహించాలని అధికారులకు మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సమష్టిగా నిర్ణయం తీసుకోవాలని పిలుపు నిచ్చారు. జీవో నం.3 పునరుద్ధరణకు ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారని మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. 1/70 చట్టంతో పాటు అన్ని గిరిజన సమస్యలపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందన్నారు. జీవో నం.3 పునరుద్ధరణ కోసం న్యాయ నిపుణులు, గిరిజన సంఘాల నాయకులతో పలుమార్లు సంప్రదింపులు నిర్వహించినట్లు చెప్పారు. అన్ని ఐటీడీఏల పరిధిలో గిరిజన ప్రతినిధులు, సంఘాల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరించిందన్నారు.

గిరిజనులకు 50 ఏళ్లకే పెన్షన్, విద్య, వైద్యం, ఐటీడీఏల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వెల్లడించారు. 1/70 చట్టం గిరిజనుల హక్కు అని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నాయన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో బాక్సైట్‌కు గత వైసీపీ ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలపై అనుమతులు నిలిపివేస్తూ గిరిజనుల ప్రయోజనాలను కాపాడుతోందన్నారు. గిరిజన బిడ్డల భవిష్యత్తు, సంక్షేమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని.. గిరిజనులకు అండగా నిలిచేది చంద్రబాబు, కూటమి ప్రభుత్వమే అని మంత్రి సంధ్యారాణి స్పష్టం చేశారు.

## విశాఖ పోర్టులో కార్గో హ్యాండ్లింగ్ మూలాపేట పోర్టుకు మళ్లింపు

### • పరిశీలించనున్న మంత్రుల కమిటీ: మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి వెల్లడి

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖపట్నాన్ని ప్రపంచ స్థాయి ఐటీ సేవలు, ఐటీ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి అనుగుణంగా, నగరాన్ని పరిశుభ్రమైన, కాలుష్య రహిత. పర్యావరణ అనుకూల నగరంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు. ఈ క్రమంలో, ప్రస్తుతం విశాఖ పోర్ట్ అథారిటీ ద్వారా నిర్వహిస్తున్న దుమ్ము వ్యాప్తికి కారణ మయ్యే బొగ్గు, ఖనిజాలు, ఇతర కాలుష్య కారకాలైన బల్క్ కార్గో హ్యాండ్లింగ్‌ను సమీపం లోని మూలాపేట పోర్టుకు దశలవారీగా మళ్లించే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తు న్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ చర్యలు మూలాపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు ఆపరేషన్లు ప్రారం భించే తొలి రోజు నుంచే కార్గో హ్యాండ్లిగ్‌లో కమర్షియల్ గా విజయవంతంగా పనిచేయడానికి తోడ్పడతాయని మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అమల్లోకి రావడం ద్వారా విశాఖ పోర్టు పై ప్రస్తుతం ఉన్న కార్గో హ్యాండ్లింగ్ ఒత్తిడి తగ్గడంతో పాటు, ఓడల



టర్న్ అరౌండ్ టైమ్ మెరు గుపడి, షిప్పింగ్ సంస్థలపై పడుతున్న అదనపు ఆర్థిక భారం కూడా తగ్గే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో విశాఖ నగరంలో వాయు కాలుష్యం తగ్గి, ప్రజల జీవన నాణ్యత ప్రమాణాలు మరింత మెరుగుపడు తాయని, స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధి జరుగతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనలో భాగంగా, మూలా పేట పోర్టు స్పెషల్ పర్పస్ వెహికల్‌లో 49-50 ఈక్విటీ భాగస్వామ్యాన్ని కల్పించాలని విశాఖ పోర్ట్ అథారిటీ ప్రతిపాదించినట్లు మంత్రి తెలిపారు. అలాగే నామినేషన్/ ఆర్‌వోఎఫ్ఆర్ విధానంలో తొలి ఫేజ్‌లో 2 బెర్తులు, 2వ ఫేజ్‌లో 2 బెర్తులు కేటాయించాలని కోరుతుంది. ఎస్‌పీవీకి బదిలీ చేసే ఉప్పుభూములకు న్యాయ మైన విలువను నిర్ణయించాలని కూడా ప్రతిపాదించినట్లు మంత్రి వివరించారు.

విశాఖ పోర్ట్ అథారిటీ సమర్పించిన ఈ ప్రతిపాదనలను సమగ్రంగా పరిశీలించి, భాగ స్వామ్య విధివిధా నాలను రూపొందించి, పరస్పర ఆమోద యోగ్యమైన సిఫార్సులను ప్రభుత్వం ముందుం చేందుకు ఇప్పటికే రామాయపట్నం పోర్టుకు సంబంధించిన అంశాలపై మంత్రులు పయ్యావుల కేశవ్, బిసి జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్ నేతృత్వంలో ఏర్పడిన మంత్రుల కమిటీ ఈ అంశాన్ని కూడా పరిశీలించనున్నట్లు మంత్రి తెలిపారు. మంత్రుల బృందానికి పెట్టుబడులు మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీలు సహకరిస్తూ అవసరమైన సాంకేతిక, పరిపాలనా అంశాలపై, సిఫార్సుల రూపకల్పనకు తోడ్పాటును అందించనున్నట్లు మంత్రి బిసి జనార్దన్ రెడ్డి తెలిపారు.

## షూటింగ్‌లో బాలకృష్ణకు స్వల్ప గాయాలు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 21 ప్రభాతవార్త:** ఓ సినిమా షూటింగ్ జరుగు తుండగా ప్రముఖ సినిమా నటుడు, హిందూ పురం శాసనసభ్యుడు హీరో నందమూరి బాలకృష్ణకి స్వల్ప గాయాలయ్యాయి. ఫైటింగ్ సీన్ సందర్భంగా జారీ పడడంతో అయిన మోకాలికి స్వల్పంగా గాయపడ్డారు. కాకినాడ పోర్ట్‌లో గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రానున్న సినిమాకు సంబంధించి మంచు మనోజ్, బాలకృష్ణ మధ్య యాక్షన్ సీన్స్ చిత్రీకరణ సన్నివేశాలు చిత్రీకరిస్తుండగా కాలుజారి పడిపోవడంతో మోకాలుకు స్వల్ప గాయం జరిగిందని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. నాలుగు రోజులుగా కాకినాడలో ఈ సినిమా షూటింగ్ కోసం వచ్చిన ఆయన సందడి చేశారు. అదేవిధంగా కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి సీనియర్ నేతలు పిల్లి అనంత లక్ష్మీ సత్యనారాయణ ఇంటికి వెళ్లారు. షూటింగ్ సందర్భంగా తమ హీరో బాలకృష్ణకి గాయపడ్డారన్న విషయం తెలిసి అభిమానులు కలవరపడ్డారు. అయితే స్వల్ప గాయాలని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్తారని చిత్ర యూనిట్ సబ్యుల సమాచారం. ప్రస్తుతం కాకినాడలోనే విశ్రాంత తీసుకుంటున్నారు.

## బాలకృష్ణ త్వరగా కోలుకోవాలి: సిఎం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు షూటింగ్ సెట్‌లో స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమాచారం తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. సెట్‌లో బాలకృష్ణ గారికి గాయమైందని తెలిసి ఆయనతో మాట్లాడాను. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఆయనది అలుపెరగని స్ఫూర్తి. త్వరలోనే మళ్లీ షూటింగ్‌కు హాజరవుతారు. త్వరగా కోలుకోండి" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

### జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్ కూడా...

బాలకృష్ణ కండరానికి గాయమైందన్న విషయం తెలియగానే కుటుంబ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ కూడా బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అభిమానులు, శ్రేయోభిలాషులు సామాజిక మాధ్యమాల వేదికగా ఆయనకు మద్దతుగా సందేశాలు పంపుతున్నారు. బాలకృష్ణ పూర్తిగా కోలుకున్న వెంటనే సినిమా షూటింగ్ తిరిగి ప్రారంభం కానుంది. ఇక బాలకృష్ణను చంద్రబాబు ఫోన్‌లోను పరామర్శించారు.

### మావయ్య త్వరగా కోలుకోవాలి: నారా లోకేష్

నందమూరి బాలకృష్ణకు తన 111వ సినిమా షూటింగ్‌లో స్వల్ప గాయమైంది. ఈ విషయం తెలుసుకున్న ఆయన అల్లుడు, ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వెంటనే ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. "బాలా మావయ్య త్వరగా కోలుకోవాలి" అంటూ మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షి ంచారు.

## మోసం కేసులో ఈటా దేవి, గేదెల సన్యాసప్పడు ఆస్తుల జప్తునకు ప్రభుత్వం ఆదేశం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని మోసగించిన కేసులో ఏ3 ఈటా దేవి, గేదెల సన్యాసప్పడుకు చెందిన మొత్తం రూ.2.39 కోట్ల విలువైన స్థిరాస్తుల జప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ నగరంలో ఈటా దేవి, గేదెల సన్యాసప్పడు పలువురి నమ్మబలికారు. వారి నుంచి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుని మొహం చాటేసారు. దాంతో బాధితులను పోలీసులను ఆశ్రయించారు. ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని మోసగించడంపై వీరిపై విశాఖ ఎంవీపీ కాలనీలో 2025లో పోలీసులు కేసు నమోదు చేశారు.

# 'ఓటు' హక్కు ఒక్కటే కాదు, బాధ్యత కూడా..!

### • ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం... దేశ భవిష్యత్తు తీర్చిదిద్దే అమూల్యమైన శక్తి ఉంది

### • ఓటర్ల అర్హత, అత్యుత్తమ విధానాలపై అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో పలువురు వక్తలు



**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త:** ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రజల భాగస్వామ్యమే అసలైన బలమని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే అమూల్యమైన శక్తి అని పలువురు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. ఓటు హక్కు అనేది కేవలం రాజ్యాంగం కల్పించిన హక్కు మాత్రమే కాదని, ప్రతి పౌరుడు నిర్వర్తించాల్సిన అత్యున్నత బాధ్యత కూడా అని వారు స్పష్టం చేశారు. ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ (ఐఐఐడిఇఎం), ఇసిఐ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ (ఐడియా), ఎపి సిఇఒ సంయుక్త ఆధ్వర్యంలో ఓటర్ల అర్హతలపై విజయవాడలో మంగళవారంనాడు అంతర్జాతీయ వర్క్‌షాప్ జరిగింది.

ఈ కార్యశాలకు ఇసిఐ, ఐఐఐడిఇఎం, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఎన్నికల విభాగాల ప్రతినిధులు, విద్యావేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు భౌతికంగా, వర్చువల్‌గా హాజరయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కాగా, రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్, అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ నిమ్మగడ్డ రమేష్ కుమార్, రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) వివేక్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శా తదితరులు పాల్గొన్నారు.

ఓటు వేయడం కోసం ప్రజలు తమ జీవనోపాధిని లేదా ఉద్యోగాలను వదిలి సొంత ఊళ్లకు రాకుండా, ఎన్నికల ప్రక్రియలో వారిని ఎలా భాగస్వాములను చేయాలనే దానిపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ వ్యాప్త అత్యుత్తమ విధానాల అధ్యయనం, సమాచార మార్పిడికి ఇలాంటి కార్యశాలలు ఉపయోగపడతాయని అనిల్‌చంద్ర పునేఠా పేర్కొన్నారు.

పొరుగు దేశాలతో చూస్తే మన భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్టంగా ఉందని.. ఇందుకు ప్రధాన కారణం ఎలక్షన్ కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తితో, విచక్షణతో పనిచేయడమేనని రమేష్ కుమార్ పేర్కొన్నారు. కీలమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్)కు సంబంధించి బిఎల్‌ఒలకు సరైన శిక్షణ అందించి, వారి బాధ్యతను గుర్తుచేస్తూ ఇక్కడి కలెక్టర్లు ముందుకు తీసుకెళ్లడం హర్షణీయమని రమేష్ కుమార్ పేర్కొన్నారు.

భారత్ ఈ ఏడాది ఇంటర్నేషనల్ ఐడియా కౌన్సిల్ బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా భారత ఎన్నికల సంఘం సూచనల మేరకు మన రాష్ట్రం ఈ కీలకమైన అధ్యయన బాధ్యతను చేపట్టినట్లు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ (సిఇఒ) వివేక్ యాదవ్ మాట్లాడుతూ తెలిపారు. సమ్మిళిత, శాంతియుత, స్థితిస్థాపక, సుస్థిర ప్రపంచం కోసం ప్రజాస్వామ్యం అనే ప్రధాన ఇతివృత్తంతో ఇంటర్నేషనల్ ఐడియాకు భారత్ అధ్యక్షత వహిస్తున్నట్లు వివరించారు.

ఓటర్ల అర్హత అంశంపై 9సోపానాల ద్వారా క్షేత్రస్థాయి అధ్యయనం చేసి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో వినియోగించేలా నమూనా ప్రమాణాలను రాష్ట్రం రూపొందిస్తోందని పేర్కొన్నారు. అనర్హులైన ఓటర్ల పేర్లను తొలగించి, 18 ఏళ్లు నిండిన అర్హులందరికీ ఓటు హక్కు కల్పించి పారదర్శకమైన, లోపరహితమైన ఓటర్ల జాబితాను తయారు చేయడమే ఎస్ఐఆర్ లక్ష్యమని తెలియజేస్తూ కార్యక్రమం ప్రగతిని సీఈవో వివేక్ యాదవ్ వివరించారు.

అంతర్జాతీయ అత్యుత్తమ విధానాలు, ఓటర్ల అర్హతకు సంబంధించి అంతర్జాతీయ అంశాలు, అంతర్జాతీయ డేటా మోడల్స్ తదితర అంశాలపై వివిధ యూనివర్సిటీల ప్రముఖులు, తదితరులు పవర్ పాయింట్ ప్రజంటేషన్స్ ఇచ్చారు.

## ఎఐ డేటా సెంటర్ కోసం ఆర్‌ఐఎల్‌కు భూ కేటాయింపు ఉత్తర్వుల్లో మార్పులు

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయనగరం జిల్లాలో ఆర్ఐఎల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో కూడిన గిగాస్థాయి ఏఐ డేటా సెంటర్ భూ కేటాయింపు ఉత్తర్వుల్లో ప్రభుత్వం మార్పులు చేసింది. ఈ మేరకు భూ కేటాయింపు జీవో నంబర్ 30లో మార్పులు చేసింది. గతంలో రెవెన్యూ డిపార్టుమెంట్ నేరుగా ఎపిఐఐసీకి భూములు అప్పగించాలని తెలిపింది. 75 శాతం భూమి ఖరీదు ఏపీఐఐసీకి చెల్లించాలని గతంలో ఉత్తర్వులు ఇచ్చింది. కానీ ఇప్పుడు ఆర్ఐఎల్‌కు అవసరమైన భూమిని ఏపీఐఐసీ సమకూర్చాలని సవరణ ఉత్తర్వులు ఇచ్చింది. భూమి లేని పక్షంలో భూసేకరణ చేసి అప్పగించాలని సవరించిన ఉత్తర్వులలో ఆదేశాలిచ్చింది.

## పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌పై కేసు

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా పామర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌పై కేసు నమోదైంది. సోమవారం నాడు పీఎస్‌లో హంగామా సృష్టించడంతో పాటు పోలీసు విధులకు అడ్డుపడ్డారంటూ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కైలే అనిల్‌తో పాటు మరికొందరు వైఎస్సార్సీపీ నేతలపై కేసు నమోదుచేశారు. సోషల్ మీడియా పై ఫిర్యాదుతో స్టేషన్‌కు వచ్చిన అనిల్, వైఎస్సార్సీపీ నేతలు అక్కడ కేసు నమోదు కోసం సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఈ ఘటనపై డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఫిర్యాదును అనుసరించి కేసు నమోదైంది.

# జగన్ ఒక్క చాన్స్ అంటూ వచ్చి డయాఫ్రమ్ వాల్ ధ్వంసం చేశారు!

### • 2019లో టిడిపి ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తయ్యేది • జలవనరుల శాఖపై మంత్రి నిమ్మల శ్వేతపత్రం విడుదల



**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.24,611 కోట్లు ఖర్చు చేయగా అందులో రూ.12,484 కోట్లు రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. 36 ప్రధాన ప్రాజెక్టులను రూ.35,555 కోట్లతో 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు రూపొందిం చిన కార్యాచరణ ప్రణాళికను మంత్రి వివరిం చారు. తెలుగుదేశం పార్టీకి ముందు తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత అన్నట్లుగా రాష్ట్ర ఇరిగేషన్ రంగాన్ని చూడాలని మంత్రి అన్నారు. విధ్వంస మైన జలవనరుల రంగాన్ని రెండేళ్లలో గాడిలో పెట్టి ఇరిగేషన్ క్యాలెండర్ ప్రకటించుకుని ముందు కెళ్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. 2019 లో ప్రభుత్వం కొనసాగి ఉంటే పోలవరం 2021 కల్లా పూర్తయ్యేదని గుర్తు చేశారు. జగన్ ఒక్క చాన్స్ అంటూ వచ్చి డయాఫ్రమ్ వాల్ ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. గత 2 ఏళ్లలో రూ.1050 కోట్లు ఖర్చు చేసి జులై 2026 నాటికి పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి నీటి సరఫరా లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి వివరించారు. పూర్తికాని వెలుగొండను జాతికి అంకితం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని మంత్రి నిమ్మల ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో గొడ్డలి పార్టీ రూ.981 కోట్లు వెలుగొండకు వెచ్చిస్తే గత రెండేళ్లలో రూ.1108.12 కోట్లు ఖర్చు చేశామని స్పష్టం చేశారు. రూ.3,870 కోట్లతో హంద్రీనీవా 2 దశల పనులు 100 రోజుల్లో పూర్తి చేశామని వెల్లడించారు. జలవనరుల శాఖపై సచివాలయం లో మంత్రి శ్వేతపత్రం విడుదల చేశారు. ముఖ్యమైన ప్రాజెక్టులు 2024నాటి పరిస్థితులు తాజా స్థితిగతులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టుకు భూములిచ్చిన నిర్వాసితులు మోసానికి గురయ్యారని పాద యాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గొడ్డలి పార్టీ మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులను ఏనాడు పట్టించుకోని వైఎస్సార్సీపీకి ప్రాజెక్టుపై మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఏజెన్సీలు, కాంట్రాక్టులు రద్దు చేయవద్దని చెప్పినా గత ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఎవరెంత హెచ్చరించినా గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఖాతరు చేయలేదని మంత్రి నిమ్మల అన్నారు. 17 నెలల పాటు ఏజెన్సీ, అధికారులు లేకుండా రివర్స్ టెండరింగ్ పేరుతో గత ప్రభుత్వం తప్పిదం చేసిందని 2020లో వచ్చిన వరదలకు డయాఫ్రంవాల్ దెబ్బతిందని నిపుణులు చెప్పారని తెలిపారు. 17 నెలలపాటు కాలయాపన చేయడమే తప్పిదమని నాడు చెప్పారని ఇంకా ఇది ప్రకృతి తప్పిదం కాదని మానవ తప్పిదమని నాటి ప్రభుత్వానికి నిపుణులు రిపోర్టు ఇచ్చారని వెల్లడించారు.

**భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవ ఏర్పాట్లు**

# యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

### ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో సిఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్



**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** భోగా పురం అంతర్జాతీయ విమా నాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమంపై సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభమయ్యే భోగా పురం అంతర్జాతీయ విమా నాశ్రయం ఉత్తరాంధ్రకు గ్రోత్ ఇంజన్‌గా మారు తుందని ముఖ్యమంత్రి ఆంకాక్షించారు. టెలికాన్ఫ రెన్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ "ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగేలా అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేశాం. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్ర మాన్ని ఇంటింటికీ తీసుకెళ్లాలి. ప్రతి పౌరుడ్ని భాగస్వామిని చేయాలి. ఉత్తరాంధ్ర కు మణిహారంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిలుస్తుంది. ఆగస్టు 1వ తేదీన అల్లూరి సీతారామరాజు ఇంటర్నేష నల్ ఎయిర్ పోర్టును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభిస్తారు. ఎయిర్ పోర్టు పాసింజర్ టెర్మినల్, ఏవియేషన్ యూనివ ర్సిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్, ఎడ్యుసిటీలను ప్రారం భించుకోబోతున్నాం. అంతర్జాతీయ విమా నాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించుకోవాలి. అల్లూరి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు ఏపీకి ఓ లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అంది స్తుంది. రాష్ట్ర అభివృద్ధికి ఇది ఓ గేమ్ చేంజర్. ఎయిర్ పోర్టుతో పాటు ఏఐ డేటా సెంటర్లు, రేర్ ఎర్త్ మినరల్స్ లాంటి ఖనిజాలు ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మారు స్తాయి. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు టేకాఫ్ అయితే ఉత్తరాంధ్రతో పాటు యావత్ రాష్ట్రానికి కీలక ప్రాజెక్టుగా మారుతుంది. ఈ ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులను, యజ మానుల్ని గౌరవిస్తూ ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పిస్తున్నాం. వచ్చే 9 రోజుల పాటు ఉత్తరాంధ్రలోని ప్రతీ ఇంటా ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తి చేరాలి. ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించే బాధ్యత తీసుకోవాలి. అరకు కాఫీ, ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలు, స్థానిక కళారూపాలను కూడా ఘనంగా ప్రదర్శిద్దాం. విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో భోగాపురం ఎయిర్ పోర్టు ఎంతటి కీలకమైన పాత్రపోషిస్తుందో ప్రజలకు వివరించి చెప్పాలి. పరిశ్రమలు, టూరిజం, లాజిస్టిక్స్, ఉపాధి అవకాశాలు పెద్ద ఎత్తున వచ్చే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్లి అని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.



# సమన్వయంతో ముందుకెళ్లండి

### • భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవ ఏర్పాట్లుపై రాష్ట్ర ఉన్నతాధికారుల సమీక్ష

**విజయనగరం, జులై 21 ప్రభాతవార్త:** భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆగస్టు 1వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభం కానున్న నేపథ్యంలో, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఈ పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ప్రధాని పర్యటన కార్యక్రమం నోడల్ ఆఫీసర్ ఎంటీ కృష్ణబాబు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, పీఎం కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ వీరపాండ్యన్ మంగళవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ కృష్ణబాబు మాట్లాడుతూ ప్రధాని ప్రయాణించే మార్గంలోని 4 లైన్ల ట్రంపెట్ రోడ్డు పనులను జులై 28 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధానికి స్వాగతం పలికే మార్గంలో స్పష్టమైన ప్రొఫెషనల్ సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనే కళాకారులు, విద్యార్థులకు ప్రత్యేకంగా తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. హోల్డింగ్ ఏరియాల్లో 15 ఎల్ఈడీ స్క్రీన్లను ఐ అండ్ పీఆర్ శాఖ సలహాతో ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ప్రతి పార్కింగ్ ప్రాంతంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, సీసీ కెమెరాలతో పాటు సభా ప్రాంగణంలో దిశానిర్దేశక సూచిక బోర్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రత్యేక కార్యదర్శి వీరపాండ్యన్ మాట్లాడుతూ, వివిధ శాఖలతో సమన్వయం కోసం జీఎంఆర్ సంస్థ తరఫున ప్రత్యేక లైజన్ అధికారులను నియమించాలని చెప్పారు. ప్రారంభోత్సవానికి సుమారు 2 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున, టెలికాం సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశమై అదనపు మొబైల్ టవర్లు, తాత్కాలిక నెట్‌వర్క్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎలాంటి అంతరాయం లేకుండా 24 గంటల నిరంతరాయ కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భోగాపురం ఎయిర్పోర్టు నుంచి వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సభా ప్రాంగణంలోని ప్రతి ఎన్‌క్లోజర్‌కు 10 చొప్పున వాటర్ బబ్లర్లు, పేపర్ కప్పులతో తాగునీరు ఏర్పాటు చేస్తున్నామని, మొత్తం 500 మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేరం ఆధునికమైతే... పోలీసింగ్ అంతకంటే ఆధునికం కావాలి

**● ఫ్యాక్షన్ నుంచి సైబర్ నేరాల వరకు కఠిన పోరు ● ఈగల్ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌తో నేరాలపై ఉక్కుపాదం ● 112 స్పందన వేగం పెంపు... మహిళలపై నేరాలు తగ్గింపు ● సాంకేతిక పోలీసింగ్‌తో దేశానికే ఆదర్శంగా ఏపి ● 'ఫ్యూచర్‌రెడీ: ఏపి పోలీస్ రిట్రీట్-2026' వర్క్‌షాప్‌లో హోంమంత్రి వంగలపూడి అనిత**





**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** నేరాల స్వరూపం రోజురోజుకు సాంకేతికత ఆధారంగా మారుతున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ కూడా అంతకంటే ఆధునికంగా, వేగవంతంగా, ప్రజా కేంద్రీకృతంగా రూపాంతరం చెందాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలోని డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన రిట్రీట్‌లో ముఖ్య అతిథిగా మంత్రి అనిత పాల్గొన్నారు. కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన ఆమె ఉద్వేగభరితంగా మాట్లాడుతూ ఒక నేరంగా జరిగిన సందర్భంలో ఘటనపై పోలీసు సత్యశోధన జరిగే లోపుగానే సామాజిక మాధ్యమాలు తప్పుడు ఇన్వెస్టిగేషన్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. నేర నియంత్రణతో పాటు వాస్తవాలను పక్కదోవపట్టించే పరిస్థితులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ఉన్నత పోలీసు అధికారులను ఉద్దేశించి హోం మంత్రి అనిత మాట్లాడుతూ. 2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన పోలీసు సంస్కరణల రిట్రీట్ సంప్రదాయాన్ని 25 సంవత్సరాల అనంతరం అదే దూరదృష్టి, అదే సంస్కరణల స్ఫూర్తితో పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున ఈ కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, డిజిపి కార్యాలయం, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు, వామపక్ష తీవ్రవాదం, మతకలహాలను గణనీయంగా అదుపులోకి తీసుకురాగలిగామని పేర్కొన్న హోంమంత్రి, ప్రస్తుతం సైబర్ నేరాలు, రౌడీయిజం, సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆధునిక నేరాలను ఎదుర్కోవడానికి పోలీసులు కూడా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం పెరుగుతోందని, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారాన్ని వాస్తవాలు, ఆధారాలతో తిప్పికొట్టే బాధ్యత పోలీసులదే నని అన్నారు. ప్రతి ఘటనపై ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించడం ద్వారా పోలీసు వ్యవస్థపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యత అని పేర్కొన్న మంత్రి, మహిళలపై నమోదవుతున్న నేరాలను సుమారు నాలుగు శాతం తగ్గించగలిగామని తెలిపారు. గంజాయి నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈగల్ వ్యవస్థ ద్వారా ఎస్పీలు, పోలీసు అధికారులు సమన్వయంతో గంజాయి సాగు, అక్రమ రవాణాపై సమర్ధవంతమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. 112 అత్యవసర స్పందన వ్యవస్థ ద్వారా స్పందన సమయాన్ని గణనీయంగా తగ్గించామని, పోలీసింగ్‌లో 'గోల్డెన్ టైమ్స్' అత్యంత కీలకమని హోంమంత్రి పేర్కొన్నారు. వేగవంతమైన స్పందన వల్ల నేరస్థులను త్వరగా అదుపులోకి తీసుకురావడంతో పాటు బాధితుల్లో భరోసా పెరుగుతుందని అన్నారు. పోలీసు శాఖ బలోపేతానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే 6,000 మంది కానిస్టేబుళ్ల పోస్టులను భర్తీ చేశామని, భవిష్యత్తులో కూడా ప్రతి జాబ్ క్యాలెండర్‌లో కొత్త పోలీసు పోస్టులను భర్తీ చేస్తూ శాఖను మరింత బలోపేతం చేస్తామని హోంమంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్ఠం చేయడానికి, నూతన తరహా నేరాలను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ రెండు రోజుల రిట్రీట్‌లో మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణ, సైబర్ భద్రత, రౌడీయిజం నిర్మూలన, ఫ్యాక్షన్ రాజకీయాల నియంత్రణ, వామపక్ష తీవ్రవాద నిర్మూలన, మతసామరస్య పరిరక్షణ వంటి ఆరు కీలక అంశాలపై వర్కింగ్ గ్రూపులు చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. క్షేత్రస్థాయి అనుభవాల ఆధారంగా రూపొందే సూచనలు రాష్ట్ర పోలీసింగ్‌కు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికగా మారనున్నాయని చెప్పారు. 'నేరం ఎంత ఆధునికమైనా... ఆంధ్రప్రదేశ్ పోలీసింగ్ దానికంటే ఒక అడుగు ముందే ఉంటుంది. సాంకేతికత, వేగవంతమైన స్పందన, పారదర్శకత, ప్రజల విశ్వాసం ఆధారంగా ఫ్యూచర్‌రెడీ ఏపి పోలీస్ వ్యవస్థను నిర్మించి దేశానికే ఆదర్శంగా నిలబెడతాం' అని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా, రాబోయే 20సంవత్సరాల సవాళ్లను ఎదుర్కొనే అత్యాధునిక పోలీసింగ్ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమన్నారు. మారుతున్న నేరాల స్వరూపాన్ని దృష్టిలో పెట్టుకుని 10 కీలక అంశాలతో కూడిన భవిష్యత్ కార్యాచరణను రూపొందించినట్లు వెల్లడించారు. సాంప్రదాయ పోలీసింగ్‌కు బదులుగా డిజిటల్, టెక్నాలజీ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశాల నుంచి జరిగే సైబర్ మోసాలు, డీప్‌ఫేక్‌లు, అనామక సైబర్ బెదిరింపులను ఎదుర్కొనేందుకు ముందస్తు నిఘా వ్యవస్థలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డ్రోన్ నిఘా, నిర్వహణ కోసం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. భౌతిక అర్హతలతో పాటు కోడింగ్, క్రిప్టోగ్రఫీ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో నైపుణ్యం కలిగిన యువతను పోలీస్ బలగాల్లోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. అత్యవసర సేవల 112 కాల్ వచ్చిన వెంటనే క్షణాల్లో స్పందించే వ్యవస్థను అభివృద్ధి చేయడం, పోలీస్- వైద్య- మహిళా సంక్షేమ శాఖల సమన్వయంతో గృహ హింస, ఆత్మహత్యలు, బాలలపై నేరాల నివారణకు డిజిటల్ హెల్త్ అండ్ సేఫ్టీ గ్రిడ్, ప్రిడిక్టివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలను వినియోగంలోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాల సాధన కోసం స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికతో ఏపీ పోలీస్ శాఖ ముందుకు సాగుతుందని డిజిపి హరీష్ స్పష్టం చేశారు.

## స్త్రీ, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై నేడు అసెంబ్లీ కమిటీ సమావేశం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** స్త్రీ, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ ఈనెల 22వ తేది బుధవారం ఉ.10.30 గం.లకు అసెంబ్లీ కమిటీ హాల్లో మహిళా, శిశు, దివ్యాంగ, సీనియర్ సిటిజన్స్ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ సమావేశం అసెంబ్లీ కమిటీ హాల్లో జరగనుందని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర తెలియజేశారు.

## గురుకుల సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ద్వారా నిర్వహించబడుతున్న ప్రతిష్టాత్మక సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటిగ్రేటెడ్ ఐఐటి, జెఇఇలలో ఉచిత శిక్షణతో కూడిన జూనియర్ ఇంటర్మీడియట్, సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపిసి /బైపిసి కోర్సులలో ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సొసైటీ జాయింట్ సెక్రటరీ (అకాడమిక్) డా. ఐ. శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని మేఘాద్రిగడ్డ (విశాఖపట్నం జిల్లా), అమరావతి తాడికొండ (గుంటూరు జిల్లా), కోట (నెల్లూరు జిల్లా)లలోని మూడుసెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలలో ఈ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆమె వివరించారు. మార్చి 2026లో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ఉత్తీర్ణులై, కనీసం 85శాతం, అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు జూనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులని, అలాగే మార్చి 2026 జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 75శాతం మార్కులు సాధించిన విద్యార్థులు సీనియర్ ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ద్వారా నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యతో పాటు ప్రముఖ శిక్షణ సంస్థల అధ్యాపకులచే సమగ్రమైన ఐఐటి, జెఇఇ, నీట్ ప్రవేశ పరీక్షలకు నాణ్యమైన కోచింగ్, పూర్తి ఉచిత వసతి, పౌష్టికాహార భోజనం, స్టడీ మెటీరియల్‌ను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మొత్తం సీట్లలో 75శాతం సీట్లు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు, 25శాతం సీట్లు ఇతర వర్గాల విద్యార్థులకు కేటాయించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులు అధికారిక వెబ్‌పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించడానికి జులై 30, 2026 చివరి తేదీ అని తెలియజేశారు. ఇప్పటికే ఇతర జూనియర్ కళాశాలల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు కూడా ఈ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, ఎంపికైన పక్షంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో ప్రవేశం పొందవచ్చని సూచించారు. అర్హత గల విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా. ఐ. శ్రీదేవి ఆ ప్రకటనలో కోరారు.

## తప్పు దిద్దుకున్న టిటిడి అధికారులు... ఆ అధికారి పోస్టింగ్‌పై వెనుకడుగు

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ టిటిడిలో ముఖ్యంగా తిరుమలలో విధులు నిర్వహించడానికి ఉద్యోగులు, అధికారులు ఉత్సాహం చూపుతుంటారు. రోజువారీగా విదులకు హాజరయ్యే ముందు శ్రీవారి ఆలయంలోనికి ప్రవేశించే అవకాశంతో బాటు ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుని ఆ తరువాత విధులు నిర్వహించే వీలుంది. అలాంటిది తిరుమలలో ఏ విభాగంలో అయినా పోస్టులు ఖాళీ అయితే అక్కడ విదులకు పెద్ద ఎత్తున ఉత్సాహం చూపుతుంటారు. టిటిడికి సంబంధించి తిరుపతి పరిపాలన భవనంలో గానీ, స్థానిక ఆలయాల్లో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులు తిరుమలకు రావడానికి వారివారి స్థాయిలో సిఫార్సులు కూడా చేసుకుంటారు. టిటిడి తిరుపతి జెఇఒ ఉద్యోగుల బదిలీలపై, పోస్టింగ్‌లపై సిఫార్సుచేస్తే అదనపు ఇఒ, ఇఒలు వారి అంగీకారం తెలియజేసి అవసరమైన మేరకు సంబంధిత ఉద్యోగులను బదలీ చేస్తుంటారు. అలాంటిది తిరుమలలో ఇటీవల ఖాళీ అయిన ఇంజనీరింగ్ విభాగంలోని డిప్యూటీ ఇఇ -ఉత్తర సెక్షన్ టి.వీరప్రసాద్ పదవీ విరమణ స్థానంలో తిరుపతిలోని ఎఇఇ పిఎంవి సుబ్రమణ్యంకు పోస్టింగ్ కల్పించారు. అయితే ఆయన ఇదివరకే సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం, గతంలో అరెస్ట్ అయిన సందర్భంలో ఉద్యోగులకు స్వీట్లు పంచిపెట్టడం జరిగింది. ఈ విషయం తెలిసినా టిటిడి ఉద్యోగుల నుండి వ్యతిరేకత వచ్చినా ఇఒ, సిఇలు ఆ వివాదాస్పద అధికారికి తిరుమలలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ విషయంపై దూమరం రేగడంతో మంగళవారం ఆ అధికారిని అక్కడ నుండి మళ్ళీ రిలీవ్ చేసి బదలీ చేశారు. ఆ స్థానంలో వేణుగోపాల్‌ను నియమించారు. అయితే ఆ అధికారి నోటిదురుసుతోనే ఈ రాద్ధాంతం జరిగిందని ఉద్యోగుల్లో చర్చ. అయితే టిటిడి ఇఒ, అదనపు ఇఒ, జెఇఒలతో బాటు సిఇ వివాదాస్పద అధికారికి ఎలా తిరుమలో పోస్టింగ్ ఇచ్చారనేది ఇప్పుడు సంచలనంగా మారింది. దీనిపై సిఎం చంద్రబాబునాయుడు కూడా ఆరా తీసినట్లు సమాచారం. మరీ టిటిడిలో జరుగుతున్న వివాదాస్పద విధానాలపై రానున్న రోజుల్లో ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఉద్యోగ వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఎట్టకేలకు గతనెల 30న జరిగిన టిటిడిలో ఈ వివాదస్పదమైన పోస్టింగును సిఇ సత్యనారాయణ సరిదిద్దడంతో వివాదం సద్దుమణిగింది.

## పిడుగు పడి వృద్ధుడు మృతి



**సంతకవిటి (శ్రీకాకుళం జిల్లా), జులై 21 ప్రభాత వార్త:** శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మల్లయ్యపేట గ్రామంలో పిడుగు పడి మూల కృష్ణమూర్తి (60) మృతి చెందారు. పొలంలో ఎదలో కలుపు తీస్తుండగా భారీ వర్షం పడింది. వర్షంతో పాటు ఉరుములు మెరుపులతో ఒక పిడుగు పడి కృష్ణమూర్తి అక్కడికక్కడే చనిపోయాడు. ఈయనకి ఇద్దరు మగ పిల్లలు కలరు. ఒకరు సబ్ ఇన్‌స్పెక్టర్, ఇంకొకరు ఎలక్ట్రికల్ ఏఈ. కృష్ణమూర్తి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అగ్నిప్రమాదంపై విచారణ జరపాలి



**తిరుపతి, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాద ఘటనపై టిఎన్ఎస్ ఎఫ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనపై పూర్తి స్థాయి సాంకేతిక, పరిపాలనా విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఆ సంఘం నేతలు డిమాండ్ చేశారు. టిఎన్ఎస్ఎఫ్ ప్రతినిధులు వెంకటేష్ నాయుడు, రాఘవేంద్ర, వెంకటరెడ్డి, దాదు, ఫక్రుద్దీన్, ఆదర్శ్ తదితరులు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుని కలిసి వినతిపత్రం అందజేశారు. ఫార్మసీ భవనం నిర్మాణ నాణ్యత, నిర్మాణ ప్రక్రియ, టెండర్ల మంజూరు, వ్యయ వివరాలు సంబంధిత రికార్డులపై సమగ్ర పరిశీలన చేపట్టి, పూర్తి నివేదికను బహిర్గతం చేయాలని కోరారు. అక్రమాలు వెలుగులోకి తీసి సంబంధిత బాధ్యులపై చట్టపరమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తిరుమల సమాచారం



## తిరుమలకు పోటెత్తిన భక్తులు

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం భక్తులు భారీగా చేరారు. కొండపై మంగళవారం ఉదయానికి వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 8 గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. మొక్కులు తీర్చుకునేందుకు సామాన్యభక్తులు పెద్ద సంఖ్యలో ఏడుకొండలకు చేరుకుంటుండటంతో తిరుమల కిటకిటలాడుతోంది. వైకుంఠం కంపార్టుమెంట్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వరకు 41వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. కాగా తిరుమలకు భక్తుల రాక పెరగడంతో అలిపిరి తనిఖీకేంద్రం వద్ద మంగళవారం ఉదయం భారీగా వాహనాలు బారులు తీరాయి. ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు, టిటిడి విజిలెన్స్ సిబ్బంది చర్యలు చేపట్టి వాహనాలను క్రమబద్ధంగా కొండపైకి అనుమతించారు. భక్తులు సహకరించాలని అలిపిరి ఎవిఎస్ఒ రమేష్ కృష్ణ విజ్ఞప్తి చేశారు.

## అలిపిరి కాలిబాటలో అడవి పందికి పూజలు



**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వరాహమూర్తిగా భావించి నుదుటిపై బొట్టు పెట్టి నమస్కరించిన యువతి ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో టిటిడి అటవీ శాఖ స్పందించింది. కాలినడక మార్గాల్లో అడవి జంతువుల వద్దకు వెళ్లడం ప్రాణానికే ప్రమాదమని హెచ్చరిక చేశారు. తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భక్తి విశ్వాసాలు అపారమైనా, ఆ భక్తి కొన్నిసార్లు హద్దులు దాటి ప్రాణాల మీదకు తెస్తుంటుందని పేర్కొన్నారు. తిరుమల నడకదారిలో ఓ యువతి వరాహ అవతారంగా భావించి ఓ అడవి పందికి ఆమె పూజలు చేయడం సంచలనంగా మారింది. కాలినడకమార్గాల్లో అడవి జంతువులను చూస్తే భయపడి భక్తులు దూరంగా వెళ్తారు. యువతి మాత్రం ధైర్యంగా ఆ అడవి పంది వద్దకు వెళ్లి, దాని నుదుటిపై కుంకుమ బొట్టు పెట్టి, నమస్కరించి పూజలు చేసింది. ఆ సమయంలో ఆ అడవి పంది కూడా ఎలాంటి హాని తలపెట్టకుండా నిశ్చలంగా ఉండిపోవడం ఆశ్చర్యం కలిగించింది. అక్కడున్న కొందరు ఈ దృశ్యాన్ని తమ ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది. అడవి పందులు అత్యంత క్రూరమైనవని, వాటి కోరలతో దాడి చేస్తే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. ఇదిలా ఉండగా తిరుమలలోనూ అతిథిగృహాలు, విశ్రాంతి గృహాల ప్రాంతాల్లో, ఆలయం పరిసరాల్లోనూ అడవిపందులు సంచారం ఉండటం విశేషం.



## 24 నుండి 26 దాకా గోవిందరాజస్వామి ఆలయంలో జ్యేష్ఠాభిషేకం

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామి ఉత్సవమూర్తులకు ఈనెల 24 నుండి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా జ్యేష్ఠాభిషేకం (అభిధేయక అభిషేకం) నిర్వహించనున్నారు. ఈ వార్షిక ఉత్సవంలో స్వామివారి స్వర్ణకవచాలను శాస్త్రోక్తంగా తొలగించి, పవిత్రంగా శుద్ధి చేసి తిరిగి అలంకరిస్తారు. 24వ తేదీ కవచాధివాసం, 25న కవచ ప్రతిష్ఠ, చివరగా 26న కవచ సమర్పణ జరుగుతుంది. ప్రతిరోజూ ఉదయం మహాశాంతి హోమం, పుణ్యాహవచనం, ఉదయం 10 గంటలకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం శతకలశ స్నపనం, సాయంత్రం వీధి ఉత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించబడతాయి. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో జ్యేష్ఠా నక్షత్రం సందర్భంగా నిర్వహించే ఈ జ్యేష్ఠాభిషేకం ద్వారా గోవిందరాజస్వామి భక్తులకు దివ్య మంగళ దర్శనమిచ్చి అనుగ్రహిస్తారని ఆలయ ఆగమ పండితులు పేర్కొంటున్నారు.

## వైభవంగా ద్రౌపదీదేవి కల్యాణం

**శ్రీకాళహస్తి, జులై 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహించబడుతున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో అంగరంగ వైభవంగా ద్రౌపదమ్మ కల్యాణం నిర్వహించారు. ఆలయ ఆవరణను ఓ కల్యాణ వేదికగా ముస్తాబు చేశారు. మామిడి తోరణాలు, అరటి మొక్కలతో చక్కగా తీర్చిదిద్దారు. హిందూ సంప్రదాయం ఉట్టిపడేలా మన సంప్రదాయాన్ని అద్దంపట్టే విధంగా ముస్తాబు చేశారు. వేదపండితులు వేద మంత్రాల్ని ఘోషిస్తుండగా సంప్రదాయబద్ధంగా కళ్యాణ తంతును ప్రారంభించారు. ఆలయ పూజారి దయానందం సూచనలతో పూజారులు పురుషోత్తం కార్యక్రమాల్ని నిర్వహించారు. ద్రౌపదీ దేవిని వధువుగా ముస్తాబు చేశారు. అర్జునుని వరుడుగా ముస్తాబు చేసి కళ్యాణ మండపం వద్దకు వేదమంత్రాలతో మేళ తాళాలు మంగళవాయిద్యాలతో చేర్చారు. ఇక్కడ హోమాలు, కల్యాణ మంత్రాలు, సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, డిప్యూటీ ఇఒ ఎన్ఆర్ కృష్ణారెడ్డి, ఉత్సవాల ఇన్‌చార్జి ఎఇఒ హేమామాలిని, లక్ష్మయ్య, పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించారు. కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. వేదపండితుడు అర్ధగిరి వేదమంత్రాల్ని పఠిస్తుండగా ఉభయదారులు హాజరు కాగా కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తరువాత గ్రామోత్సవం జరిపారు.



## సప్పరంలో అర్జునుని దివ్యదర్శనం

**శ్రీకాళహస్తి, జులై 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం అర్జునుడు సప్పరం వాహనంపై దివ్య దర్శనం ఇచ్చారు. అర్జున సమేత ద్రౌపదీదేవి, కృష్ణుడు ఉత్సవర్లను లంకార మండపంలో అలంకార గురుకుల్ చక్కగా ముస్తాబు చేశారు. పట్టణంలోని జయరామా రావు వీధి, తేరువీధి, బజారువీధి, నగరి వీధి, నెహ్రూవీధుల గుండా ఊరేగింపు సాగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు ఉత్సవాన్ని పర్య వేక్షించారు. ఇన్‌చార్జి లక్ష్మయ్య, దుర్గాప్రసాద్, సిబ్బంది వెంటరాగా ఊరేగింపు సాగింది.



## గుర్తుతెలియని భక్తుడు తిరుమలలో మృతి

**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో రెండవ వైకుంఠం కాంప్లెక్స్ కంపార్ట్మెంట్ 6 హాల్‌లో ఓ గుర్తుతెలియని భక్తుడు ప్రాణాలు కోల్పోయాడు. సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉన్నట్లుండి అనారోగ్య కారణంగా స్పృహ తప్పి పడి ఉండగా అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించి అతనిని అంబులెన్స్‌లో తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న డాక్టర్లు పరీక్షించి ఆ భక్తుడు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు కూడా లభించలేదు. గుండు చేయించుకొని ఉండి, ఎడమ చెవికి పోగు కుట్టబడి ఉంది, మెడలో తెల్ల పూసల దండ ధరించి ఉన్నాడు, కుడి చేయికి స్టీల్ కడియం, బ్రౌన్ కలర్ టీ షర్టు, బ్లూ రంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తించిన తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు గానీ, 0877 -2289027, 94407 96771 నంబర్లకు తెలపాలని పోలీసులు కోరారు.

## తిరుపతి జిల్లా కలెక్టర్‌తో సుగంధ ద్రవ్యాల బోర్డు సిఇఒ భేటీ



**తిరుపతి, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ అవార్డు అందుకున్న ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఎపిఎంఎపి) ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఇఒ) రాష్ట్ర అటవీశాఖ సీనియర్ అధికారి ఆవుల చంద్రశేఖర్ మంగళవారం తిరుపతికి విచ్చేశారు ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్‌ను కలిసి వివరాలు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో మొక్క, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఇటీవల లండన్ నగరంలోని బ్రిటన్ పార్లమెంట్ హౌస్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థ నుంచి అంతర్జాతీయ అవార్డు అందుకున్న సిఇఒ ఆవుల చంద్రశేఖర్ కృషిని కలెక్టర్ ప్రశంసించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమిష్టి కృషితోనే అంతర్జాతీయ అవార్డు దక్కిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో తనకు ఎంతగానో సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి సిఇఒ ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచ రికార్డు సాధించేలా ప్రోత్సహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి సత్యకుమార్‌కు, వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, రాష్ట్ర అటవీ శాఖ ఉన్నతాధికారులకు ఆవుల చంద్రశేఖర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బంగారునగలు భక్తుడికి అప్పగింత



**తిరుమల, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇష్టదైవమ్ ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు ఉన్నఫళంగా మరచివెళ్ళిన బంగారు నగలున్న విలువైన సంచిని అలిపిరి విజిలెన్స్ అధికారి సురక్షితంగా భక్తులకు అందజేశారు. సాధారణంగా అలిపిరి తనిఖీ కేంద్రంలో వాహనాలను దిగిన తరువాత భక్తులు వారివారి లగేజీలను క్షుణ్ణంగా తనిఖీకోసం స్కానర్‌లో వదలుతారు. స్కానింగ్ అయిన తరువాత భక్తులు తిరిగి సంచులను తీసుకోవాల్సి ఉంది. హైదరాబాద్‌కు చెందిన మహేష్ కుటుంబంతో తిరుమలకు వచ్చారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో నగలున్న సంచిని మరచిపోయాడు. విధుల్లో ఉన్న సిబ్బంది అలిపిరి ఏవిఎస్ఒ రమేశ్‌కృష్ణకు తెలిపారు. ఆయన వెంటనే సిసికెమెరా ఫుటేజీ గమనించి ప్రచారసాధనాల ద్వారా ప్రకటన చేయించడంతో అప్పటికే సంచిని మరిచిపోయిన విషయాన్ని తెలియజేసి భక్తుడిని వెంటనే కార్యాలయానికి పిలిపించుకున్నారు. పూర్తి వివరాలను ధృవీకరించిన అనంతరం వందగ్రాములు బంగారునగలునన్న సంచిని అప్పగించారు. టిటిడి యాజమాన్యానికి, విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది నిజాయితీ, అప్రమత్తత, సేవాభావాన్ని భక్తుడు మహేష్ అభినందించి కృతజ్ఞతలు తెలిపారు.

## కాణిపాకం ఆలయంలో సిబ్బంది చేతివాటం

**● ప్రత్యేక అభిషేకం టిక్కెట్ రొటేషన్ చేస్తూ పట్టుబడ్డ ఉద్యోగి**

**కాణిపాకం, జులై 21 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో పనిచేసే ఉద్యోగి తన చేతి వాటాన్ని ప్రదర్శించారు. మంగళవారం భక్తురాలి నుండి ప్రత్యేక అభిషేకంకు డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ఆలయంలోని అనుమతించడంతో తనికీల్లో ఉద్యోగి అవినీతి భాగోతం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... దేవస్థానంలో కార్తీక్ అనే వ్యక్తి ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈనేపథ్యంలో మంగళవారం ప్రత్యేక అభిషేకం టిక్కెట్ కౌంటర్‌లో విధులు కేటాయించారు. ఉదయం 9గంటలకు ప్రత్యేక అభిషేకంకు టిక్కెట్ కావాలని కౌంటర్‌లో విధులు నిర్వహిస్తున్న కార్తీక్‌ను ఓ భక్తురాలు కోరింది. అయితే డబ్బులు తీసుకుని టిక్కెట్ తన వద్దనే వుంచుకుని భక్తురాలిని ప్రత్యేక అభిషేకంకు లోనికి పంపించారు. ఈవిషయం అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. ఉద్యోగిపై శాఖాపరమైన చర్యలకు పూనుకున్నారు.

**అవినీతికి పాల్పడిని ఉద్యోగిపై చర్యలు తీసుకుంటాం:** కాణిపాకం దేవస్థానంలో భక్తురాలి నుండి డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ప్రత్యేక అభిషేకంకు ఆలయంలోనికి అనుమతించిన ఆలయ ఉద్యోగి కార్తీక్‌పై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు జరిగే పంచామృతాభిషేకంకు ఆలయ ఉద్యోగి కార్తీక్ భక్తురాలి నుండి డబ్బులు తీసుకుని టిక్కెట్ ఇవ్వకుండా ఆలయంలోని పంపినట్లు తనిఖీల్లో బయట పడినట్లు తెలిపారు. ఈమేరకు కార్తీక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత

**• విజయనగరం జిల్లాలో అభివృద్ధికి రూ.28 కోట్లు నిధులు • అందుబాటులోకి విఎంఆర్‌డిఎ జోనల్ కార్యాలయం • విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్**



**విజయనగరం, జులై 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనలతో గ్రామీణ ప్రాంతాలను పట్టణాలుగా తీర్చిదిద్దటానికి తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ వెల్లడించారు. మంగళవారం విజయనగరంలోని జోనల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రజాదర్బార్‌లో పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయం

ఎంఆర్‌డిఎ ఇప్పటివరకు పట్టణాల అభివృద్ధికి కీలక భూమిక పోషించిందని, ఐతే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వి ఎం ఆర్ డి ఎ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా విఎంఆర్‌డిఎ పరిధిలోని నాలుగు మునిపాలిటీలను బలోపేతం చేసేలా ఆయా ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు ఇందులో భాగంగానే విజయనగరం జిల్లాలో విజయనగరం, నెల్లిమర్ల మున్సిపాలిటీలకు గత రెండేళ్లలో ఇప్పటి వరకూ సుమారు రూ.28 కోట్లు నిధులు కేటాయించామని పేర్కొన్నారు. సీతం కళాశాల జెఎన్‌టియు మాస్టర్ ప్లాన్ రహదారిని సుమారు రూ.7.20 కోట్లతో 1.45కి.మీ పొడవున 80 అడుగుల వెడల్పుతో విస్తరణ చేపట్టామని పేర్కొన్నారు. విజయనగరం మున్సిపాలిటీ రూపురేఖలు మారేలా నిధులు కేటాయించామని, ఇందులో భాగంగానే విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు కోరిన మేరకు ఈ రెండేళ్లలో విజయనగరం మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.16 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. గత ఏడాది విజయనగరంలో గాంధీ, పిఎస్‌ఆర్ పార్కులను అభివృద్ధి చేసేందుకు సుమారు రూ.1 కోటి వరకు ఖర్చు చేశామని వివరించారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, ఇప్పటి వరకు రూ.10 కోట్లను ఇచ్చాం. ఈ నిధులతో రహదారులు, కాలువలు, కల్వర్టుల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. అలానే మరో రూ.5 కోట్లు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి కాగానే, రూ.5 కోట్లు విడుదల చేస్తామన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.4 కోట్ల వరకు కేటాయించటం జరిగిందనీ తెలిపారు.

### ఉడా పార్క్ తరహాలో అధునాతన సదుపాయాలతో మోడల్ పార్కు :

విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనపరుస్తున్నామని, విజయనగరంలో తగిన స్థలాలు కేటాయిస్తే విశాఖలోని ఉడా పార్క్ తరహాలో అధునాతన సదుపాయాలతో మోడల్ పార్కును అభివృద్ధి చేయటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా ప్రజల నుంచి వస్తున్న వినతులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

### అందుబాటులోకి జోనల్ కార్యాలయం

విఎంఆర్‌డిఎ పరిధిలో ప్రజలు తమ వినతులు ఇవ్వటానికి విశాఖలోని ప్రధాన కార్యాలయం వరకు రానవసరం లేదని, జిల్లా ప్రజల సౌకర్యార్థం విజయనగరం ఆనంద గజపతి ఆడిటోరియం ఆవరణలో జోనల్ కార్యాలయం అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ ప్రతీ మంగళవారం ప్రజాదర్బార్ జరుగుతుందని, అందువల్ల ప్రజలు ఇక్కడే విఎంఆర్‌డిఎకి సంబంధించిన వినతులు ఇవ్వవచ్చన్నారు. కార్యాలయం పర్యవేక్షణ కోసం విశ్రాంతి ఆర్‌డిఓ మహేశ్వరరావును జిల్లా సమన్వయాధికారిగా నియమించామని, ఆయన ఈ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని, ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మన్యం జిల్లాకు రెండు కుంకీ ఏనుగులు

**• డి.సిఎం పవన్ ఆదేశాలతో గుచ్చిమి క్యాంపునకు తరలించేందుకు ఏర్పాట్లు**

**• పలమనేరు శిబిరంలో అటవీ శాఖ అధికారుల సన్నాహాలు పూర్తి**

**• ఒడిశా సరిహద్దు గ్రామాల ప్రజలకు అడవి ఏనుగుల బెడద నుంచి ఉపశమనం**

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలతో రెండు కుంకీ ఏనుగులను పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ముసలమడుగు క్యాంపు నుంచి వీటిని పార్వతీపురం మన్యం జిల్లాలోని గుచ్చిమి క్యాంపుకి తరలించనున్నారు. పవన్ కళ్యాణ్ చొరవతో అడవి ఏనుగుల బెడదతో దీర్ఘకాలంగా పడుతున్న ఇబ్బందుల నుంచి పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలకు ఉపశమనం కలగనుంది. ఉపముఖ్యమంత్రి సూచనతో రాష్ట్రంలోని నానియాల్ ఏనుగుల శిబిరంలో ప్రత్యేక శిక్షణ పొందిన జయంత్ అనే కుంకీతో పాటు కర్ణాటక నుంచి తీసుకువచ్చిన అభిమన్యుని పార్వతీపురం మన్యం జిల్లాకి తరలించేందుకు అటవీ అధికారులు సిద్ధం చేశారు. ఈ రెండూ.. మానవ- ఏనుగు సంఘర్షణ నియంత్రణ కార్యక్రమాల్లో అత్యంత అనుభవం కలిగిన కుంకీ ఏనుగులు. ఇటీవల కాలంలో అభిమన్యు, జయంత్ లు ఆరు మేజర్ ఆపరేషన్లలో భాగస్వామ్యమై విజయవంతంగా పూర్తి చేశాయి. ఇటీవల పలమనేరు సమీపంలో



ఒంటరి మగ అడవి ఏనుగుని బంధించిన ఆపరేషన్ లో ఈ రెండు కుంకీలు అత్యంత కీలకంగా వ్యవహరించాయి. రెండింటి మధ్య సమన్వయం, ఆపరేషన్లలో పనితీరు తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సరిహద్దులకు ఒడిశా రాష్ట్రం నుంచి అడవి ఏనుగుల గుంపులు పదే పదే తరలివస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో చొరబడి పంటలను నాశనం చేయడంతో పాటు గ్రామాల మీద పడి విధ్వంసం సృష్టిస్తున్నాయి. అడవుల విభజన, అటవీ ఆవరణ తగ్గడం, ఆహారం, నీటి కొరత తదితర సమస్యల కారణంగా తరచూ అడవి ఏనుగులు ఒడిశా సరిహద్దుల నుంచి మన్యం జిల్లాకి చెందిన గ్రామాల్లో చొరబడుతున్నాయి. మన్యం జిల్లాలో ఏనుగుల బెడద నివారణకు ఒడిశా ప్రభుత్వంతో చర్చించి, తిరిగి మళ్లింపు చర్యలు చేపట్టడంతో పాటు ఆ రాష్ట్రం నుంచి కుంకీ ఏనుగులను కూడా తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. అంతకంటే ముందు తక్షణ ఉపశమన చర్యల్లో భాగంగా మన రాష్ట్రంలో అందుబాటులో ఉన్న రెండు కుంకీలను పలమనేరు నుంచి గుచ్చిమి క్యాంపుకి తరలించా లని ఆదేశించారు. గుచ్చిమి క్యాంపు నుంచి ఈ రెండు ఏనుగుల సహాయంతో సమస్యాత్మక ప్రాంతాల్లో సంఘర్షణల నియంత్రణ చర్యలు చేపడతారు. వీటితోపాటు సౌర కంచెల నిర్మాణం, ఏనుగులను నిరోధించేందుకు వీలుగా కందకాలు తవ్వడం, నీటి వనరుల అభివృద్ధి, ఏఐ ఆధారిత పర్య వేక్షణ, డ్రోన్ నిఘా, హనుమాన్ ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాలను అందుబాటులో ఉంచి, సమస్య తీవ్రత ఉన్న గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లాంటి చర్యలు పవన్ కళ్యాణ్ ఆదేశాలతో అమలు చేయనున్నారు.

## శాకంబరి ఉత్సవ ఏర్పాట్లపై ఇఒ సమీక్ష

**ఇంద్రకీలాద్రి, జులై 21 ప్రభాతవార్త:** విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో ఈనెల 27 నుండి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించబోతున్న శాకంబరి ఉత్సవ ఏర్పాట్లపై ఇఒ వికె శీనా నాయక్ అధికారులతో మంగళవారం సమీక్షించారు. శాకంబరి ఉత్సవాలకు విస్తృతంగా భక్తులు వచ్చే అవకాశమున్నందున ఏర్పాట్లు పకడ్బంధీగా చేయాలని ఇఒ అధికారులను ఆదేశించారు.

**దుర్గమ్మకి ఆషాఢం సారె:** దుర్గమ్మకి మంగళవారం పలువురు మహిళా భక్తులు ఆషాఢం సారె సమర్పించారు. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 7 రోజు మంగళవారం తరలివచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు 29 సారె బృందాలకు చెందిన 10,856 మంది భక్తులు సారె సమర్పణ చేశారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**దుర్గమ్మ సేవలో దేవాదాయ ట్రిబ్యునల్ చైర్ పర్సన్:** దుర్గమ్మని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ట్రిబ్యునల్ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన రిటైర్డ్ జిల్లా జడ్జి జస్టిస్ ఎ.భారతి మంగళవారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో కిషోర్ కుమార్ వారికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటో అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు.



ఆషాడం సారె సమర్పించి దుర్గమ్మకి మొక్కుతున్న భక్తబృందాలు

# తమ్మినేని సీతారాం భూ అక్రమాలపై చర్యలుంటాయి: మంత్రి అనగాని

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం భూ అక్రమాలపై తప్పకుండా చర్యలు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం మీడియాతో మంత్రి అనగాని మాట్లాడారు. వైసిపికి రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి అనగాని ధ్వజమెత్తారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే ఆర్ఎస్కోలు అని వెల్లడించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప.. వీటివల్ల ఏ ఒక్కరికీ నష్టం లేదని స్పష్టం చేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే వారు కూడా దీనిపై సానుకూలంగా స్పందించారని అన్నారు. కొందరు, కొన్ని రాజకీయ పార్టీల నేతలు స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కోలు ఓ నూతన సాంకేతిక విధానమని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## గీతం ఇంజనీరింగ్, సైన్స్ కోర్సులలో ప్రవేశాలు

**విశాఖపట్టణం, జులై 21 ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ (బి.టెక్, ఎమ్.టెక్), ఫార్మశీ (బి.ఫార్మశీ, ఎమ్.ఫార్మశీ), ఆర్కిటెక్చర్ (బి.ఆర్క్, ఎమ్.ఆర్క్), మేనేజ్‌మెంట్ (ఎంబిఎ, బిబిఎ, బికామ్), సైన్స్ (ఎమ్మెస్సీ, బిఎస్సీ, ఎమ్‌సిఎ, బిసిఎ), లా కోర్సులు, హ్యూమానిటీస్, నర్సింగ్, ఫిజియోథెరపి మరియు పారామెడికల్ కోర్సులలో 202627 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు జరుగుతున్నాయని అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

**ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్ కోర్సులకు:** ఇంజనీరింగ్ కోర్సులతో పాటు బిఫార్మశీ, ఎమ్.ఫార్మశీ, బిఆర్క్, ఎమఆర్క్ కోర్సులలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇంటర్మీడియట్ సైన్స్ కోర్సులతో పూర్తి చేసిన విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ద్వారా బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్ విత్ కాగ్నిటివ్ సిస్టమ్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, మేథ్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 4 సంవత్సరాల బిఎస్సీ(ఆనర్స్) కోర్సులు అడ్మిషన్ల డైరక్టర్ తెలిపారు. అలాగే 3సంవత్సరాల బిసిఎ కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పిజి స్థాయిలో అప్లైడ్ మేథ్స్, బయోకెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ, డేటా సైన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, మైక్రోబయాలజీ, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లలో 2 సంవత్సరాల ఎమ్మెస్సీ కోర్సులను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వీటితో పాటు మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసిఎ) కోర్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య రంగంలో పెరుగుతున్న ఉపాది అవకాశాలను దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రాంగణంలో బిఎస్సీ మెడికల్ ల్యాబోరేటరీ టెక్నాలజీ, బిఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్, ఫిజియోథెరిపి, నర్సింగ్ కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

**కామర్స్ , మేనేజ్‌మెంట్ కోర్సులు:** మేనేజ్‌మెంట్ విద్య పట్ల ఆసక్తి గల విద్యార్థులకు గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా యుజి స్థాయిలో బికామ్, బిబిఎ (బిజినెస్ ఎనలిటిక్స్) బిబిఎ (ఫైనాన్సియల్ మార్కెట్స్), జనరల్ బిబిఎ కోర్సులను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. పిజి స్థాయిలో ఎంబిఎ కోర్సుతో పాటు వైద్య ఆరోగ్య రంగంలో నిపుణులకు పెరుగుతున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్, అకాడమి ఆఫ్ హస్పటల్ మేనేజ్‌మెంట్‌తో సంయుక్తంగా ఎంబిఎ హస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ కోర్సును నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టును దేశ వ్యాప్తంగా 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో జులై 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ తెలిపారు. దీనికి సంబంధించి గ్యాట్ ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోదలచినవారు పూర్తి వివరాల కోసం గీతం వెబ్‌సైట్‌ను పరిశీలించ వచ్చునన్నారు. ఈ కోర్సులలో ప్రవేశానికి జూలై 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ సూచించారు.

## చాట్ల వాసు హత్య కేసులో ముద్దాయి అరెస్టు

**కావలి(నెల్లూరు), జులై 21 ప్రభాతవార్త:** కావలి రూరల్ మండలం, తాగేటివారిపాలెం గ్రామానికి చెందిన చాట్ల వాసు హత్య కేసులో 4వ ముద్దాయి అయిన కావలి రూరల్ మండలం, గౌరవరం గ్రామానికి చెందిన దేవరపల్లి నవీన్‌ను మంగళవారం డిఎస్‌పి వివి.రమణ కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ ఇన్స్‌పెక్టర్ జి.రాజేశ్వరరావు మంగళవారం తెలిపారు.

## జెన్‌కో ఎండి నాగలక్ష్మికి అదనపు బాధ్యతలు

**విజయవాడ, జులై 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి జెన్‌కో ఎండీ నాగలక్ష్మికి రెండు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎపి ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, ఎపి ఎనర్జీ ఎఫిషియన్సీ మిషన్ సిఇఒగా అదనపు బాధ్యతలిచ్చారు. ఆ మేరకు ఇంధన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాగలక్ష్మి ఈ బాధ్యతలను తక్షణం చేపట్టాల్సి ఉంటుంది.

## ఆ ద్రోహులకు పార్టీలోకి మళ్లీ నో ఎంట్రీ: మమత

**కోల్‌కతా, జులై 21:** పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతాబెనర్జి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పార్టీని వీడి వెళ్లిన నేతలను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని ఆమె స్పష్టంచేశారు. అదే సమయంలో రాష్ట్రంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ఇండియా కూటమిలోని పక్షాలన్నీ ఐక్యంగా ఉండాల్సిన అవసరాన్ని ఆమె నొక్కిచెప్పారు. లౌకిక వాదాన్ని, సమాఖ్య స్ఫూర్తిని, ప్రజా సంక్షేమ పాలనను కాపాడుకోవడానికి ప్రతిపక్షాల ఐక్యత ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. విపక్ష కూటమిలోని పార్టీలు విభేదాలను పక్కనపెట్టి ఏకం కావాలని పిలుపునిచ్చారు. పార్టీని వీడిన ద్రోహులను ఎప్పటికీ తిరిగి చేర్చుకోబోమని, ఈ విషయంలో తనకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టంచేశారు. పార్టీని వీడుతున్న వారికి నేను ఒక్కటే చెబుతున్నా. బీజేపీకి మద్దతుగా నిలవాలనుకుంటే నేరుగా ఆ పార్టీలోనే చేరి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్ చేస్తున్నా. ఎంత ఎక్కువమంది వెళ్లిపోతే నాకు అంత సంతోషం అని పేర్కొన్నారు.

# సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయించడమే లక్ష్యం


**• సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**పొదలకూరు (నెల్లూరు), జులై 21 ప్రభాతవార్త:** పొదలకూరు మండల అభివృద్ధి జరిగిందే మా హయాంలో ఎన్టీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం లభించడం నాఅదృష్టం అమ్మవారిపాళెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం సంతోషంగా ఉంది పొదలకూరు మండలం అమ్మవారి పాళెంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మొదట ఆత్మకూరు మాజీ శాసనసభ్యులు కొమ్మి లక్ష్మీయ్య నాయుడుతో కలిసి నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ మోటారు సైకిల్ ర్యాలీతో సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికిన అమ్మవారిపాళెం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సోమిరెడ్డి కామెంట్స్ సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్..

ప్రజా సంక్షేమం విషయంలో దేశంలో ఎవరికీ రాని ఆలోచనలు ఆయనకు వచ్చాయి పింఛన్లు, పక్కా ఇల్లు, రూ.2కే కిలో బియ్యం, రైతులకు హార్స్ పవర్ విద్యుత్ రూ.50కి వంటి కీలక పథకాలకు శ్రీకారం చుట్టిన ఘనత ఎన్టీఆర్ కే దక్కుతుందిమండల వ్యవస్థను తేవడంతో పాటు సింగిల్ విండో సొసైటీలతో రైతుబాంధవుడిగా నిలిచారు పెద్దాయన ఎన్టీఆర్ పుణ్యం, అప్పటి మంత్రి నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రత్యేక చొరవతో మన జిల్లాకు 146 టీఎంసీల సామర్ధం కలిగిన సోమశిల, కండలేరు జలాశ యాలు ఏర్పడ్డాయిఎన్టీఆర్ నాయకత్వంలో సెంట్రల్ బ్యాంకు చైర్మన్‌గా, టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, ఎమ్మె ల్యేగా పనిచేసే అవకాశం నాకు లభించిందితోడేరు రెడ్డి పర్సనాలిటీ చూసి పొదలకూరు మండల ప్రజలు ఆయనకు ఓట్లు గుద్దేస్తున్నారు. కానీ మొదటి నుంచి ఆయన చేసేవి దుర్మార్గాలే అత్తగారి ఊరు వావిలేటిపాడులో దళితుల భూములు ఆక్రమించారు. ఆ పక్కనే విశ్రాంత ఉద్యోగుల స్థలా లను చెరపట్టేశాడు జెడ్పీ చైర్ పర్సన్ గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి మంత్రిగా పదవులు అనుభవించి పొదలకూరు మండలానికి చేసింది శూన్యం చేసిందేమీ లేకపోగా, గతంలో మేం చేపట్టిన ప్రాజెక్టులపై కక్షకట్టి అర్ధంతరంగా ఆపేశాడుఈ ప్రాంత ప్రజల పాతికేళ్ల కల అయిన సోమశిల దక్షిణ కాలువను 201419 మధ్య సాకారం చేశాం...2019లో నేను ఓడిపోగానే ఆ కాలువ పనులను అడ్డుకున్నారు సోమశిల దక్షిణ కాలువ పెండింగ్ పనులను పూర్తి చేసి మిగిలిన గ్రామాలకు కూడా నీరు అందిస్తా గంటా రమణయ్య ఆశీస్సులతో కాలువ పెండింగ్ పనులు పూర్తి చేయించే బాధ్యత నాది ఎవరు ఎంతకాలం బతుకుతామో తెలియదు..బతికిన కొంత కాలమైనా ప్రజలకు సేవ చేసి మంచి అనిపించుకోవాలి.

# నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం అండ




**గూడూరు, (నెల్లూరు), జులై 21 ప్రభాతవార్త :** నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్న యాజమాన్యాలకి స్థానికులకే ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని తెలియజేస్తున్నామని రాబోయే రోజుల్లో గూడూరు నియోజకవర్గం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ మహిళా కళాశాలలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. పలు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ హాజరయ్యారు. ఎంపికైన వారికి అపాయింట్మెంట్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ కంపెనీలు ఏర్పాటు చేసే వారికి స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని తెలియజేస్తున్నామని నియోజకవర్గంలో క్రిస్ సిటీ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అలాగే భారీ ఫర్నిచర్ పరిశ్రమ త్వరలో ప్రారంభం కానుంది అని ఇంకా అనేక పరిశ్రమలు వస్తాయని అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జాబు క్యాలెండర్ కూటమి ప్రభుత్వం విడుదల చేసిందని అనేకమంది డీఎస్సీ చదివిన వారికి టీచర్ పోస్టులు ఇవ్వడం జరిగిందని వీటిని రద్దు చేయాలని ప్రతిపక్ష వైసిపి పార్టీ కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఎంతోమందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుది అని గత వైసిపి ప్రభుత్వంలో స్కిల్ డెవలప్మెంట్ కేసులో చంద్రబాబు నాయుడుని అరెస్టు చేశారని దీనిపై ఉద్యోగాలు పొందిన వారందరూ నిరసన వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వెంకటేశ్వరరాజు, వాటంబేడు హరి కుమార్, రవీంద్ర రెడ్డి, చిన్నా వైయస్సార్, ముమ్మడి వెంకటేశ్వర్లు, హనుమంత రావు, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు, పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిపి, డిజిపి అసలు నిందితులు

**• ఎసిపిపై కూడా విచారణ జరిపించాలి • వైసిపి(జనరల్ సెక్రటరీ) న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి ప్రైవేటు కేసు దాఖలు**

**విజయవాడ (కార్పొరేషన్), జులై 21 ప్రభాతవార్త:** విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో లాకప్‌డెత్‌కు గురైన గాదె సాయికృష్ణకు సంబంధించి రాష్ట్ర డిజిపి, విజయవాడ సిపితో పాటు ఎసిపిలను నిందితులుగా చేర్చాలని పేర్కొంటూ న్యాయవాది, వైసిపి పార్టీ జనరల్ సెక్రటరీ(లీగల్ వ్యవహారాలు) పొన్నవోలు సుధాకరరెడ్డి తదితరులు విజయవాడ కోర్టులో మంగళవారం పిటీషన్‌ను దాఖలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ వ్యవహారంలో అసలు నేరస్థులు క్రింది స్థాయి పోలీసులు మాత్రమే కాదని, ఉన్నతాధికారులైన అప్పటి డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, సిపి రాజశేఖరబాబు, ఎసిపి మానసలు ప్రధాన కుట్రదారులన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని తమ అబద్దాలతో ఈ సీనియర్ ఐపిఎస్ అధికారులు బురిడీ కొట్టించారని వీరిని ఎ-1, ఎ-2, ఎ-3లుగా కేసులో చేర్చాలని పేర్కొన్నట్లు తెలిపారు. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 233 క్రింద విజయవాడ కోర్టులో క్రిమినల్ పిటీషన్‌ను దాఖలు చేసామని ఆయన వెల్లడించారు. కూటమి పాలనలో జంగిల్‌రాజ్ నడుస్తోందని, రాష్ట్రంలో రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కన పెట్టారన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహనరెడ్డి సాయికృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన తర్వాతే పోలీసు వ్యవస్థలో కదలిక వచ్చిందన్నారు. ఉన్నతాధికారులను కాపాడేందుకు ప్రభుత్వం వేసిన సిట్ ఒక కంటితుడుపు చర్య అన్నారు. చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని, ఈ ఘటనపై సిబిఐ విచారణ చేపట్టి, బాధ్యులైన ఐపిఎస్‌లకు మూడేళ్ళ నుండి ఐదేళ్ళ వరకు జైలు శిక్ష పడే వరకు వైఎస్సార్‌సిపి న్యాయపోరాటం ఆపదని ఆయన స్పష్టం చేశారు.



**భాధితులను ప్రలోభాలకు గురిచేస్తున్నారు:** హైకోర్టులో దాఖలైన హెబియస్ కార్పస్ పిటీషన్ అడిషనల్ అఫిడవిట్‌లను భాధితులను వివిధ మార్గాల ద్వారా విత్‌డ్రా చేయించారని పొన్నవోలు సుధాకరరెడ్డి పేర్కొన్నారు. అందుకే మా పార్టీ ఎంపీ ఎం.గురుమూర్తి చొరవతో సామాజిక భాధ్యతగా మంగళవారం ప్రైవేటు కేసును దాఖలు చేశామన్నారు. కోర్టులో గంటన్నర పాటు సుదీర్ఘ వాదనలు దీనిపై వినిపించామని, హైకోర్టులో కూడా దర్యాప్తు ట్రాన్సఫర్‌పై విచారణ జరుగుతోందన్నారు.

ఈ కేసులో ఎంతటి ఉన్నతాది .కారులున్నా వదిలిపెట్టేది లేదని, చివరి వరకు పోరాడతామని పొన్నవోలు సుధాకరరెడ్డి తేల్చి చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు మల్లసాని మనోహరరెడ్డి, జల్ల సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర లీగల్‌సెల్ ఉపాధ్యక్షులు ఒగ్గు గవాస్కర్‌లు పాల్గొన్నారు.

## ప్రేమ వ్యవహారమైతే ఒకరిపైనే చర్యలు సరికాదు


**ట్రైనీ ఐపిఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి ఉదంతంపై మాజీ డిజి నాగేశ్వరరావు వ్యాఖ్యలు**

**హైదరాబాద్, జులై 21, ప్రభాతవార్త:** జాతీయ పోలీసు అకాడమిలో శిక్షణలో వున్న ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంపై విశ్రాంత ఐపిఎస్ అధికారి సిబిఐ మాజీ తాత్కాలిక డైరక్టర్ మన్నెం నాగేశ్వరరావు ఎక్స్ వేదికగా మంగళవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనుక ప్రేమ వ్యవహారం వుంటే కేవలం ఉదయ్ కృష్ణారెడ్డిపై మాత్రమే చర్యలు తీసుకోవడం సరికాదని ఆయన తెలిపారు. ఈ ఉదంతంలో ట్రై నీ ఐపిఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై నమోదైన ఎఫ్ఐఆర్ కారణంగా అతన్ని వెంటనే సస్పెండ్ చేయడం అనేక ప్రశ్నలను లేవనెత్తేలా వుందని నాగే శ్వర రావు తెలిపారు. ప్రేమ బంధం విఫలమైతే దానిని క్రిమినల్ కేసుగా మార్చవద్దని ఆయన పోలీసులకు సూచించారు.

ఈ కేసులో నిస్పక్ష పాతంగా విచారణ జరగాలని, పరస్పర అంగీకారంతో సంబంధం వుంటే ఇద్దరికి సమానంగా క్రమశిక్షణా చర్యలు వుండాలని ఆయన పేర్కొన్నా రు. ఒకరిపై చర్యలు తీసుకుని మరొకరిని నిరపరాధిగా చూడడం సరైంది కాదని ఆయన తెలిపారు. ఈ కేసులో ఉదయ్ కృష్ణారెడ్డిపై విధించిన సస్పెన్షన్‌పై పునసమీక్షించాలని కేంద్ర హోం శాఖకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కేసు విచారణ పూర్తయ్యే వరకు ఉదయ్ కృష్ణారెడ్డి శిక్షణ కొన సాగేలా చూడాలని ఆయన కోరారు. ఐపిఎస్ అధికారులకు శిక్షణ ఇచ్చే జాతీయ పోలీసు అకాడమిలో వెలుగు చూసిన ఈ ఘటనపై సమగ్ర వి చారణ చేయాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్‌తో పాటు తెలంగాణ డిజిపికి నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి పోలీసు శాఖలో ఒక కానిస్టేబుల్ నుంచి తన ప్రయాణం మొదలుపెట్టి ప్రతిష్టాత్మకమైన ఐపిఎస్ అందుకుని ఎందరికో స్ఫూర్తిగా నిలిచాడని, ఈ విషయంలో ఎ పి సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. కాగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెంది న నాగేశ్వరరావు 1986 బ్యాచ్ ఐపిఎస్ అధికారి. ఒడిషా కేడర్‌లో సుధీర్ఘ కాలం పనిచేసి కేంద్ర సర్వీసులోనూ సేవలందించారు. ఈ క్రమంలో నే 2018 అక్టోబర్ నుంచి 2019 ఫిబ్రవరి నెల వరకు సిబిఐ తాత్కాలిక డైరక్టర్‌గా పనిచేశారు.

**హైకోర్టును ఆశ్రయించిన ఉదయ్ కృష్ణారెడ్డి..**

ఇదిలావుండగా తనపై నమోదైన నమోదైన లైంగిక వేధింపుల కేసును కొట్టి వేయాలని కోరుతూ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరగనుంది. అకాడమిలో తమ వాడికి న్యాయం జరగకుంటే కోర్టులో దీనిపై తేల్చుకుంటామని ఉదయ్ కృష్ణారెడ్డి కుటుంబీకులు ఇప్పటికే వెల్లడించడం తెలిసిందే. ఈ విషయాన్ని అతని సోదరుడు ప్రణయ్ కృష్ణా రెడ్డి మీడియాకు వెల్లడించడం గమనార్హం. మరోవైపు ఉదయ్ కృష్ణారెడ్డి ఇంకా ఆసుపత్రిలోనే వున్నట్లు తెలిసింది. అతను ఆసుపత్రి నుంచి డి శ్చార్జి అయితే విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సిద్దమవుతున్నారు. ఇదే కేసుకు సంబంధించి అత్తాపూర్ పోలీసులు పో లీసు అకాడమిని సందర్శించి అక్కడి అధికారులతో మాట్లాడి ఈ ఘటనపై వివరాలు సేకరించడంతో పాటు సిసిటివి ఫుటేజిలను స్వాధీనం చేసుకున్నారు.




# ఇక కామన్‌వెల్త్ గేమ్స్ సంబరం

ఆట

**రేపు గ్లాస్గోలో ప్రారంభం *10 క్రీడాంశాల్లో పోటీలు *75 దేశాల నుంచి 3వేలకు పైగా అథ్లెట్లు**

**125 మంది భారీ బృందంతో భారత్ *పతకాలపై గురిపెట్టిన నీరజ్ చోప్రా, మీరాబాయి, లవ్లీనా**



నిన్నా మొన్నటి వరకు సాకర్ ఫీవర్‌తో ఊగిపోయిన క్రీడాభిమానులను అలరించేందుకు మరో మెగా టోర్నీ దూసుకు వచ్చింది. ఈసారి గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల మెగా క్రీడా సంబరం మరో 24 గంటల్లో ప్రారంభం కానున్నాయి. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో అగస్టు 2 వరకు జరిగే ఈ పోటీల్లో 74 దేశాల నుంచి మూడు వేలకు పైగా అథెట్లు బరిలోకి దిగుతున్నారు. 10 క్రీడాంశాలు, మూడు పారా స్పోర్ట్స్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి, 125 మంది అథెట్ల భారీ బృందంతో భారత్ బరిలోకి దిగుతోంది. అహ్మదాబాద్ వేదికగా 2030లో కామన్‌వెల్త్ క్రీడలకు అతిథ్యమివ్వబోతున్న భారత్... గ్లాస్గోలో సత్తా చాటాలని చూస్తోంది.

**గ్లాస్గో(స్కాట్లాండ్):** మరో క్రీడా సంబరం ముందుకు వచ్చేస్తోంది. 13 క్రీడాంశాలు, 74 దేశాలు, మూడు వేలకు పైగా అథెట్లతో 11రోజుల పాటు గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడలు అలరించబోతున్నాయి. ఒలింపిక్స్ తర్వాత అంతటి ఘనచరిత్ర ఉన్న కామన్‌వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించడంపై అథెట్లు దృష్టి సారించారు.

### భారీగా తగ్గిన క్రీడాంశాలు

ఈసారి కామన్‌వెల్త్ క్రీడాంశాలను పదికి కుదించారు. దీనికి మరో మూడు పారా క్రీడాంశాలను చేర్చారు. అథ్లెటిక్స్, బాక్సింగ్, జూడో, వెయిట్ లిఫ్టింగ్, లాన్ బౌల్స్, స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్,నెట్‌బాల్, ట్రాక్ సైక్లింగ్, బాస్కెట్‌బాల్, పారా స్పోర్ట్స్ అంశాలు ఉన్నాయి. బ్రిటన్ ఆతిథ్యం ఇచ్చిన 2022 బర్మింగ్హామ్ కామన్ వెల్త్ క్రీడల్లో 20 క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. అపుడు ఆస్ట్రేలియా 178పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. మొదట 2026 కామన్‌వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియాలోని విక్టోరియా ఎంపికైనా... ఆ తర్వాత విరమించుకోవడంతో చివరకు స్లాట్లాండ్‌లోని గ్లాస్గోకు నిర్వహకులు అతిథ్య హక్కులు ఇచ్చారు.

### భారీ బృందంతో బరిలోకి భారత్

గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 126 మంది అథెట్ల భారీ బృందంతో బరిలోకి దిగుతున్నది. ఒలింపిక్ మెడలిస్టలు మిరాబాయి చాను(వెయిట్ లిఫ్టింగ్), లవ్లీనా బర్గోహైన్(బాక్సింగ్) భారత ఫ్లాగ్ బేరర్స్‌గా వ్యవహరించనున్నారు. అత్యధికంగా అథ్లెటిక్స్‌లో 32 మంది.. బాక్సింగ్, జూడోలో 14 మంది చొప్పున.. వెయిట్ లిఫ్టింగ్‌లో 12 మంది పోటీపడుతున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో గుర్విందర్ సింగ్, గుల్వీర్ సింగ్, సంతోష్ కుమార్, పారుల్ చౌదరీ, ప్రియాంక గోస్వామిపై భారీ ఆశలు పెట్టుకుంది. పోల్‌వాల్ట్‌లో కుల్దీప్ కుమార్, లాంగ్‌జంప్‌లో లోకేష్ సత్యనాథన్, పూజా సింగ్, షాట్‌ఫుట్‌లో తేజిందర్‌పాల్ సింగ్, జావెలిన్ త్రోలో నీరజ్ చోప్రా, రోహిత్ యాదవ్, డిస్కస్‌త్రోలో సీమా పూనియా.. గోల్డ్ మెడల్ ఆశలను మోస్తున్నారు. ఇటీవల మెరుగైన ఫలితాలు సాధిస్తున్న బాక్సర్లు, వెయిల్ లిఫ్టర్ల నుంచి, పెద్ద సంఖ్యలో మెడల్స్‌ను ఆశిస్తోంది.



### భారీగా మెడల్స్ నెగ్గడంపై దృష్టి

గత కామన్‌వెల్త్ క్రీడల్లో భారత అథెట్లు అత్యుత్తమ ప్రతిభ చాటారు. ఏకంగా 22 స్వర్ణాలు, 16 రజతాలు, 23 కాంస్య పతకాలు నెగ్గారు. మొత్తం 61 మెడల్స్‌తో భారత్ పతకాల పట్టికలో నాలుగో స్థానంలో నిలిచింది. ఇప్పటివరకు సొంతగడ్డపై జరిగిన 2010 న్యూఢిల్లీ కామన్‌వెల్త్ క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించింది.ఆ క్రీడల్లో మొత్తం 101 మెడల్స్‌తో ఆస్ట్రేలియా తర్వాత రెండో స్థానంలో భారత్ నిలిచింది. ఇందులో 38 స్వర్ణాలు, 27 రజతాలు, 36 కాంస్య పతకాలు ఉన్నాయి. వచ్చే కామన్ వెల్త్ క్రీడలకు అతిథ్యమిస్తున్న భారత్.. గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల్లో మెరుగైన ఫలితాలు సాధించడంపై దృష్టి సారించింది. కామన్‌వెల్త్ క్రీడలకు చాలా ముందుగానే భారత అథ్లెట్లకు వివిధ దేశాల్లో ప్రపంచ స్థాయి శిక్షణను అందించింది. భారీగా మెడల్స్ కొల్లగొట్టడంపై ఫోకస్ పెట్టింది.



# హాకీ ప్రపంచకప్‌కు భారత్

**న్యూఢిల్లీ, జులై 21:** పురుషుల హాకీ ప్రపంచ కప్ టోర్నీకి బెల్జియం, నెదర్లాండ్స్ సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్నాయి. ఈ టోర్నమెంట్ ఆగస్టు 15 నుంచి 30 వరకు జరగనుంది. ఈ టోర్నీకి గాను 20 మంది సభ్యులతో కూడిన భారత్ జట్టును ఐహెచ్‌ఎఫ్ ప్రకటించింది. డిఫెండర్ హర్మన్ ప్రీత్ సింగ్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ప్రొ హాకీ లీగ్‌లో లీగ్‌లో పాల్గొన్న నలుగురు ఆటగాళ్లకు జట్టులో చోటు దక్కలేదు. డిఫెండర్ అమన్‌దీప్ లక్రా, మిడ్‌ఫీల్డర్లు రాజ్ కుమార్ పాల్, రబిచంద్ర సింగ్ మొయిరాంగ్ థెమ్, ఫార్వర్డ్ సెల్వం కార్తీ చోటు కోల్పోయారు. ప్రపంచ కప్‌లో పూల్–డిలో ఉన్న భారత్... ఆగస్టు 15న వేల్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. 17న ఇంగ్లాండ్‌తో, 19న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో తలపడనుంది. చివరగా 2023లో జరిగిన వరల్డ్ కప్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో నిలిచింది.ఈ టోర్నీలో భారత్ ఒక్కసారి మాత్రమే ఛాంపియన్‌గా నిలిచింది. 1975లో పాక్‌ను ఓడించి విజేతగా అవతరించింది. 1971లో కాంస్యం, 1973లో రజతం సాధించింది.

# జింబాబ్వేతో సిరీస్‌కు టీమిండియా సై

**హరారే, జులై 21:** వరుసగా రెండు టీ20 సిరీస్‌లు కోల్పోయిన టీమిండియా... మరో సిరీస్‌కు సిద్ధమైంది. జింబాబ్వేపై మూడు టీ20 సిరీస్ గెలుపొంది పరాజయాలకు ముగింపు పలకడంపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా భారత జట్టు హరారేకు చేరుకుంది. భారత్ జింబాబ్వే మధ్య తొలి టి20 మ్యాచ్ గురువారం హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరగనుంది. వరుసగా మూడు సిరీస్‌లను కోల్పోయి జింబాబ్వే పర్యటనకు వెళ్లిన టీమిండియా అక్కడ ఎలా రాణిస్తుందోనని అందరూఆతృతగా ఎదురు చూస్తున్నారు. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి కూడా ఈ సిరీస్ అత్యంత కీలకం కానుంది.అరంగేట్ర సిరీస్‌లో విఫలమైన వైభవ్‌కు ఈ జింబాబ్వే టూర్ అద్భుత అవకాశం.

సంజూ శాంసన్‌కు విశ్రాంతి ఇవ్వడంతో భారత ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మతో కలిసి వైభవ్ ఆరంభించనున్నాడు. ఈ సిరీస్‌లో వైభవ్ తనను తాను నిరూపించుకుంటే భారత టీ20 జట్టులో అతడి స్థానం పదిలంగా ఉంటుంది. అయితే జింబాబ్వే గడ్డపై సూర్యవంశీ అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది.



### వైభవ్ చెలరేగడం ఖాయం!

ఈ ఏడాది ఆరంభంలో జింబాబ్వే వేదికగా జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో వైభవ్ అదరగొట్టాడు. ముఖ్యంగా ఫైనల్‌లో ఇంగ్లండ్‌పై అతడు విధ్వంసం సృష్టించాడు. కేవలం 80 బంతుల్లోనే 175 పరుగులు చేశాడు.ఇది యూత్ వన్డే చరిత్రలోనే అత్యుత్తమ ఇన్నింగ్స్‌లలో ఒకటిగా నిలిచిపోయింది. ఈ చిచ్చర పిడుగు జింబాబ్వేలో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడి 169.49 స్ట్రైక్ రేట్‌తో మొత్తం 439 పరుగులు సాధించాడు. ఇప్పుడు భారత సీనియర్ జట్టు తరపున కూడా అదే జోరును కనబరుస్తాడని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. కాగా జింబాబ్వే పర్యటనలో భారత జట్టు ప్రధాన కోచ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరించనున్నాడు. వరుస సిరీస్‌లతో బీజీగా ఉండడంతో రెగ్యులర్ హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. చేయనున్నారు. ఇంకా ప్రత్యక్ష ప్రసారం ఫ్యాన్‌కోడ్ యాప్, వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

### భారత జట్టు

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, వైభవ్ సూర్యవంశి, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, ప్రభ్ సిమ్రన్ సింగ్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్‌శర్మ, మయాంక్.



### తొలి రౌండ్‌లోనే ప్రణయ్, దేవిక సిహాగ్ ఔట్

# చైనా ఓపెన్ టైటిల్‌పై సింధు గురి

**బీజింగ్, జులై 21:** చైనా మాస్టర్స్ తొలి రోజునే భారత్‌కు నిరాశాజనక ఆరంభం లభించింది. భారత షట్లర్లు దేవిక సిహాగ్, హెచ్‌ఎస్ ప్రణయ్ ఓటమితో నిష్క్రమించారు.దేవిక సిహాగ్ మూడు గేమ్‌ల పోరాటంలో ఓడిపోగా, హెచ్‌ఎస్ ప్రణయ్ వరుస గేమ్లలో ఓడి ఇంటిదారి పట్టారు.థాయిలాండ్ ఓపెన్ సూపర్ 300 విజేత అయిన దేవిక, తొలి గేమ్‌ను కోల్పోయినప్పటికీ పుంజుకుని పోరాడింది. అయితే ఆ జోరును కొనసాగించలేక, మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 20వ ర్యాంకర్, థాయిలాండ్‌కు చెందిన బుసానన్ ఒంగ్‌బామ్‌రుంగ్‌ఫాన్ చేతిలో 19–21, 21–19, 13–21 తేడాతో ఓడింది. 2023 ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత ప్రణయ్ కూడా పురుషుల విభాగం తొలి రౌండ్‌లో మలేషియాకు చెందిన లియోంగ్ జున్ హావ్ చేతిలో 10–21, 14–21 తేడాతో ఓటమి పాలయ్యారు. ఇటీవలే జపాన్ ఓపెన్ విజేతగా నిలిచిన పివి సింధు.. చైనా ఓపెన్‌పై గురిపెట్టఇంది. నేడు తొలి రౌండ్‌లో తోటి భారత క్రీడాకారిణి ఉన్నతి హుడాతో తలపడనుంది. పురుషుల సింగిల్స్‌లో ఆశలు పెట్టుకున్న లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి కూడా బరిలోకి దిగనున్నారు.

### 11 రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్లు

# రద్దు చేసిన సెబీ



వాణిజ్యం

**ముంబయి,జులై 21:**భారత మూలధన మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ రీసెర్చ్ అనలిస్టులుగా నమోదైన 11సంస్థలు,వ్యక్తుల రిజిస్ట్రేషన్లను రద్దు చేసింది. తప్పనిసరిగా ప్రతి ఐదేళ్లకు చెల్లించాల్సిన రిన్యూవల్ ఫీజును చెల్లించకపోవడంతో రద్దుచేసినట్లు సెబీ వెల్లడించింది. చెల్లుబాటు గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను దుర్వినియోగం చేయకుండా నిరోధించడం, అలాగే చురుకుగా పనిచేస్తున్న నమోదిత సంస్థలే సెక్యూరిటీస్ మార్కెట్లో కొనసాగేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు సెబీ పేర్కొంది.

మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో,ప్రతి ఐదేళ్లకు చెల్లించాల్సిన రిన్యూవల్ ఫీజు చెల్లించకపోవడంతో ఆయా రీసెర్చ్ అనలిస్టుల రిజిస్ట్రేషన్లు చెల్లుబాటు కోల్పోయాయని తెలిపింది.ఏడుగురు వ్యక్తిగత రీసెర్చ్ అనలిస్టులు ఉన్నారు.సెబీ వివరాల ప్రకారం, కొందరు 2020నుంచే రిన్యూవల్ ఫీజులు చెల్లించకుండా బకాయిలు ఉంచారు. దీనిపై విచారణలు ప్రారంభించిన సెబీ, రిజిస్ట్రేషన్లను ఎందుకు సస్పెండ్ లేదా రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో ముగ్గురు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మిగిలిన 8మంది తమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయవచ్చని సెబీకి తెలియజేశారు.తప్పనిసరి రిన్యూవల్ ఫీజులు చెల్లించకపోవడంతో వారి రిజిస్ట్రేషన్లు ఇప్పటికే చెల్లుబాటు కోల్పోయాయని అందువల్ల వాటిని అధికారికంగా రద్దు చేసినట్లు సెబీ స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ రద్దు అయినంత మాత్రాన వారు రీసెర్చ్ అనలిస్టులుగా నమోదై ఉన్న సమయంలో చేసిన చర్యలు లేదా నిర్లక్ష్యాల్లకు సంబంధించిన బాధ్యతలు తొలగిపోవని సెబీ పేర్కొంది. సంస్థలు, వ్యక్తులు తమ రికార్డులను భద్రపరచడం, పెండింగ్‌లో ఉన్న ఇన్వెస్టర్ ఫిర్యాదులను పరిష్కరించడం, తమపై ఉన్న అన్ని బాధ్యతలను కొనసాగించడం తప్పనిసరి అని ఆదేశించింది.

# రెండో రోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలే

**ముంబయి,జులై 21:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు వరుసగా అమ్మకాలు కొనసాగించడం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌షేర్లలో బలహీనత కారణంగా ప్రధానసూచీలు ఒత్తిడికి గురయ్యాయి.మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 90 డాలర్ల సమీపంలో కొనసాగుతోంది.దీనివల్ల ద్రవ్యోల్బణం పెరగడంతో పాటు కంపెనీల లాభాల మార్జిన్లపై ప్రభావం పడుతుందనే ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.అయితే ప్రధాన సూచీలు క్షీణించినప్పటికీ, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలతో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. రంగాల వారీగా ఆటో, మెటల్ షేర్లు లాభపడగా, పీఎస్‌యూ బ్యాంకులు, ఐటీ, ఎనర్జీ రంగాల షేర్లు నష్టాల్లో ముగిశాయి.

బీఎస్‌ఈ సెన్సెక్స్ 238.41 పాయింట్లు పడిపోయి 77,470.11 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 50.80 పాయింట్లు కోల్పోయి 24,187.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీ పతనానికి ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.07, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 1.48, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.40 షేర్లక్షీణత కారణమయ్యాయి. మరోవైపు, బీఎస్‌ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.34 శాతం, బీఎస్‌ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.19 శాతం పెరిగాయి. బీఎస్‌ఈలో మొత్తం



2,188 షేర్లు లాభపడగా, 2,021 షేర్లు నష్టపోయాయి. 199 షేర్లు మార్పులేకుండా ముగిశాయి.

భారత 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.15 శాతం పెరిగి 6.782శాతానికి చేరుకుంది.డాలరుతో రూపాయి విలువలు 96.25 వద్ద ట్రేడైంది.గత ముగింపు 96.36.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5,2026డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 1.01శాతం పెరిగి 1,42,822కు చేరాయి.సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 53 సెంట్లు (0.59 ) పెరిగి 89.75 డాలర్ల వద్ద ట్రేడైంది.కొత్తగా లిస్టైన కంపెనీలుఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ షేరు బీఎస్‌ఈలో రూ.609.90 వద్ద ముగిసి, ఇష్యూ ధర రూ.574పై 6.25 శాతం ప్రీమియం నమోదు చేసింది.

ఆల్ఫైన్ టెక్స్‌వరల్డ్ షేరు రూ.99.75 వద్ద ముగిసి, ఇష్యూ ధర రూ.105తో పోలిస్తే 5శాతం డిస్కౌంట్లో లిస్టైంది.హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 2.07బజాజ్ ఆటో 0.92టీవీఎస్ మోటార్ కంపెనీ 5.67 ఎస్‌ఎంఎల్ మహీంద్రా2.62 కరూర్ వైశ్యా బ్యాంక్ 13.11. కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్3.43 వన్97 కమ్యూనికేషన్స్ (పేటీఎం)3.86 బ్లూస్టోన్ జ్యువెలరీ అండ్ లైఫ్‌స్టైల్20 కిర్లోస్కర్ న్యూమాటిక్ కంపెనీ6.12 శాతంచొప్పున ట్రేడ్ అయ్యాయి.కాలిబర్ మైనింగ్ అండ్ లాజిస్టిక్స్ ఐపీఓకు ఇన్వెస్టర్లనుంచి మంచి స్పందన లభించింది. మంగళవారం సాయంత్రం 4:27 గంటల వరకు ఎన్‌ఎస్‌ఈ గణాంకాల ప్రకారం, ఆఫర్ చేసిన 78.35లక్షల షేర్లకు గాను 114.56 కోట్ల షేర్లకు దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఈ ఇష్యూ 146.20 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.ఈ ఐపీఓ జూలై 17న ప్రారంభమై జూలై 21న ముగిసింది. ఒక్కో షేరు ధరను రూ.402 నుంచి రూ.424 మధ్య నిర్ణయించారు.

# పీఎల్ఐ పథకంతో రూ.2.40 లక్షల కోట్ల పెట్టుబడులు

### రూ.15.2 లక్షల కోట్లకు చేరిన ఎగుమతులు

**న్యూఢిల్లీ,జులై 21:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం పిఎల్ఐ దేశీయ తయారీ రంగానికి భారీ మద్దతిస్తోంది. ఈ పథకాల కింద 14 రంగాల్లో మొత్తం రూ.2.40లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, ఎగుమతులు రూ.15.2లక్షల కోట్లకు చేరుకున్నాయని పరిశ్రమలు, అంతర్గతవాణిజ్య ప్రోత్సాహక విభాగం వెల్లడించింది. పీఎల్ఐ పథకాల కింద ఎగుమతులు 4లక్షల కోట్ల నుంచి రూ.15.2లక్షల కోట్లకు పెరిగాయి. దేశ తయారీ రంగం, ఎగుమతి సామర్థ్యం వేగంగా విస్తరిస్తోందనడానికి నిదర్శనమని ప్రభుత్వం పేర్కొంది.14 రంగాలకు వర్తించే పీఎల్ఐ పథకాలలో సోలార్ ఫోటోవోల్టాయిక్ మాడ్యూళ్ల రంగం అత్యధికంగా రూ.64,873 కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది.

ఫార్మాస్యూటికల్ రంగం రూ.45,158 కోట్ల పెట్టుబడులతో రెండో స్థానంలో నిలవగా, ఆటోమొబైల్ మరియు ఆటోకాంపోనెంట్ల రంగం 44,326 కోట్ల పెట్టుబడులను సాధించింది. దేశీయ మొబైల్ ఫోన్ తయారీని పెంపొందించడంలో కూడా పీఎల్ఐ పథకం విశేష ఫలితాలను సాధించిందని ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో విక్రయిస్తున్న మొబైల్ ఫోన్లలో 99.2 శాతం దేశీయంగానే తయారవుతున్నాయి. పీఎల్ఐ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత మొబైల్ ఫోన్ దిగుమతులు 77 శాతం తగ్గడం, దేశ తయారీ సామర్థ్యం పెరిగిందనడానికి నిదర్శనమని పేర్కొంది. పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తోందని తెలిపింది. కేబినెట్ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ పథకాల పురోగతిని పర్యవేక్షిస్తుండగా,అవసరాలకు అనుగుణంగా సంబంధిత మంత్రిత్వశాఖలు మార్గదర్శకాలు,అర్హత ప్రమాణాల్లో మార్పులు చేసి పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచుతున్నాయని వెల్లడించింది.దేశీయ తయారీని బలోపేతం చేయడం, ఎగుమతులను పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం లక్ష్యంగా ప్రారంభించిన పీఎల్ఐ పథకాలు ప్రస్తుతం 14 కీలక రంగాలను కవర్ చేస్తున్నాయి.



# రూ.30వేల వరకూ మారుతి సుజుకి కార్ల ధరల పెంపు

**ముంబయి,జులై 21:** దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకి ఇండియా మరోసారి తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న ముడి పదార్థాల ధరలు, తయారీ వ్యయాలు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల నేపథ్యంలో ఆగస్టు నెల నుంచి అన్ని మోడళ్లపై గరిష్ఠంగా రూ.30వేల వరకు ధరలు పెంచనున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు మంగళవారం తెలియజేసింది. ఉత్పత్తి వ్యయాలు నిరంతరం పెరుగుతున్నందున వాటి ప్రభావాన్ని కొంత మేర తగ్గించుకునేందుకు ఈ ధరల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

గత కొన్ని నెలలుగా ఖర్చులను తగ్గించే చర్యలు, ఉత్పాదకత పెంపు, నిర్వహణ సామర్థ్యాన్ని మెరుగుపరిచే చర్యల ద్వారా వ్యయభారాన్ని తట్టుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో మొత్తం భారం కంపెనీ భరించడం సాధ్యం కావడం లేదని తెలిపింది. ఇది కేవలం రెండు నెలల వ్యవధిలోనే కంపెనీ చేపడుతున్న రెండో ధరల పెంపు కావడం గమనార్హం. అంతకుముందునెలలో కూడా మారుతి సుజుకి వివిధ మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.30వేలవరకుపెంచింది.మా పోర్ట్‌ఫోలియోలోని అన్ని మోడళ్ల ధరలను గరిష్ఠంగా రూ.30వేల వరకు పెంచాలని నిర్ణయించామని కంపెనీ తెలిపింది. ముడి పదార్థాల ధరలు, తయారీ ఖర్చులు, సరఫరా గొలుసు (సప్లై చైన్) వ్యయాలు, ద్రవ్యోల్బణ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో వాహన తయారీ సంస్థలు వరుసగా ధరలను సవరించాల్సిన




పరిస్థితి ఏర్పడిందని మారుతి సుజుకి తెలిపింది.

అయినప్పటికీ విని స్టాక్ మార్కెట్లో మారుతి సుజుకి షేర్లకు స్వల్ప మద్దతు లభించింది. మంగళవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి కంపెనీ షేరు 0.93 శాతం పెరిగి రూ.13,640 వద్ద ముగియగా, అదే సమయంలో బెంచ్‌మార్క్ నిఫ్టీ50 సూచీ 0.21 శాతం నష్టంతో ముగిసింది.




# బంధన్ బ్యాంక్ నికరలాభం రూ.502 కోట్లు

**ముంబయి,జులై 21:** ప్రైవేట్ రంగంలోని బంధన్ బ్యాంక్ తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది.రుణ నష్టాల కోసం కేటాయింపులు (ప్రొవిజనింగ్) గణనీయంగా తగ్గడంతో బ్యాంకు నికరలాభం ఏడాది ప్రాతిపదికన దాదాపు 35 శాతం పెరిగింది. బ్యాంకు నికర లాభం రూ.372 కోట్ల నుంచి రూ.502 కోట్లకు పెరిగింది. ఇది గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే 34.9 శాతం వృద్ధిని సూచిస్తోంది.బ్యాంకు ప్రధాన ఆదాయ సూచిక అయిన నికర వడ్డీ ఆదాయం కూడా వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది రూ.2,758 కోట్లుగా ఉన్న ఈ ఆదాయం, ప్రస్తుత త్రైమాసికంలో 6 శాతం పెరిగి రూ.2,921 కోట్లకు చేరుకుంది. బ్యాంకు నికర వడ్డీ మార్జిన్ వరుస త్రైమాసిక ప్రాతిపదికన 6.2 శాతం వద్ద స్థిరంగా కొనసాగింది. మారుతున్న వడ్డీ రేట్ల పరిస్థితుల్లోనూ బ్యాంకు రుణాల లాభదాయకత స్థిరంగా ఉన్నట్లు ఇది సూచిస్తోంది.ఆస్తుల నాణ్యత పరంగా కూడా బ్యాంకు మెరుగైన పనితీరును కనబరిచింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి మార్చి త్రైమాసికంలోని 3.27 శాతం నుంచి 3.15 శాతానికి తగ్గింది. అలాగే నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.97 శాతం నుంచి 0.93 శాతానికి తగ్గి రుణాల నాణ్యత మరింత మెరుగుపడినట్లు వెల్లడైంది.




# నెట్ లేకున్నా యుపిఐ చెల్లింపులు: ఎన్‌ఫిసిఐ కొత్త ఫీచర్

**ముంబయి,జులై 21:** దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పు వస్తోంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ లేని ప్రాంతాల్లోనూ సులభంగా యూపీఐ లావాదేవీలు జరిపేందుకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ఒక కొత్త ఫీచర్‌ను తెస్తోంది. యూజర్ ఫోన్, వ్యాపారి వద్ద ఉండే పాయింట్ ఆఫ్ సేల్ టెర్మినల్ రెండూ ఆఫ్‌లైన్‌లో ఉన్నప్పటికీ, 2వేల వరకు చెల్లింపులు చేయవచ్చు.ఈ సదుపాయాన్ని నియర్ ఫీల్డ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ ఆధారంగా ట్యాప్‌టుపే విధానంలో తీసుకురానున్నారు. వినియోగదారులు ముందుగా తమఫోన్‌లో ఇంటర్నెట్ ఉన్నప్పుడు ఆన్‌డివైస్ యూపీఐ లైట్ వ్యాలెట్‌లోకి డబ్బును లోడ్ చేసుకోవాలి. ఇంటర్నెట్ సిగ్నల్ లేని ప్రదేశాల్లో వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, ఎన్‌ఎఫ్‌సీ ఆధారిత స్మార్ట్ ఫోన్‌ను వ్యాపారి వద్ద ఉన్న సర్టిఫైడ్ ఆఫ్‌లైన్ పీఓఎస్ టెర్మినల్‌పై ట్యాప్ చేస్తే చాలు. ఎలాంటి యూపీఐ పిన్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే లావాదేవీపూర్తవుతుంది.ఈ లావాదేవీ వివరాలను పీఓఎస్ టెర్మినల్ తనలో స్టోర్ చేసుకొని, తిరిగి ఇంటర్నెట్ కనెక్టివిటీ వచ్చిన వెంటనే సెటిల్‌మెంట్ కోసం పంపుతుంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | బుధవారం 22 జూలై 2026 | I


## ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా
# కలిసిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు



**కాకినాడ రూరల్, జూలై 22(ప్రభాతవార్త):** భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సి. పి. రాధాకృష్ణన్ ను న్యూఢిల్లీలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు , కేంద్ర భారీ పరిశ్రమలు ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, పలువురు పార్లమెంట్ సభ్యులతో కలిసి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణ, కేంద్ర-రాష్ట్ర సమన్వయం, రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై ఉపరాష్ట్రపతి కు వివరించారు.

## చందన స్వరూపుడు. కలియుగ ప్రత్యక్ష దైవం..
### శ్రీనివాసునికి నిత్యకళ్యాణం, అష్టోత్ర పూజలు...
**వాడపల్లి నిత్యాన్న పథకానికి రూ,100007-/విరాళం..**





**ఆత్రేయపురం, జూలై,21,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి మంగళవారం వేలాది మంది భక్తుల తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కంకణధారణ, పాదోప్రక్షాళన, కన్యాదానం, మధుపర్కప్రాశన, సూత్ర,హ యజ్ఞోపవేతధారణ, తలంబ్రాల క్రతువును అర్చకులు కనులపండువగా నిర్వహించారు. తొలుత అష్టోత్తర శతనామావళి, గోపూజ, బాల భోగం నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. శ్రీకాకుళం చెందిన చిన్నం బాల శంకర్ రెడ్డి, లలిత, దంపతులు, చిరంజీవి, మణికంఠ, ఉజ్వల్, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 100007/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు.వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.

## సురక్షితమైన తాగునీటి సరఫరాపై అప్రమత్తంగా ఉండాలి
### 19 నీటి పరీక్షలు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం సిటీ ,జూలై 21 (ప్రభాతవార్త)** నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటి సరఫరా పై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. మహారాష్ట్ర నుంచి గోదావరిలోకి ఎర్ర నీరు చేరుకున్న నేపథ్యంలో హెడ్ వాటర్ వర్క్స్ ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి నాణ్యత పై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉన్నారని ప్రస్తుతం 19 రకాల నీటి నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ సురక్షితమైన మంచినీటి సరఫరాను కొనసాగిస్తున్నామని అమృత 2.0 ద్వారా నగరానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ప్రారంభమైందని మీరు ఎర్రగా మారిన నేపథ్యంలో నగరం ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదన్నారు ప్రతిరోజు నీటి నాణ్యత పై 19 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇందులో భౌతిక పరీక్షల తో పాటు రసాయన పరీక్షల కూడా నిర్వహిస్తున్నామని నీరు పూర్తిగా సురక్షితంగా ఉంటుందని నిర్ధారించిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే ధవళేశ్వరం కోటిలింగాల ప్రాంతంలో జనరేటర్ లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వర్షాకాలంలో ఎక్కడైనా తాగునీటి పైప్ లైన్ లో లీకేజీలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రజా ప్రజా ప్రతినిధులకు లేదా అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ప్రారంభించారు.. తాళం వేశారు



**రామచంద్రపురం,జూలై 21 (ప్రభాతవార్త):** రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు మరుగుదొడ్ల కష్టాలు తప్పడం లేదు.ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న ఒకే ఒక్క మరుగుదొడ్డితో రోగులు,వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరిస్తామని సుమారు మూడు నెలల క్రితం ఆసుపత్రి ఆవరణలో మహిళలు,పురుషుల కోసం వేర్వేరుగా నూతన మరుగుదొడ్లను నిర్మించి ప్రారంభించారు.అయితే ప్రారంభోత్సవం ముగిసిన వెంటనే వాటికి తాళాలు వేసి మూసివేయడంతో అవి ఇప్పటికీ నిరుపయోగంగానే ఉన్నాయి.కొత్తగా నిర్మించిన మరుగుదొడ్లు ప్రజల అవసరాలకు ఉపయోగపడాల్సింది పోయి తాళాలే పరిమితం కావడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఒకవైపు రోగులు మరుగుదొడ్ల కోసం ఇబ్బందులు పడుతుండటే,మరోవైపు కొత్త మరుగుదొడ్లు మూసివేసి ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని రోగులు మండిపడుతున్నారు.అలాగే మూత్ర పరీక్షల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.ప్రజల సౌకర్యం కోసమా నిర్మించింది... లేక ప్రారంభోత్సవం చేసి తాళం వేయడానికా? అంటూ ప్రశ్నిస్తున్నారు.వెంటనే మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని రోగులు, వారి బంధువులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రంపచోడవరం ఐటీడీఏలో దివ్యాంగులకు
# ట్రైసైకిళ్లు, కృత్రిమ పరికరాల పంపిణీ



**రంపచోడవరం, జూలై 21: ప్రభాతవార్త.** పోలవరం జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ ప్రాంగణంలో దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు, ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం సి.డబ్ల్యూ.ఎస్.ఎన్ కార్యక్రమం ద్వారా నడవలేని దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 33 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు మరియు ఇతర సహాయక పరికరాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. వారి విద్యాభివృద్ధి కోసం మేధస్సును పెంపొందించే కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, దివ్యాంగులు ఎక్కడ ఉన్నా వారికి అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు అయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథులు దివ్యాంగ విద్యార్థులకు ట్రైసైకిళ్లు, కృత్రిమ అవయవాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో జి. శ్రీరామ్ మూర్తి, జిల్లా శిశు సంక్షేమ అధికారి కె. ఉమా, ఎంఈఓ శ్రీనివాసరావు, డాక్టర్ నీలిమతో పాటు పలువురు అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ హాస్టల్ కు దిటుగా ప్రభుత్వ వసతి గృహాలు
### రాష్ట్ర రోడ్లు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ శివ



**శంఖవరం జులై 21 ప్రభాతవార్త** కార్పొరేట్ హాస్టల్ కు దీటుగా ప్రభుత్వ వసతి గృహాల లో విద్యార్థులకు సర్వ సౌకర్యాలు కల్పించాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్న శివ పేర్కొన్నారు . శంఖవరం మండలంలోని కత్తిపూడి లో గల సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన దుప్పట్లు, రగ్గులు, ఆట దుస్తులు, పరుపులు, దిండ్లును వెన్నా శివ, ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్య కిరణ్ (బాబి) చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెన్నా శివ, మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హాస్టళ్ల రూపురేఖలు మార్చి, నాణ్యమైన విద్యను అందిస్తుందని అన్నారు. రాష్ట్ర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి బాబి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు దూరంగా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా ముందుకు సాగాలని చదువుతోపాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని మంచి నిద్ర ఉంటేనే చదువు బాగా వస్తుందని భావించిన ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు పరుపులను అందిస్తుందని పేర్కొన్నారు కార్యక్రమంలో టిడిపి నేతలు బద్ది రామారావు, సాధనాల లక్ష్మీబాబు, కేలంగి జనార్ధన్, గాబు కృష్ణమూర్తి, గౌతు కన్నారావు బద్ది రామకృష్ణ, నాయుడు బుజ్జి, నక్క శీను కంచిభోయిన శ్రీను జనసేన నేతలు కరణం సుబ్రహ్మణ్యం, గాబు సుభాష్, కీర్తి కుమార్వసతి గృహ సంక్షేమ అధికారి శివకోటి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వ మెటీరియల్
## పంపిణీ చేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట,జూలై 21 (ప్రభాతవార్త)** జగ్గంపేట సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో, కోనేటి వీధి బాలుర వసతి గృహంలో ప్రభుత్వం అందిస్తున్న మెటీరియల్ పంపిణీ కార్యక్రమం జరిగింది. వార్డెన్లు పడాల రోజా, పిట్ట ప్రభాకర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో ముచ్చటించారు. ప్రతి విద్యార్థి పేరు, చదువు, ఊరు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో అందిస్తున్న ఆహారం, వంట గదులను పరిశీలించారు. ప్రభుత్వం ఇస్తున్న ఒక పరుపు, ఒక దుప్పటి, ఒక బెడ్ షీట్, ఒక దిండు, రెండు నైట్ డ్రెస్సులు, ఒక రగ్గు, స్టీల్ ప్లేట్, గ్లాసు, గిన్నె, సబ్బులు, పేస్ట్, దువ్వెన తదితర అన్ని రకాల మెటీరియల్ ను ప్రతి విద్యార్థికి అందజేశారు. సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విద్యా వ్యవస్థను సమూలంగా మార్చుతున్నారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. అన్ని వసతులతో పాటు తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి లబ్ధి చేకూరుస్తున్నారని తెలిపారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని, రాబోయే ఏడాది షైనింగ్ స్టార్స్ అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. బాలుర వసతి గృహంలో ఆహారం వసతులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు అందరి ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి పెట్టి వైద్య పరీక్షలు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడపా భరత్, కన్నబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, పైడిపాల సూరిబాబు, పాండ్రంగి రాంబాబు, చదరం చంటిబాబు, బొల్లం రెడ్డి రామకృష్ణ, వేములకొండ జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 34 మందికి శిక్ష

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూలై 21 (ప్రభాత వార్త)** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఉత్తర్వులు ప్రకారము, అడిషనల్ ఎస్పీ ఎం. కిషోర్ కుమార్ ( అడ్మిన్) సారద్యం లో కాకినాడ పట్టణం నందు ,రోడ్ యాక్సిడెంట్లను తగ్గించాలని ఉద్దేశంతో కాకినాడ ట్రాఫిక్ ఒకటవ, రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో త్రాగి వాహనం నడుపుతున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 34 కేసులను బుక్ చేయడం జరిగింది వాహన తనిఖీలలో భాగంగా, తాగి వాహనం నడిపిన వాహనదారులకు, 3వ స్పెషల్. జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ కాకినాడ నందు చింతా నాగేంద్రరావు కోర్టులో మొత్తం 34 మంది పై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు శిక్ష విధించడం జరిగింది. ంట్రాఫిక్ 1 పోలీస్ స్టేషన్లో - 18 , ట్రాఫిక్ 2 పోలీస్ స్టేషన్లో - 16, మొత్తం = 34 కేసులలో 15 మందికి జైలు శిక్ష, 19మందికి ఒక్కొక్కరికి రూ. 10,000/- చొప్పున, మొత్తం. =ం. 1,90,000/- జరిమానా విధించారు.

## ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత
### రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు జులై 21(ప్రభాత వార్త)** ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం టి.మామిడాడ గ్రామంలో రూ 36 లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనానికి మంగళవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్య రంగాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు కేటాయిస్తూ గ్రామ స్థాయిలో ఆరోగ్య సేవలను బలోపేతం చేస్తోందన్నారు. టి మామిడాడలో నిర్మించనున్న విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు, మాతా -శిశు సంక్షేమ సేవలు, వ్యాధి నిరోధక కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా అందుబాటులోకి వస్తాయని అయన వివరించారు. గ్రామాల్లో ఆరోగ్య మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు మెరుగైన వైద్య సేవలు పొందేలా ప్రతి గ్రామంలో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి సుభాష్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జీ పోలిశెట్టి చంద్రశేఖర్, ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు పోతురాజు భీమరావు, బీసీ సెల్ నాయకులు వల్లు అర్జునరావు, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ,కోట తాతబ్బాయి, కొల్లు వెంకటేశ్వరావు, ఏంపిటిసి గొల్లపల్లి సింహాద్రి, కూటమి నాయకులు మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ, వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, ఫణి, గ్రామ పెద్దలు, వైద్య శాఖ అధికారులు, స్థానిక ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రభాత వార్త
**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను**

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్ను మరింత పటిష్టవంతంగా చేయాలనుకుంలోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు కాకినాడ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది."

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**
- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**
గండేపల్లి, కిర్లంపూడి, అన్నవరం, తొండంగి, , తుని రూరల్, కోటనందూరు, పిఠాపురం, సామర్లకోట, కరప, యానం, కాకినాడ సిటీ

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.
'వార్త' ఆఫీస్, రాజమహేంద్రవరం
వివరములకు: 9666685998, 8096661682
నెంబర్లను సంప్రదించగలరు


## కడియపులంక పంచాయతీ అక్రమాలపై విచారణకు నలుగురు సభ్యుల కమిటీ
**పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీఎల్పీఓ ఆదేశాలు.. కలెక్టర్కు అందనున్న నివేదిక**



**కడియం, జూలై 21 ( ప్రభాతవార్త)** కడియం మండలంలోని కడియపులంక గ్రామ పంచాయతీలో గత ఆరున్నర నెలలుగా చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై జిల్లా పంచాయతీ అధికారి (డీఎల్పీఓ) ఎం. నాగలత విచారణకు నలుగురు సభ్యులతో ప్రత్యేక కమిటీని నియమించారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ కమిటీలో కడియం డిప్యూటీ ఎంపీడీఓ ఎన్. శ్రీనివాస్తో పాటు వేమగిరి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి ఎం. రూపిచంద్, జేగూరుపాడు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి పి. ప్రకాశరావు, దామిరెడ్డిపల్లి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శి బి. మహేష్కుమార్ సభ్యులుగా ఉన్నారు. కడియపులంక గ్రామ పంచాయతీలో జరిగిన వ్యవహారాలపై సమగ్రంగా విచారణ నిర్వహించి, పది రోజుల్లోగా నివేదికను సమర్పించాలని డీఎల్పీఓ ఆదేశించారు. అనంతరం ఆ నివేదికను జిల్లా కలెక్టర్కు పంపించనున్నారు. ఇదిలా ఉండగా, సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కడియపులంక గ్రామానికి చెందినవారు ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ వ్యవహారాలపై ఇప్పటికే పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు అందడంతో పాటు ప్రజాకాంక్షలోనూ, పలు పత్రికల్లోనూ కథనాలు వెలువడిన నేపథ్యంలో ఈ విచారణకు ప్రాధాన్యత ఏర్పడింది. గ్రామ పంచాయతీలో జరిగిన వ్యవహారాలపై పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చేలా కమిటీ నిష్పాక్షికంగా విచారణ నిర్వహించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం తదుపరి చర్యలు చేపట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

## ప్రతిభకు పట్టం. మన్యం ఆణిముత్యాలకు ఘన సన్మానం





**పోలవరం జిల్లా ప్రతినిధి జూలై 21 ప్రభాత వార్త.** పోలవరం జిల్లాలోని వివిధ పాఠశాలలలో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించి మన్యం ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన శైనింగ్ స్టార్స్ ను మంగళవారం పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్కుమార్, రంపచోడవరం యం. ఎల్ ఏ. మీరియల శిరీష దేవి చేతుల మీదుగా ఘనంగా సన్మానించి, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అయ్యే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని అన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో పోలవరం జిల్లాలోని పదవ తరగతి, ఇంటర్మీడియట్లో జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో మంచి మార్కులతో ప్రతిభ కనబరిచిన సైనింగ్ స్టార్ విద్యార్థులకు 20వేల రూపాయల ప్రైజ్ మనీ, మెడల్స్, సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్, రంపచోడవరం శాసనసభ్యులు, లెజిస్లేటివ్ చైర్మన్ శ్రీమతి మిరియాల శిరీష దేవి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ నెంబర్ గొర్లె సునీత, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఎంపీపీ శ్రీమతి బంధం శ్రీదేవి, జడ్పీటిసి శ్రీమతి పండ వెంకటలక్ష్మి, ఇంటర్మీడియట్ ఆర్ జె డి శేఖర్ బాబు, డి ఐ ఓ కరుణాకర్ రావు, డీఈవో జి. శ్రీరామ్ మూర్తి ముఖ్య అతిథులు హాజరైనారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ మాట్లాడుతూ నూతనముగా ఏర్పడిన పోలవరం జిల్లా బాగా వెనుకబడిన జిల్లా అని ఈ నూతన పోలవరం జిల్లాలో చదువుతోపాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకొని బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు. ప్రతి మనిషి అభివృద్ధి చెందాలంటే విద్య చాలా ముఖ్యమైనదని అందుకు చిన్నతనం నుండే విద్యపై దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. చదువుకున్న ప్రతి వ్యక్తి కి చదువు ఒక మార్గాన్ని చూపిస్తుందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకొని మంచి మార్కులతో పాసై మిగతా విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని ఆయన అన్నారు. పదవ పాసై మీకు నచ్చిన సబ్జెక్టులలో ఇంటర్మీడియట్ జాయిన్ అయ్యి ఇంటర్మీడియట్ పాస్ అయిన వెంటనే ప్రతి విద్యార్థి ఒక గోల్ పెట్టుకోవాలని ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్, సైంటిస్ట్, లాయర్, రాజకీయాలలో రాణించే విధంగా ముందుగా ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రతి ఇంట్లో ఆడపిల్లలకు తల్లిదండ్రులు మంచి చదువులు చదువుకునే విధంగా ప్రోత్సహించాలని ఆయన అన్నారు. వివిధ రంగాలలో ఆడపిల్లలు ముందుండి అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. ప్రతి విజయం వెనక ఒక చరిత్ర ఉంటుందని ఆయన అన్నారు. ప్రపంచంలో అందరికీ 24 గంటలు ఉంటుందని ఆ 24 గంటల్లో చదువుకు కొంత సమయం తప్పనిసరిగా కేటాయించాలని ఆయన అన్నారు. చదువుకునే వయసులో చదువుపైనే దృష్టి పెట్టి కష్టపడి చదువుకుంటే మీ జీవితాలనే చదువు మార్చేస్తుందని ఆయన అన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కొరకు మధ్యాహ్న భోజన పథకం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. పోలవరం జిల్లాలో 52 మంది పదో తరగతి విద్యార్థులకు, 15 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు మంచి మార్కులతో పాస్ అయిన విద్యార్థులందరికీ సైనింగ్ స్టార్ అవార్డులు రావటం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఈ అవార్డులకు ఎంపికైన విద్యార్థులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపరు.ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, ఎస్ఎస్సి అధికారి భాస్కర్ రావు,జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమా, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారి జి. తమ్ముడు, ఎంఈఓ శ్రీనివాసరావు,డాక్టర్ నీలిమ,చిన్నిబాబు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.


**శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం,**
అన్నవరం-533406, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్.
**ఇ -ప్రొక్యూర్ మెంట్- టెండరు కం బహిరంగ వేలము ప్రకటన**
ఆర్.సి.నెం.సి1/46562/2025, ది.21-07-2026
శ్రీ స్వామి వారి దేవస్థానమునకు సంబంధించిన ఈ దిగువ ఐటమ్స్‌నకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ సీల్డు టెండరు కం-బహిరంగవేలం నిర్వహించబడును

| వ.సం | వివరములు | ప్రథమ ధరావత్తు రూ.లు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొండపైన బుక్కింగ్ కౌంటర్ ఎదురుగా గల షాప్ నెం.3 నందు కొబ్బరికాయలు, అరటిపండ్లు ఇతర పూజాద్రవ్యములు విక్రయించుకొను లైసెన్సు హక్కునకు (3 వ పర్యాయం) | 10,00,000/- | రెండు సంవత్సరములు |
| 2. | సత్య గిరి కొండపై క్యాంటీన్ నిర్వహించుకొను లైసెన్సు హక్కునకు. | 10,00,000/- | రెండు సంవత్సరములు |
| 3. | కొండపైన తూర్పు వైపున గల కార్ పార్కింగ్ షాప్ నెం-4 నందు వ్యాపారం చేసుకొను లైసెన్సు హక్కునకు. | 2,00,000/- | రెండు సంవత్సరములు |
| 4. | కొండపైన తూర్పు వైపున గల కార్ పార్కింగ్ షాప్ నెం-5 నందు వ్యాపారం చేసుకొను లైసెన్సు హక్కునకు.(ప్రస్తుతము స్టోరు నిర్వహణ జరుగుచున్నది.) | 2,00,000/- | రెండు సంవత్సరములు |
| 5. | కొండ దిగువున సత్య నికేతన్ షాప్ నెం.1 , 2 మరియు 4, 5 ,6 షాపులు విడివిడిగా.(2వ పర్యాయము | 2,00,000/- | 3 సం.లు |
| 6. | శ్రీ స్వామి వారి దేవస్థానము కొండదిగువ వాహనశాల యందు గల హాలు నందు సామాను భద్రపరచుకొను స్టోర్ రూమ్ (2వ పర్యాయము). | 50,000/- | 3 సం.లు |
| 7. | సత్యగిరి మరియు రత్నగిరి కొండపై వివాహ గుమ్మటములు ఏర్పాటు చేసికొను లైసెన్స్ హక్కు (విడివిడిగా) | 10,00,000/- | 2 సం.లు |

పైన తెలిపిన ఐటమ్సునకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డు టెండరు కం బహిరంగ వేలం నిర్వహించబడును. టెండరు షెడ్యూలును ది.05.08.2026 నుండి ది.09.08.2026 వరకు కార్యాలయ పనివేళలలో రూ. 1,180/-లు చెల్లించి టెండరు షెడ్యుల్ను పొందవచ్చును. ది.10.08.2026 న ఉదయం11.00 గంటల వరకు కొండపై కళావేదిక వద్ద వుంచబడిన టెండరుబాక్సు నందు వేయవలెను. ఇ-ప్రొక్యూర్మెంట్ కొరకు వెబ్‌సైట్ **www.eprocurement.gov.in** ను సంప్రదించవచ్చును. మరియు కార్యాలయము పని వేళలలో గాని లేదా ఫోన్ నెం. 8712893552, 9505272711, 9494940616 నందు సంప్రదించవచ్చును.

ఎస్.ఎస్.చక్రధరరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్



## సమస్య పరిష్కారానికి కృషి

**గోపాలపురం జూలై 21 (ప్రభాతవార్త)** గోపాలపురం అరుంధతీ పేటలో డ్రైనేజీ నీరు పొంగి గృహ సముదాయాల మధ్య ప్రవహిస్తూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.ఈ నేపథ్యంలో రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ గారు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు (నాగు) గారు అక్కడికి చేరుకుని సమస్యను పరిశీలించారు. స్థానికుల నుంచి వివరాలు తెలుసుకుని సంబంధిత అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం సభకు
## ముందే ప్రకటన చేయాలి



**వి.ఆర్.పురం,జూలై21,ప్రభాతవార్త** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 24 వ తేది రంపచోడవరం పర్యటనకు వస్తున్న నేపధ్యంలో, ముందుగానే పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యలపై స్పష్టమైన ప్రకటన చేయాలని, వి.ఆర్.పురం ఎంపిపి కారం.లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్ లో, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులతో కలిసి మండలంలోని పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఆమె మాట్లాడారు. పోలవరం ప్రాజెక్ట్ తో సర్వం కోల్పోతున్న మండలంలోని రామవరం గ్రామానికి చెందిన 104 కుటుంబాల గిరిజన నిర్వాసితులను అధికారులు ఆర్.అండ్.ఆర్ జాబితా నుండి ఏకపక్షంగా తొలగించారని ఆమె ఆరోపించారు. తక్షణమే ఉమ్మడి రీసర్వే నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కాంటూర్ లెక్కలతో సంబంధం లేకుండా నిర్వాసిత గ్రామాలన్నింటికి ఒకేసారి పునరావాసం కల్పించాలని ఆమె అన్నారు. పోలవరం బహుళార్థక సాధక ప్రాజెక్టు కోసం సమస్తాన్ని త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ఈ ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆవేదన కలిగిస్తుందన్నారు. 2013 భూసేకరణ చట్టం (ఎల్.ఎ.ఆర్.ఆర్ యాక్ట్ 2013) గిరిజన హక్కుల చట్టాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. తక్షణమే రెవెన్యూ, పోలవరం అధికారులతో ఉమ్మడి రిసర్వే నిర్వహించి, బాధితులందరి పేర్లను జాబితాలో తిరిగి చేర్చాలన్నారు. చింతరేవుపల్లి రెవెన్యూ పరిధిలోని 41.15 కాంటూరు లోగల సున్నంవారిగూడెం, పెద్దమట్టపల్లి, గుర్రంపేట, ఉమ్మడివరం గ్రామాలకు చెందిన గిరిజన రైతుల సాగు భూములకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని ఆమె కోరారు. భూములు కోల్పోతున్న ప్రతి గిరిజన రైతుకు చట్ట ప్రకారం పరిహారం, పునరావాసం అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులను పునరావాస కాలనీలకు తరలించిన అధికారులు ఇప్పటి వరకు అక్కడ సరైన తాగునీరు, విద్యుత్, రోడ్లు, ఉపాధి అవకాశాలు కల్పించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పూనెం.ప్రతీఫ్ కుమార్, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కారం.సుందరయ్య, పులి.బొజ్జి, కుంజా.కన్నయ్య, గొర్రె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేట వద్దు...ప్రాణాలు ముద్దు.



**ఎటపాక: జూలై 21 ( ప్రభాత వార్త):** ఎగువ దిగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు కారణంగా ఎవరు కూడా వాగులు ,చెరువులు,గోదావరి నది ల వెంబడి చేపల వేటకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దు అని ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ వాసిబోయిన కృష్ణ మంగళవారం పత్రిక ప్రకటన లో తెలిపారు. చిన చిన వలలు, దోమ తెరలు వచంటి ఖ్యాత్ తీసుకొని చేపల వేట వెళ్ళి ప్రాణాలు తీసుకోవద్దు అని హెచ్చరించారు.మండల ప్రజలు ప్రతి ఒక్కరు గమనించగలరు అని యువతి యువకులు చేపల వేటకు వెళ్ళ వారికి మోటివేషన్ చేసి గోదావరి ప్రమాదాలు గురించి చెప్పాలి అని కోరారు...ఇటీవల చేపల వేటకు వెళ్లి ఐదుగురు చనిపోయిన సంగతి గురించి గుర్తు చేశారు.

### నేటి నుంచి పెద్దాపురం నవోదయ లో
### హ్యాండ్ బాల్ పోటీలు



**పెద్దాపురం, జూలై 21 (ప్రభాత వార్త )** పెద్దాపురం పి ఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ నెల 22 నుంచి 24 వరకు పెద్దాపురంలో రేపటి నుంచి రీజనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎస్ శర్మ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేస్తూ వివిధ రాష్ట్రాల నుంచి ఈ పోటీలో పాల్గొనేందుకు 410 మంది క్రీడాకారులు, 37 మంది ఎస్కార్ట్ టీచర్స్, 19 మంది రిఫరీలు, స్థానిక నవోదయ విద్యాలయం నుండి 250 మంది విద్యార్థులు, 50 మంది ఉద్యోగ సిబ్బంది ఈ పోటీల్లో భాగస్వాములుగా కాబోతున్నారన్నారు. దక్షిణ భారత దేశంలో భాగమైనఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్నాటక, పాండిచ్చేరి రాష్ట్రాల నుండి జవహర్ నవోదయ విద్యాలయాలలో చదువుతున్న క్రీడాకారులు ఈ రీజనల్ లెవెల్ హ్యాండ్ బాల్ పోటీలో తలపడనున్నారన్నారు . నేటి నుంచి మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారుల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రాయచూరు క్లస్టర్ -44(26 బాలురు o18 బాలికలు) కరీంనగర్ క్లస్టర్-44(27o17), పోలవరం క్లస్టర్-52(27 బాలురు 26 బాలికలు), కోలార్ క్లస్టర్-54(27o27), పాండిచ్చేరి క్లస్టర్54(27o27) పాలక్కాడ్ క్లస్టర్54(27o27), అల్లెప్పీ52(27o25), చిక్కంగళూరు క్లస్టర్-54(27o27). ప్రతి ఒక్క క్లస్టర్ లో 8 జవహర్ నవోదయ విద్యాలయాలనుండి క్రీడాకారులు పాల్గొనగా మొత్తం 8 క్లస్టర్స్ విద్యార్థులు కలిసి 410 మంది ఈ క్రీడా పోటీల్లో వారి యొక్క ప్రతిభని చూపబోతున్నారు అని ఆ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్ శరత్ చంద్ర కీర్తి తెలిపారు. అదేవిధంగా (ప్రారంభోత్సవ) ముఖ్య అతిథిగా ఆదిత్య యూనివర్సిటీ, సూరంపాలెం (ప్రో వైస్ ఛాన్సలర్ ఎన్ సతీష్ రెడ్డి మరియు ముగింపు ఉత్సవ సభ కు ముఖ్య అతిథిగా కాకినాడ ఎస్పీ గారు బిందు మాధవ్, గెస్ట్ ఆఫ్ హానర్ గా గాంధీ లలిత రైస్ మిల్లు ఎం డి మట్టే సత్యప్రసాద్ బాబు, చీఫ్ రీజినల్ ఆఫీసర్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, విశాఖపట్నం లు పాల్గొననున్నట్లు ఆమె తెలిపారు.

### తాళ్లరేవు లో రూ.15 లక్షల
## విలువైన వెండి చోరీ..


**తాళ్లరేవు జూలై 21 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం తాళ్లరేవు గ్రామంలో కిరాణా వ్యాపారి అడ్డేపల్లి సురేష్ గృహంలో వెండి చోరీ జరిగింది. బాధితుడు సురేష్ చెప్పిన వివరాల మేరకు సోమవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి యానాం సినిమాకు వెళ్ళారు. తిరిగి వచ్చేసరికి ఇంటిలోని వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని అన్నారు. ఈ చోరీలో రూ. 15 లక్షల విలువ చేసే సుమారు 6 కేజీల వెండి వస్తువులు తస్కరించబడ్డాయన్నారు. దీనిపై కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటన స్థలానికి క్లూస్ టీం వచ్చి వివరాల సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

# ఈ అందానికి బంధం వేసారెందుకో !!

### టికెట్ కౌంటర్ ఏర్పాటు చేయాలి!
### పిక్నిక్ స్పాట్ ను పునఃప్రారంభించాలి!



**మోతుగూడెం ప్రభాతవార్త జూలై:21** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటకానికి పెద్దపీటా వేయటం తో పర్యాటక ప్రదేశాల లో పోలవరం జిల్లా ఒకటి. కలెక్టరు దినేష్ కుమార్ సైతం ప్రజా ప్రతినిదులు వివిద శాఖా అధికారులతో అటవిశాఖ విభాగం లక్కవరం రేంజ్ లో గత జూన్ నెలలో పోరుబాయి రిజర్వాయర్ డ్యాం వద్ద యోగాంధ్రాడే దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించటం లొ గల ఆంతర్యం!! ఈప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి జరిగేవిధంగా ఉండాలనే లక్ష్యంతో నాంధి పలుకుచు భాటలు వేయటమేనని ప్రపంచానికి వివిద మీడియా మాద్యమాల ద్వారా తెలియచేసారు.ఇక్కడ ఎన్నెన్నో ప్రకృతి అందాలు ఉన్నాయి. అందులో పోల్లూరు జలపాతం ఒకటైతే, సీలేరు నది (దారలమ్మతల్లి పిక్నిక్ స్పాట్) మరొకటీ. వారంతపు సెలవుల్లో సుదూర ప్రాంతాలనుండి మానసిక ప్రశాంతతా ఉల్లాసం కోసం వేలమంది పర్యాటకులు పోల్లూరు జలపాతాన్ని సందర్శిస్తుంటారు. ఈ క్రమంలో కాలుష్య రహిత పర్యావరణం కొసం అటవీ సంరక్షణ కొసం ఆదాయ వనరులను సమకూర్చుటలో భాగంగా జలపాతం సందర్శన కు వచ్చే పర్యటకుల వద్దనుండి ప్రవేశ రుసుము క్రిందా పిల్లలుకు 10 రూపాయలు పెద్దలకు 30 రూపాయలు,టూవిలర్స్ కి 20 రూపాయలు ఫోర్ వీలర్స్ కి 50రూపాయలు పెద్దవాహనానికి 100 రూపాయలు ప్రివేట్ షుటల్ల కోసం 1000 రూపాయలు టికెట్ రూపంలో నగదు వసూలు చేస్తూ అటవీశాఖ విభాగానికి ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టారు!.దాంతొ టికెట్ కలెక్షన్ కౌంటర్ ను కూడా జలపాతం ప్రవేశ ద్వారం వద్దే ఏర్పాటు చేసారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు పరిసరాల పరిశుభ్రత కోసం పర్యావరణ పరిరక్షణకోసం గిరిజన సొసైటిద్వారా ఏర్పటు చెసిన యువత తాత్కాలిక ఉద్యోగ ఉపాధి జీతభత్యాలు కొసం వినియోగిస్తున్నట్లు సమాచారం?. పర్యాటకుల శ్రేయొస్సును భద్రతను దృష్టిలో పెట్టుకుని ఈ విధంగా జలపాతం వద్దకు వచ్చే పర్యాటకులకు అటవిశాఖ పర్యాటకాభివృద్ధి కి పాటుపడటం హర్షించ దగిన విషయమే!! కానీ!! ఇటివలే దారలమ్మా పిక్నిక్ స్పాట్ వద్ద ఉన్నా సీలేరు నది ప్రవాహ నీటి పరవళ్లలో కొద్దిరోజుల వ్యవది లొనే ఇరువురు యవకులు మునిగి మృతి చెందటం భాదకరమైన విషయం! పర్యాటకుల భద్రతా శ్రేయెస్సు దృష్ట్యా అటవిశాఖ విభాగం గతం లొ అప్రాంతంలో ముళ్ల కంచెను ఏర్పాటు చేసారు.మరెంత భద్రతా కోసం ముళ్ల కంచెను దాటి పర్యాటకులు వెల్లలేని విధంగా వెడల్పాటి పొడవైనా లొతైన కాలవలా ఉండే విధంగా మట్టిని త్రవ్వించారు. అక్కడ డ్యూటి గార్డులను ఏర్పాటు చేసీ పర్యాటకులు ఎవరుని ఆ ప్రదేశంలోకి వెల్లకుండా మరెంతా భద్రతా చర్యలు చేపట్టడం అభినందించ దగిన విషయమే!! ఈ ప్రదేశం లొ ప్రతి వారం రోజులలొ వేయి నుండి రెండు వేల మంది వరకు జలపాతం తో పాటు ఈ నదీ అందాలను వీక్షిస్తూ సందర్శిస్తుంటారు. అంటే ఒక నెలలొ సుమారు గా 5 నుండి 10వేల మంది వరకు ఈ జలపాతం అందాలను సందర్శించుట ద్వారా అటవిశాఖ విభాగానికి వార్షికంగా 10 నుండి 15 లక్షల రూపాయల వరకు ఆదాయం సముకురుతున్నట్లు సమాచారం!?.ఒక్క జలపాతం సందర్శన ద్వారానే ఇంతా ఆదాయం వస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని ఈ నది అందాలను పర్యటకులు ప్రవేశించకుండా ముళ్ళకంచే వేసే కంటే!? ఇక్కడ కూడా జలపాతం వద్ద ఏర్పాటు చేసినట్లే మరో టీక్కెట్ కౌంటర్ ను ఏర్పాటు చేసినట్లేతే!అటవిశాఖకు రెట్టింపు ఆదాయం సమకూరుతుంది కధ! అని పర్యాటకులు వాపొతున్నారు.



ఆదాయమార్గాం తో పాటు పలువురు గిరిజన యువతకి తాత్కాలిక ఉద్యోగ నియమకం ద్వారా భర్తి చేస్తే సిబ్బంది సంఖ్యా పెరుగుతుంది.వారి సంరక్షణలో పర్యాటకులకు భద్రత ప్రమాణాలు కల్పించినట్లు ఉంటుంది. సిబ్బంది పర్యవేక్షణ ఇక్కడ ఉండటం వలన నది అందాలను సందర్శించే అవకాశం ఉంటుంది.ప్రపంచ వ్యాప్తంగా అఖండ (2)చిత్రం లొ హీరో బాలకృష్ణ తొ పాటు కూతురు గా నటించిన సెలెబ్రిటీ నటి తో (చిత్రాఃభష్మాన్ని) పరవళ్లుత్రొక్కుచూ ప్రవహించే సీలేరు ఈ నదిలొ కలిపిన సన్నివేశం కొట్లాది మంది వీక్షకుల మదిలో ఈ నదీ అందాల ఆ దృశ్యం ముద్రపడిపోయింది. మన ఆంధ్రప్రదేశ్ లొ ఇంత అందమైన నది అందాలు ఉన్నాయా!! అని ఆశ్చర్యపడే విధంగా పర్యాటకుల మనస్సులను దోచుకుంది. పోలవరం జిల్లా లొ చింతూరు మండలం మోతుగూడెం ప్రక్కనే ఉందనీ చెప్పుకునే స్థాయి నుండి పర్యాటకాభివృద్ధ కి నాంధి పలికినా నాటీ అధికారుల మాటా!! నేడు ముళ్లకంచెల సంకెళ్లు సరిహద్దులుగా చేసీ భద్రతా ప్రమాణాలు అంటు రహదారికి నదికి మద్య బాట లేకుండా వెడల్పైనా లోతైన కాలువ మాదిరిగా మట్టిని (ట్రెంచ్ ని) త్రవ్వీ నది ఒడ్డుకు ఎవరిని వెల్లకుండా ఈ ప్రకృతి అందానికి బంధం వేయుట ఏమిటని!!! పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రమాదాలు జరిగినచోట్ల ఈ నిభందన లేదుకాని! ఇక్కడే ఇలా ఎందుకని పలువురు ఆరోపిస్తున్న వాదనలకు సాక్ష్యంగా, జలపాతం వద్ద గాని సోకులేరు వద్ద గాని పాములేరు వాగు వద్ద గాని దశాబ్దాల చరిత్రకాలం లొ అనేక మంది నదులలొ వాగుల్లొ మనిగి మృతి చెందిన సంఘటనలు నమోద్దైన సందర్భాలకు సాక్ష్యంగా శాఖ విభాగాలలో ఉన్నాయి. గడచిన సంఘటనలు అన్నీ భాధకరమైన విషమే?? అయిన మానవ జీవన మనుగడను స్వేచ్ఛ హక్కుల పరిరక్షిస్తూ ప్రకృతి ఒడిలొ అందరు భద్రతా ప్రమాణాలతొ పర్యాటకరంగాభివృద్ధి భాటలు వేసేలా చర్యలు చేపట్టాలనీ ఆశిద్దామా!!

# దస్తావేజు లేఖర్ల నిరసన



**ఆత్రేయపురం, జూలై,21,(ప్రభాత వార్త)** సాధనకు దస్తావేజు లేఖర్లు నిరసన బాట పట్టారు. మంగళవారం ఆత్రేయపురం దస్తావేజు లేఖర్లు యలమర్తి శ్రీ రామచంద్రమూర్తి, (రాంబాబు) ఆధ్వర్యంలో దస్తావేజు లేఖర్లు మండల కేంద్రమైన ఆత్రేయపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ ప్రకటించి కార్యకలాపాలు నిలిపివేశారని ,రిజిస్ట్రేషన్ సేవలతోపాటు క్రయవిక్రయాలకు సంబంధించిన సేవలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలని అలాగే జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. లేఖర్ల ఉపాధి కోల్పోకుండా ప్రభుత్వం వెంటనే జీవోను వెనక్కి తీసుకోవాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం దస్తావేజు లేఖర్లు మిద్దె శ్రీరామ్మూర్తి, అద్దాల శ్రీను, వాసు, చింతా సురేష్, తుర్ర దుర్గయ్య, లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి వైద్య శిబిరం



**కొత్తపేట, జూలై 21, (ప్రభాతవార్త)** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలు లో నేత్ర వైద్యులు డా కె రజని చే సుమారు రెండు వందల మంది విద్యార్థులకు మంగళవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారని పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ తెలియజేశారు వీరిలో పదిమంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారన్నారు ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఎన్ శివరత్నం ఆరోగ్య కార్యకర్తలు ధనవరలక్ష్మీ నాగలక్ష్మి మినాక్షీ దుర్గా లక్ష్మీ పాల్గొన్నారు పాల్గొన్నారు

### మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ
## బాధ్యతగా తీసుకోవాలి
### కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, జూలై 21 (ప్రభాతవార్త)**పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా పిలుపునిచ్చారు. మంగళవారం గేయిల్ రోడ్డు నగరపాలక సంస్థ అధికారులు సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రకృతిని ప్రేమించడం ప్రకృతితో కలిసి జీవించడం ద్వారానే మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందని అన్నారు. చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు చాలా అవసరమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా న్ని కాపాడుకోవచ్చు అన్నారు. వర్షాకాలంలో రహదారులు వెంబడి కనీసం 1000 మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవలసిన బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలో కళాశాలలో వివిధ వసతి గృహాల ఆవరణలో విడివిడిగా మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ డి హెచ్ అనిత డి ఈ వెంకటలక్ష్మి ఏ ఈ సత్యనారాయణ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభ చాటిన ఏడుగురు విద్యార్థులకు
## షైనింగ్ స్టార్స్ అవార్డులు
### ఒకరు కళాశాల.. ఆరుగురు పదో తరగతి




**రాజవొమ్మంగి, జూలై 21, ప్రభాతవార్త** గత విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులను సాధించిన ఏడుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకొన్నారు. రాజవొమ్మంగి ఏ. పి. గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల 2026 సం. హెచ్. ఇ. సి. 877/ 1000 మార్కులను సాధించిన విద్యార్థిని అనిమిరెడ్డి యజ్ఞశ్రీ షైనింగ్ స్టార్ అవార్డు ను అందుకొన్నట్లు ప్రిన్సిపాల్ షీలా తెలిపారు. మంగళవారం రంపచోడవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ దినేష్ కుమార్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి చేతులు మీదుగా రూ. 20 వేలు చెక్కు, మెడల్, ప్రశంశాపత్రంను అందుకోవడం జరిగింది. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, ఆర్ జె. డి. టి. శేఖర్ బాబు, ప్రిన్సిపాల్ షీలా, సిబ్బంది పాల్గొన్నారు. రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2025..26 సం. పదోతరగతి ఫలితాల్లో ప్రతిభను చాటిన ఐదుగురు విద్యార్థినులు కూడా అవార్డులను అందుకొన్నట్లు హెచ్. యం. ఆదిలక్ష్మి తెలిపారు. చప్పా కాంచన శిరి (579/600), తంగేటి కామేశ్వరి (543/600), పసుమర్తి తనుశ్రీ (533/600), తోలాటి హారిక (523/ 600), అయినవల్లి మౌళి (516/ 600) మార్కులను సాధించారు. వీరు కూడా ఒకొక్కరు రూ. 20 వేలు చెక్కు, ప్రశంసాపత్రం, మెడల్ ను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే చేతులు మీదుగా అందుకున్నారని హెచ్. యం ఆదిలక్ష్మి వెల్లడించారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభను చాటిన అనంతగిరి గ్రామానికి చెందిన వాసా నదీప్ (563/600) మార్కులను సాధించారు. షైనింగ్ స్టార్ అవార్డును అందుకోవడం జరిగింది. నదీప్ తండ్రి మంగరాజు రాజవొమ్మంగి విద్యాశాఖలో సిఆర్పీగా పని చేస్తున్నారు.

## వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వ యంత్రాంగం సిద్ధం..!
### తహసిల్దార్ ధర్మేంద్ర - కూనవరం మండల వరద సమీక్షా సమావేశం




**కూనవరం, జూలై 21, ప్రభాతవార్త :** వరదలు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి ఆస్థి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా సమన్వయంతో పనిచేద్దామని కూనవరం మండల తహసిల్దార్ ధర్మేంద్ర అన్నారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పక్షాల నాయకులతో వరద సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వరదల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎటువంటి లోపాలు జరగకుండా సమిష్టిగా పనిచేయాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పక్షాల నాయకుల సూచనలను ఉన్నతాధికారులకు సూచించడం జరుగుతుందని అన్నారు. తర్వాత ఎంపీడీవో ఆశీర్వాదం మాట్లాడారు. అన్ని సచివాలయాల సిబ్బంది వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు వరదల సమయంలో ముంపుకు గురయ్యే రహదారుల వద్ద పడవలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. తర్వాత మెడికల్ ఆఫీసర్ చేతన్ కుమార్ మాట్లాడారు. వరదల సమయంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పారిశుద్యాన్ని మెరుగుపరచడంతోపాటు దోమల తెరలను ప్రతి ఒక్కరు ఉపయోగించాలన్నారు. అన్ని రకాల మందులు సిద్ధంగా ఉంటాయని, అలాగే పాముకాటు, తేలు కాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పాముకాటు, తేలుకాటుకు సంబంధించిన ఇంజక్షన్లు సిద్ధంగా ఉంచుతామని అన్నారు. తరువాత ఆర్డబ్ల్యూఎస్ ఏఈ భాను ప్రకాష్ మాట్లాడారు. పునరావాస కేంద్రాలలో అన్నిచోట్ల పనిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, త్రాగునీటి సమస్యకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో రాజకీయ పక్షాల నాయకులు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బోదునూరు నుండి ఏడు రాళ్లపల్లి వెళ్లే రహదారి నిర్మాణం పనులు నేటికీ పనులు అసంపూర్తిగా ఉన్నాయని అన్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తి జరిగితే ఎంత వరదల సమయంలో కూడా భద్రాచలం వెళ్లవచ్చునని అన్నారు. అలాగే మండలంలో వివిధ రహదారుల నిర్మాణాలు జరగాలని సూచించారు.రిహబిటేషన్ సెంటర్ అయిన కోతులగుట్ట వద్ద అన్ని వసతులు చేపట్టాలని అన్నారు. రోడ్డు ముంపు ప్రాంతాలలో పడవలను విధిగా ఏర్పాటు చేయాలని, బియ్యం, నిత్యవసర వస్తువులు అందుబాటులో ఉంచాలని, టార్పాలియన్స్ బాధితులకు అందజేయాలని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయాధికారిణి దేవి, ఏపీఎం సి సి సుధాకర్, ఫారెస్ట్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు పాయం రంగమ్మ, తెలుగుదేశం నాయకులు ఎడవల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, బిజెపి నాయకులు పాయం వెంకయ్య, జనసేన నాయకులు నరేంద్ర, సిపిఐ నాయకులు లంబు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### గిరిజన శిశువు అత్యవసర వైద్యానికి...
## రూ. 40 వేలు సహాయం
### జనసేన వీరామహిళ ఔదార్యం
### గిరిజన శిశువు వైద్యానికి రూ. 1.50 లక్షలు వ్యయం



**రాజవొమ్మంగి, జూలై 21, ప్రభాతవార్త** మూడు నెలల గిరిజన మగ శిశువు అత్యవసర వైద్య సేవలకు సకాలంలో రూ. 40 వేలు నగదు సహాయాన్ని రంపచోడవరంకు చెందిన జనసేన వీర మహిళ విశాలాక్షి అందించి మానవత్వాన్ని చాటారు. రాజవొమ్మంగి జనసేన సాయి, మరి కొంతమంది రూ. 20 వేలు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజవొమ్మంగి పంచాయితీ ముర్లవానిపాలెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ పాడి లావణ్య జన్మనిచ్చిన మూడు నెలల మగ శిశువు తీవ్ర అనారోగ్యంతో కావడంతో ఈనెల 10 తేదీ సాయంత్రం రాజవొమ్మంగి పి. హెచ్. సి కి తీసుకొని వెళ్లారు. అక్కడ సిబ్బంది అడ్డతీగల ఆసుపత్రికి రిఫర్ చేశారు. అడ్డతీగల నుండి రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. రాజమండ్రి నుండి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి రిఫర్ చేయగా ఒక్కరోజులో మూడు ఆసుపత్రులు 130 కి. మీ ప్రయాణంలో చేసిన శిశువుని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించలేని స్థితిలో ప్రవేటు ఆసుపత్రికి వెళ్లారు. రాజమండ్రి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 10 రోజులు పాటు చికిత్స పొందటం జరిగింది. ఈవిషయం జూలై 20న తెలుసుకున్న రంపచోడవరం జనసేన వీరమహిళ విశాలాక్షి ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి చికిత్స కోసం రూ.40 వేల ఆర్థిక సహాయం అందజేసి, ధైర్యం చెప్పారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం సామాజిక బాధ్యత అని ఆమె పేర్కొన్నారు. విశాలాక్షి సేవా భావాన్ని స్థానికులు, జనసేన నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు
## షైనింగ్ స్టార్స్ పురస్కారాలు
### ఎమ్మెల్యే, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు




**కూనవరం, జూలై 21, ప్రభాతవార్త :** అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం షైనింగ్ స్టార్స్ పురస్కారాలకు అందించే అవార్డులలో కూనవరం మండలంలోని పలువురు విద్యార్థులు ఈ అవార్డులను అందుకున్నారు. రంపచోడవరంలో మంగళవారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులు అవార్డులను అందుకోవడం జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షేక్ అశ్విన్, జమ్మల సౌమ్య, విద్యార్థినిలకు, కోతులగుట్ట ఏపీ ఆర్ పాఠశాలలో చదివిన బండారు వర్షితలకు ఈ అవార్డులు లభించాయి. అలాగే టేకుల బోరు, మాంటిస్సోరి హై స్కూల్ విద్యార్థిని బొర్రా గౌరీ, శ్రీహరి లు కూడా ఈ అవార్డులు అందుకోవడం జరిగింది. ఈ షైనింగ్ స్టార్ అవార్డులు పొందిన విద్యార్థులకు రూ. 20వేల రూపాయలతో పాటు, ప్రశంశా పత్రాలను అందజేయడం జరిగింది. రంపచోడవరం శాసనసభ్యురాలు మిరియాల శిరీషా దేవి, ఈ అవార్డులను అందజేస్తూ విద్యార్థిని, విద్యార్థులను అభినందించడం జరిగింది. అనంతరం అవార్డులు అందుకున్న విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే శిరీశాదేవి, జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ లు భోజనం చేయడం జరిగింది.

### మహిళలకు రక్షణ కల్పించాలంటూ
## వైసీపీ మహిళలు ఆందోళన...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై21,ప్రభాతవార్త.** కూటమి ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులకు నిరసనగా మంగళవారం అమలాపురం ఈదరపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు, మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీమతి చింతా అనురాధ, జిల్లా వైయస్ఆర్సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వంగా గిరిజ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా చింతా అనురాధ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, వేధింపులు ఆందోళనకరంగా పెరిగిపోయాయని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించడం లో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నేరస్తుల్లో చట్టంపై భయం లేకుండా పోయిందని విమర్శించారు. ఇటీవల గుంటూరులో మహిళను వివస్త్రను చేసిన ఘటన రాష్ట్రాన్ని తలదించుకునేలా చేసిందన్నారు. అయితే ఇది ఒక్క ఘటన మాత్రమే కాదని అనేక ఘటనల్లో ఇప్పటివరకు ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు కనిపించలేదన్నారు. ఈ ఘటనల్లో అధికార కూటమి నేతల పేర్లు వినిపిస్తున్నా ఒక్కరినైనా చట్టపరంగా శిక్షించారా అని అనురాధ ప్రశ్నించారు.వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని గుర్తు చేశారు. దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా దిశ చట్టాన్ని తీసుకొచ్చి మహిళలకు త్వరితగతిన న్యాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేశారని అన్నారు. మహిళలపై జరుగుతున్న ప్రతి నేరంలో బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని, బాధిత మహిళలకు పూర్తి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మహిళల భద్రత విషయంలో విఫలమైన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడిపూడి సూర్యనారాయణ, పాముల రాజేశ్వరి, గన్నవరపు శ్రీను, జున్నూరి రామారావు, చెల్లుబోయిన శ్రీను, కాశి మునికుమారి, సంసాని నాని, కొనుకు గౌతమి గారు, మట్టా శైలజ గారు, రెడ్డి సత్య నాగేంద్రమణి, వైయస్ఆర్సీపీ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆరోగ్య పథక కమిటీలో పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర
### అధ్యక్షులు వెంకటేశ్వర్లు
## నియామకం పై హర్షం...

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూలై21,ప్రభాతవార్త.** ఉద్యోగుల ఆరోగ్య కార్డులకు సంబంధించిన సమస్యలను పరిశీలించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అధికారిక కమిటీలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి. వెంకటేశ్వర్లు ని సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఆరోగ్యం, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పెన్షనర్ల ఆరోగ్య సమస్యలు, వైద్య సదుపాయాలు, నగదు రహిత వైద్య సేవలు, ఆరోగ్య పథకానికి సంబంధించిన అంశాలను అధికారిక కమిటీ దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘంనుంచి సభ్యులుగా చేర్చడం పట్ల నేడు జిల్లా అధ్యక్షులు ఎన్ సి హెచ్ కృష్ణమూర్తి అధ్యక్షతన జిల్లా ప్రధాన కార్యదర్శి కెకెవి నాయుడు ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ హర్షం ప్రకటించింది.

### మహిళను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా..
### విరిగిన విద్యుత్ స్తంభం.



**తాళ్లరేవు, జూలై 21( ప్రభాతవార్త):** జాతీయ రహదారి 216లో కోరంగి వద్ద రోడ్డు దాటే మహిళను తప్పించబోయి అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానిక చర్చి ఎదురుగా జరిగిన ఈ సంఘటనలో తవుడు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ రోడ్డు పక్క కరెంటు స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. దీంతో కరెంటు స్తంభం విరిగి విద్యుత్ తీగలు కింద పడ్డాయి. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులు హుటాహుటీన విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించారు. ఈ సంఘటనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



**రావులపాలెం, జూలై 21 (ప్రభాతవార్త) :** గోపాలపురం అరుంధతీ పేటలో డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ గృహ సముదాయాల మధ్య ప్రవహిస్తున్న నేపథ్యంలో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో నిల్వ ఉన్న మురుగునీటితో దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై స్థానికుల ఫిర్యాదుల మేరకు రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు (నాగు) సోమవారం అరుంధతీ పేటను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి స్థానిక సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ, ప్రజలు మురుగునీటి మధ్య జీవనం సాగించడం బాధాకరమని, రోడ్డు, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికులు కూడా తమ సమస్యలను ప్రత్యక్షంగా వివరించి, త్వరితగతిన పరిష్కారం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

### రెండవ రోజు కొనసాగుతున్న దస్తావేజు లేకర్ల నిరసన:



**జగ్గంపేట జూలై 21 (ప్రభాతవార్త)** ప్రభుత్వం అమలు చేసిన జీవో 396 ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జగ్గంపేట దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఈ నెల 20 నుంచి 31 వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని లేఖర్లు తెలిపారు. దీనిలో భాగంగా జగ్గంపేట లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణ లో మంగళవారం రెండో రోజు కి చేరుకుంది. జీవో నెంబర్ 396కు వ్యతిరేకంగా ఈ నెల 20 తేదీ నుండి 31వ తేదీ వరకు డాక్యుమెంట్ రైటర్లు పెన్ డౌన్ ప్రకటించారు. జీవో నం 396 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో నేటి నుంచి రిజిస్ట్రేషన్ సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన సేవలతో పాటు కక్షిదారుల స్వంత వ్యవహారమైన దస్తావేజుల తయారీ విధానమును కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలకు అప్పగిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 396 ను వ్యతిరేకిస్తూ డాక్యుమెంట్ రైటర్లు పెన్డౌన్ ప్రకటించారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెన్డౌన్ ప్రకటించి నిరసన తెలియజేయడం వలన జగ్గంపేట రిజిస్టర్ కార్యాలయం బోసిపోయింది. ఈ నిరసన కార్యక్రమంలో జోస్యుల రామచంద్రమూర్తి, ముసిరెడ్డి నాగేశ్వరరావు, వాడ్రేపు శ్రీనివాసరావు, రామరాజు సూర్య ప్రకాశరావు ఇంకా అధిక సంఖ్యలో లేఖరులు పాల్గొన్నారు

మరిన్ని వార్తలు 6లో

# ఘనంగా విశ్వ కోయ గోండి భాష దినోత్సవ సంబరాలు... ఎహెచ్ఎస్ నల్లకుంట...



ఎటపాక: జూలై ( ప్రభాత వార్త): మండల పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాల నల్లకుంట ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు ఆధ్వర్యంలో ఘనంగా విశ్వ కోయ గోండి భాషా దినోత్సవం జరుపుకోవడం జరిగింది ఈ సమావేశంలో ఏటీవీ రాష్ట్ర సహాయ అధ్యక్షులు కణితి శేఖర్ హాజరై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 21 వ తారీకు నాడు విశ్వకోయ గోండి భాషను ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీలు ఘనంగా జరుపుకుంటారని కోయ భాషను అధికారిక భాషగా ప్రభుత్వాలు ప్రకటించాలని అన్నారు ప్రతి గ్రామంలో తప్పకుండా కోయ భాష మాట్లాడాలని భాషా సాంస్కృతిని ప్రతి ఒక్కరు పరిరక్షించాలని అన్నారు ఆధునిక ప్రపంచంలో అనేక భాషలు అంతరించిపోతున్నాయని క్రమంలో మన కోయ భాష కూడా అంతరించే ప్రమాదం ఉంది అందువలన మనం తప్పకుండా భాష మాట్లాడాలి మనం మాట్లాడటమే కాకుండా భవిష్యత్ తరాల వారికి కూడా కోయ భాషను అందించే విధంగా ప్రతి ఒక్కరు పాటుపడాలని అన్నారు అనంతరం విద్యార్థులు ఆదివాసి సంస్కృతి సాంప్రదాయంలో భాగమైన వేషధారణతో నృత్య ప్రదర్శన చేయడం జరిగింది ఈ సమావేశంలో ఏ టీ వి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ కణితి రామకృష్ణ, ఏటీవీ మండల అధ్యక్షులు కాక రాజు, పాఠశాల ఉపాధ్యాయులు మట్టం భద్రయ్య,కారం మోహన్ రావు, సోడే వీర్రాజు, సవలం రామకృష్ణ అగ్ని విజయ్ కుమార్, ఉయిక సత్తిబంధు, తెల్లం వెంకటేశ్వర్లు, సోడె కుమార్ సోడె నాగిరెడ్డి, కరక రామదాసు, సోడే సీతారాములు, దుర్గా వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ పై అవగాహన కలిగి ఉండాలి

## పి ఎం పి వైద్యులు సూచన.



అనపర్తి జూలై 21(ప్రభాత వార్త) గ్రామాల్లో ప్రజలు కోవిడ్ పై ఎటువంటి ఆందోళనలు చెందకుండా అవగాహన కల్పిస్తూ ప్రాథమిక వైద్య సేవలందించాలని పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అన్నారు.మంగళవారం కమ్యూనిటీ పారామెడిక్స్&ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్ వెల్ఫేర్ అసోసియేషన్(పి.ఎం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) తూర్పుగోదావరి జిల్లా అనపర్తి, బిక్కవోలు, రాయవరం మండలాల అధ్యక్షులైన మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేశ్వరరావు అధ్యక్షతన పొలమూరు శ్రీదేవి ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు,రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా మరల కోవిడ్ వ్యాధి వస్తుందనే ప్రకటనలకు వివిధమైన ఆందోళనలు చెందకుండా ప్రజలకు కోవిడ్ పై అవగాహన కల్పిస్తూ ప్రథమ చికిత్సలందించాలని సూచించారు.ఈ సదస్సులో రాజమండ్రికి చెందిన గోదావరి న్యూరో,కార్డియాక్ ఎమర్జెన్సీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ గీతా శ్రావణ్ మాట్లాడుతూ మెదడుకు సంబంధించిన రుగ్మతలను,నెప్పులపాము సంబంధించిన రుగ్మతలు ఎలా గుర్తించాలో తెలిపారు. ముఖ్యంగా బ్రెయిన్ స్ట్రోక్ ను ముందుగా గుర్తించగల్గితే పక్షవాతం బారినపడకుండా కాపాడవచ్చని అన్నారు.గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ నేటి జీవనశైలిలో మార్పుల వల్ల గుండెకు సంబంధించిన రుగ్మతల గురించి,కార్డియాక్ అరెస్ట్, గుండెపోటుల గురించి వివరించారు. ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్ సుధాకర్ మాట్లాడుతూ వర్షాకాలంలో కాలానుగుణంగా వచ్చే వైరల్ ఫీవర్ల గురించి,ఒమిక్రాన్ ఆరిఫ్ 5 వేరియంట్ తో వస్తున్న కోవిడ్ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,జిల్లా కార్యదర్శి పి దేవానందం,మండల కార్యదర్శి డి సాయి రామారెడ్డి,కోశాధికారి డీఎమ్ వెంకటపతి రాజు,రాయవరం ఎంపీపీ వర్ల రమణ, పిపి సుబ్రహ్మణ్యం, పీవీఎల్ నారాయణ,కేవీఎస్ఎన్ మూర్తి,ఎవిఎస్ చలం,తిరుమల రావు, పేక బాబ్జీ, శివకృష్ణ,దుంతా జగదీష్ లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.అనంతరం వైద్యులను సభ్యులు ఘనంగా సత్కరించారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న ఏ డి ఏ




కె. గంగవరం జూలై 21,(ప్రభాతవార్త): కె గంగవరం మండలం కుందూరు, తామరపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ఏవో సత్యమూర్తి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సహాయ శాఖ సంచాలకులు రామచంద్రపురం ఎం అరుణ మాట్లాడుతూ వరి నాట్లు వేసే, పంట రుణం తీసుకోని రైతులందరూ తప్పనిసరిగా ఆగస్టు 15 నాటికి స్వయం ధ్రువీకరణ పంట పత్రం, పట్టాదారు జిరాక్స్ లేదా కౌలు కార్డు జిరాక్స్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, ఆధార్ జిరాక్స్ లతో దగ్గరలోని మీ సేవ కేంద్రాల్లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పంట బీమా నమోదు చేసుకోవాలని,దీనికి గాను ఒక ఎకరానికి 76 రూపాయలు నామమాత్రపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి తగు రశీదు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి [illegible] సుబ్రమణ్యం, వివిఏ రేవతి ఏఈఓ హేమంత్, తేజ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# అంబటి వ్యాఖ్యలకు నిరసనగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుల ధర్నా




రావులపాలెం, జూలై 21 (ప్రభాతవార్త) : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు సోమవారం రావులపాలెంలో ధర్నా నిర్వహించారు. ఎంఎస్పీ కొత్తపేట నియోజకవర్గ ఇన్చార్జి కాపా నాగరాజు ఆధ్వర్యంలో కోనసీమ ముఖద్వారం వద్ద ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి రాంబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ధర్నాలో భాగంగా ఆయన దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్కు తరలించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి సూరి మాదిగ మాట్లాడుతూ, దళిత వర్గానికి చెందిన హోంమంత్రిని అవమానించేలా మాట్లాడటం తగదన్నారు. హోంమంత్రి అనితపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అంబటి రాంబాబు బేషరతుగా క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు, నవరపు భైరవమూర్తి, కోడమంచిలి చిరంజీవి, ఇంటపల్లి సాయి, బత్తుల సాయి, రమేష్, యార్లగడ్డ మమ్ము, యార్లగడ్డ చంటి, దిగుమర్తి దుర్గాప్రసాద్, గంధం యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా సమస్యను పట్టించుకోవడం లేదు



యు.కొత్తపల్లి, జూలై 21 (ప్రభాతవార్త) : నాటు సారా సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని పాత ఇసుకపల్లి ప్రజలు ప్రజాసంఘాల దృష్టికి తీసుకురావడం జరిగిందని కేవీపీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో మంగళవారం సామాజిక శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ఉన్న ఒక్క పాఠశాల మూసివేయడంతో విద్యార్థులు అవస్థలు, డ్రైనేజీలు లేవని, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు కావడం లేదని, సారా సమస్య అధికంగా ఉన్నాయని తమ తెలియచేశారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో కె. నాగేశ్వరరావు, ఎం. సూరిబాబు, వి. వాసు, డి. సోమరాజు, బి. సువర్ణ, ఎన్. స్వరూప తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్యే నానాజీ చొరవతో గుంతలరోడ్డుకు మోక్షం



కాకినాడ రూరల్, జూలై 21(ప్రభాతవార్త): ప్రభుత్వ జిబిఐ కళాశాల వెనుక గుంతల మయంగా ఉన్న రోడ్డు కు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో మోక్షం లభించింది. ప్రభుత్వ కార్యక్రమాలు ముగించుకుని ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే నానాజీ వెళుతుండగా రోడ్డు దుస్థితి స్వయంగా గమనించారు. ముత్తా వారధి కి వెళ్లే రహదారి కొంత భాగం పూర్తిగా దిబ్బలై వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం ప్రత్యక్షంగా చూసిన రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చొరవ తీసుకుని ఆ రోడ్డును గ్రావెల్ తో చదును చేయించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడంతో ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తున్న విద్యార్థులు, వాహనదారులు , స్థానిక ప్రజలు ఎమ్మెల్యే నానాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

# మారుమూల ప్రాంతాల్లో మొబైల్ సేవల మెరుగుదలకు చర్యలు.

## చింతూరు ఐ టి డి ఏ ప్రాజెక్ట్ అధికారి శుభం నోఖ్వాల్



చింతూరు జూలై 21 ప్రభాత వార్త. మారుమూల గ్రామాలలో మొబైల్ సేవలు మెరుగుదలకు చర్యలు చేపడుతున్నట్లు చింతూరు ఐ టి డి ఏ ప్రాజెక్టు అధికారి శుభం నొఖ్వాల్ పేర్కొన్నారు. మంగళవారం చింతూరు ఐ టి డి ఏ కార్యాలయంలో జిఓ , ఎయిర్టెల్ ,బి ఎస్ ఎన్ ఎల్ టెలికాం సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు, గ్రామీణ మరియు మారుమూల ప్రాంతాల్లో మొబైల్ నెట్వర్క్ సేవల ప్రస్తుత పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో తగిన మొబైల్ నెట్వర్క్ అందుబాటులో లేకపోవడం వల్ల విద్య, వైద్య, బ్యాంకింగ్, అత్యవసర సేవలు, అలాగే ఇతర ఆన్లైన్ ప్రభుత్వ సేవలను ప్రజలు వినియోగించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టెలికాం సంస్థల ప్రతినిధులకు వివరించారు. దీనిపై స్పందించిన ప్రాజెక్ట్ అధికారి, నెట్వర్క్ సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి, అక్కడ కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన మొబైల్ మరియు ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ముఖ్యంగా 5+ సేవలను దశలవారీగా విస్తరించేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని టెలికాం సంస్థ ప్రతినిధులకు సూచించారు. టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన అనుమతులు, భూకేటాయింపు లేదా ఇతర ప్రభుత్వ సహకారం అవసరమైతే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల ప్రజలు నిరంతరాయంగా నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, డిజిటల్ సేవలు ప్రతి గ్రామానికి చేరేలా సమన్వయంతో చర్యలు కొనసాగిస్తామని ప్రాజెక్ట్ అధికారి స్పష్టం చేశారు.

# ఆపదలో అండగా రాంజీ.. నిరుపేద కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం




కడియం, జూలై 21 ( ప్రభాతవార్త) ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ మాజీ సర్పంచ్ పాలంశెట్టి వెంకట రామారావు (రాంజీ) మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. కడియం మండలం కడియపులంక గ్రామానికి చెందిన సక్కా అనంతలక్ష్మి భర్తను కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న విషయం స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న రాంజీ, ఆమెను తన క్యాంపు కార్యాలయానికి పిలిపించి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు రూ.10 వేల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆమెకు వితంతు పింఛన్ మంజూరయ్యేలా అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. తన కష్టసమయంలో ఆర్థికంగా ఆదుకున్న రాంజీకి జీవితాంతం రుణపడి ఉంటానని అనంతలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ ముందుండే రాంజీ నిరుపేద ముఖాల్లో చిరునవ్వులు నింపేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని గ్రామస్తులు, స్థానిక నాయకులు అభినందించారు. ఆయన సేవా దృక్పథం పలువురికి ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు.

# అశ్రు నయనాలతో బీబీ సకీనా షహాదత్



మామిడికుదురు.జూలై 21(ప్రభాతవార్త) ముస్లిం మతస్తుల ఆరాధ్యదైవం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ తనయురాలు బీబీ సకీనా షహాదత్ (వర్ధంతి)ని నగరం బీబీ సకీనా పీర్ల పంజా వద్ద సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ నుండి విచ్చేసిన మౌలానా హాఫిజ్ మొహమ్మద్ రజా రిజ్వి భక్తులకు నాటి కర్బలా పుణ్యభూమిలో ఇమామ్ హుస్సేన్ కుటుంబీకులపై జరిగిన దాడిని యదార్ధ ఘటనలను వివరించారు. నాలుగేళ్ల చిన్నారి బీబి సకీనా కర్బలా( ఇరాక్) నుండి షామ్ కు నేటి (సిరియా) కు యజీద్ సైన్యం తీసుకు వెళ్లి అక్కడ చేసిన కిరాతకమైన దాడిలో జిందాన్ కారాగారంలో తన తండ్రి ఇమామ్ హుస్సేన్ ను తలుచుకుంటూ నీళ్లు లేక అలమటిస్తూ అశువులు బాసినట్లు తెలిపారు.అనంతరం బీబీ సకీనా పీరును గుర్రం పై తీసి మాతం చేస్తూ(గుండెలు బాదుకుంటూ) ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ముస్లిం సోదరులకు పలు స్థానిక భక్త బృందాల ఆధ్వర్యంలో రెండు రోజులు భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు.గురూహే తాజ్దారే వఫా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో తాటాకు ఇల్లు దగ్ధం



మామిడికుదురు.జూలై 21(ప్రభాతవార్త) మామిడికుదురు శివారు గాలిదేవరపాలెంలో మంగళవారం తాటాకు ఇల్లు దగ్ధం అయ్యింది. కాట్రేనిపాడు సత్యవతికి చెందిన ఇల్లు మొత్తం కాలిపోవడంతో కుటుంబసభ్యులు కట్టు బట్టలతో మిగిలారు. రజక కుటుంబానికి చెందిన సత్యవతి కుల వృత్తి చేసుకునే నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.ఆస్తి నష్టం సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అంచనా వేశారు.రాజోలు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీ చార్జి చేయడాన్ని నిరసిస్తూ

## రాజమండ్రిలో విద్యార్థులు నిరసన ప్రదర్శన

### మద్దతు తెలిపిన మాజీ ఎంపీ హర్ష కుమార్





రాజమహేంద్రవరం సిటీ, జూలై 21( ప్రభాతవార్త) నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేయడానికి నిరసిస్తూ రాజమండ్రి లోని రాజీవ్ గాంధీ విద్యాసంస్థ విద్యార్థులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక గణేష్ చౌక్ వద్ద నుంచి గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ నిరసన ప్రదర్శనకు మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ మద్దతు తెలిపి మాట్లాడుతూ విద్యార్థులపై కర్కశముగా లాఠీచార్జ్ చేయడం దారుణమని మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేస్తేనే నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు బయటపడతాయని ఈ విషయంలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కు కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని అలాగే విద్యార్థులకు మద్దతుగా ఆందోళన చేస్తున్న సోనం వెంటనే ఆసుపత్రి నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి రాజీనామా చేయాలని విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవి సుందర్ జీవి శ్రీ రాజ్ విద్యార్థులు కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

# సత్యం త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



రామచంద్రపురం, జూలై 21 (ప్రభాతవార్త): శస్త్రచికిత్స చేయించుకున్న సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వాసంశెట్టి సత్యం త్వరగా కోలుకుని తిరిగి ప్రజాసేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ పట్టణంలోని రాజగోపాల్ సెంటర్లో ఉన్న శ్రీ సీతారామ భక్త వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం జనసేన నాయకులు,జనసైనికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రసాదాన్ని సత్యం నివాసానికి వెళ్లి ఆయనకు అందజేసి సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 7, 8, 9, 10, 11 వార్డుల జనసైనికులతో పాటు జనసేన పట్టణ నాయకులు అక్కిరెడ్డి శ్రీనివాస్, తాడిమల్ల సత్తిబాబు,దొడ్డ దుర్గాప్రసాద్,పడాల బాబి, ఆరంకోటి ఆనంద్, చిక్కం శ్రీను, కుంచే పోతురాజు, ఏనుగు వంశీ ప్రకాష్,టీడీపీ నాయకుడు పడాల శ్రీనివాస్,ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వరి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



సీతానగరం, జూలై 21, (ప్రభాతవార్త): జిల్లాలో ప్రస్తుత ఎల్నీనో పరిస్థితులలో అడపాదడపా వర్షాలు, అధిక ఉష్ణోగ్రతల వల్ల సార్వా వరి, కూరగాయల పంటలలో చీడపీడలు ఎక్కువ అయ్యే అవకాశం ఉందని, రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. మంగళవారం రాపాక గ్రామంలోని సొసైటీ వద్ద నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని వరి పంటలో చీడపీడల నివారణకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మొవ్వ పురుగు, ఆకునల్లి, ఎండాకు తెగులు, ఎలుకల నివారణకు చేపట్టాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలతో పాటు ఇన్ఛార్జి జిల్లా వ్యవసాయాధికారి కె. సూర్యరమేష్, ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయాధికారి గౌరీదేవి, సొసైటీ చైర్మన్ నాగారపు సత్యనారాయణమూర్తి, ఏఈఓ గురుప్రియ, విఏఏ ప్రవీణ్, అచ్యుత్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత.. ఎమ్మెల్యే గిడ్డి..



అంబాజీపేట,జూలై21, (ప్రభాతవార్త): విద్యార్థుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.మండలంలోని గంగలకుర్రు సమీకృత సంక్షేమ బాలుర వసతి గృహంలో వసతి పొందుతున్న 94 మంది విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన మెటీరియల్ కిట్లను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ రాష్ట్ర విద్యాశాఖా మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి విద్యాశాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నారన్నారు.ముఖ్యంగా హాస్టల్లో ఉండే విద్యార్థులకు తోడ్పాటునందిస్తూ హాస్టళ్ల ఆధునీకరణ,పరిశుభ్రమైన తాగునీరు సౌకర్యం,మెరుగైన మౌలిక వసతులు కల్పి స్తున్నారన్నారు.దీనిలో భాగంగా విద్యార్థులకు అవసరమైన రగ్గు, దుప్పటి, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్, టర్కీ టవల్,గ్లాసు,ప్లేటు,కప్పు అందజేస్తున్నామన్నారు.హాస్టల్ కు అవసరమైన మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు.విద్య విషయంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని విద్యార్థులకు సూచించారు.అనంతరం విద్యార్థులతో ముచ్చటించి,వారితో ఫొటోలు దిగారు.హాస్టల్ అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్.సత్యనారాయణ,వార్డెన్ బి. ఎం.యు.సత్యనారాయణల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ను ఘనంగా సత్కరించారు.అంతకుముందు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపఠంనకు పూలమాలను వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కో- కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు,బొంతు పెదబాబు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి,సొసైటీ చైర్మన్ అల్లాడ రవి,ఎంపీటీసీ నెల్లి ఏడుకొండలు,నాయకులు గణపతి వీర రాఘవులు, యర్రంశెట్టి వీరభద్రరావు,కాగితాపల్లి సాయిరామ్,కాగితాపల్లి సుబ్బారావు,నెల్లి చిన వెంటేశ్వరరావు,అధికారపు బాబ్జీ,మైపాల తాతాజీ,కురసా అంజి,దొమ్మేటి సాయికృష్ణ,దొమ్మేటి రామారావు, పత్తి దత్తుడు,ఓరుగంటి వెంకటరావు, కొప్పినేడి ఈశ్వరరావు, పేరాబత్తుల సుబ్బరాజు, ఉందుర్తి నాగబాబు తదితరులు పాల్గొన్నారు

# చిన్న జగ్గంపేటలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

## ఆరుతడి పంటలే ప్రత్యామ్నాయం శాస్త్రవేత్త డాక్టర్ శర్మ

## ఈనెల 24లోగా ప్రత్తి పంటకు బీమా కట్టాలి ఏడీఏ స్వాతి



గొల్లప్రోలు, జూలై 21,(ప్రభాతవార్త) గొల్లప్రోలు మండలం చిన్న జగ్గంపేట గ్రామంలో మంగళవారం 'ఆత్మ' సంస్థ సౌజన్యంతో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పిఠాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి.స్వాతి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ. సీతారామ శర్మ,ఐ.సుధీర్,జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి డి.సంజీవ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీతారామ శర్మ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.కాబట్టి మెట్ట ప్రాంత రైతులు తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలైన అపరాలు, రాగులు,కొర్రలు,మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.అనంతరం పిఠాపురం ఏడీఏ పి.స్వాతి మాట్లాడుతూ ప్రత్తి పంట సాగు చేసే రైతులకు వాతావరణ ఆధారిత పంటల బీమా గడువు ఈనెల 24వ తేదీతో ముగుస్తుందని తెలిపారు.రైతులు ఎకరాకు రూ.2,000 చొప్పున మీసేవ కేంద్రాల్లో లేదా ఏదైనా బ్యాంకులో బీమా ప్రీమియం చెల్లించాలని కోరారు.ఒకవేళ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.40,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన అధికారి వై.సోమరాజు శేఖర్,మండల వ్యవసాయ అధికారి కేవీవీ.సత్యనారాయణ,స్థానిక రైతు సేవా కేంద్రం (ఆర్బీకే) సిబ్బంది,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# భద్రవరం గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



ఏలేశ్వరం, జులై 21, (ప్రభాతవార్త) ఏలేశ్వరం మండలం భద్రవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శంకుస్థాపన చేశారు.మండల పరిషత్ నిధుల నుంచి రూ.8 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జనసేన నేత మేడిశెట్టి బాబీ శంకుస్థాపన చేశారు.అనంతరం గ్రామంలోని శివాలయం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాండ్ బోర్ను ఎమ్మెల్యే ప్రారంభించారు.గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,మండల పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు,ఎంపీడీవో రామరాజు వర్మ, స్థానిక నాయకులు జిగాటపు సూరిబాబు,కొప్పుల బాబ్జి,బొదిరెడ్డి గోపి,పసల సూరిబాబు, సూతి బూరయ్య,బస్వా మహాలక్ష్మి ప్రసాద్,మైరాల కనకారావు,బ్యాంకు రాజు,నూకతాటి ఈశ్వరుడు,చిక్కాల లక్ష్మణరావు,బుద్ధ ఈశ్వరరావు,గంగిరెడ్ల మణికంఠ,మాగాపు వీరబాబు,పలివెల శ్రీనివాస్,పలివెల వెంకటేష్,బొట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# యానాం ఎస్టిపి ప్లాంట్కి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం



తాళ్లరేవు, జూలై 21( ప్రభాతవార్త): ఆంధ్ర ప్రాంతానికి చెందిన కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట-పుదుచ్చేరి రాష్ట్రం యానాం సరిహద్దులో యానం ప్రభుత్వం నిర్మాణం చేస్తున్న మురుగు నీటి శుద్ధి కర్మాగారం (ఎస్ టి పి ప్లాంట్)కు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని చేపడతామని ప్రజా సంఘాల నాయకులు అన్నారు. ప్లాంట్ నిర్మాణంపై ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో పలు సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. ఇప్పటివరకు సరిహద్దుల్లో నిర్మాణం చేస్తున్న ప్లాంట్ స్థలం పై ఇరు రాష్ట్రాల అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం దారుణం అన్నారు. స్థలం పై స్పష్టత లేకుండా నిర్మాణాలు ముందుకు సాగడం దానికి మన కాకినాడ జిల్లా యంత్రాంగం మద్దతు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆంధ్ర ప్రాంతంలో నిర్మాణం చేసే యానాం ప్లాంట్ కోసం మన రెవెన్యూ యంత్రాంగం 144 సెక్షన్ విధించడం, పోలీసులు కొందరు అఖిలపక్ష నాయకులను, అందులోనూ మెజారిటీ అధికార పార్టీ నాయకులను అరెస్టు చేయడం వింతగా ఉందన్నారు. దీనిపై ఇరు రాష్ట్రాల ప్రజా ప్రతినిధులు స్పందించి స్థలం ఎవరిది అనేది సర్వే చేయించాలని కోరారు. స్థలం ఎవరిదైనా అక్కడ ప్లాంట్ పెట్టడం వల్ల ఆ ప్రాంత ప్రజానీకంతో పాటు జాతీయ రహదారి వెంట వెళ్లే అనేకమంది ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. దీనిపై కోర్టు కేసులు, పూర్వపు సరిహద్దు సర్వేలు తదితర ఆధారాలతో కరపత్రాలు ముద్రించి జార్జి పేట, పోలేకుర్రు, నీలపల్లి, పి. మల్లవరం గ్రామాలలో ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అఖిలపక్ష పార్టీల నాయకులు, ప్రజలందరి మద్దతుతో పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్లాంట్ నిర్మాణం అడ్డుకోవాలని ప్రజా సంఘాలు తీర్మానించారు. ఈ సమావేశంలో ఎండియూడబ్ల్యూఏ మండల అధ్యక్షులు కన్నీడి వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుప్పి అదృష్టదీపుడు, కెవిపిఎస్ మండల కన్వీనర్ విప్పర్తి శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు గంధం రాంబాబు, కనకాల సత్తిబాబు, ధూళిపూడి నాయుడు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోడి భాస్కరరావు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి ప్రతిభావంతులకు ఎమ్మెల్యే సత్యప్రభ ఘన సన్మానం



ఏలేశ్వరం, జూలై 21, (ప్రభాతవార్త) సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు.ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సౌజన్యంతో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ,జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ చేతుల మీదుగా విద్యార్థులకు మెమెంటోలు, అందించారు, సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ నుండి విద్యార్థులకు సుమారు 60 వేలు నగదును అందజేశారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన తల్లిదండ్రులు,ఎంఈవోలు,పాఠశాల ప్రధానోపాధ్యాయులను కూడా ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతుందని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి చదివి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం,ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమని పేర్కొన్నారు.విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న సీతా ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జిని పలువురు గ్రామాల నాయకులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో కె కీర్తి,ఎంపీడీవో రామరాజు వర్మ,ఎంఈవోలు ఎం అబ్బాయి,వరలక్ష్మి,మండల పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు,ఏలేశ్వరం టౌన్ నాయకులు అలమండ చలమయ్య,బొదిరెడ్డి గోపి,గట్టెం వెంకటరమణ,రూరల్ నాయకులు పసల సూరిబాబు,సూతి బూరయ్య,బస్వా మహాలక్ష్మి ప్రసాద్,మైరాల కనకారావు,బ్యాంకు రాజు,నూకతాటి ఈశ్వరుడు,చిక్కాల లక్ష్మణరావు,వణుం మంగ,అలర్క రాజు,కొప్పుల బాబ్జి,జిగటాపు సూరిబాబు,బుద్ధ ఈశ్వరరావు,గంగిరెడ్ల మణికంఠ,మాగాపు వీరబాబు,పలివెల శ్రీనివాస్,పలివెల వెంకటేష్,బచ్చల నాగశివ,కన్నబాబు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

## జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్, జూలై 21 ప్రభాతవార్త: రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పేరుతో వ్యవస్థను ప్రైవేటుపరం చేసే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉపసంహరించుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్ వ్యవస్థను దశలవారీగా ప్రైవేటుపరం చేసే ప్రయత్నం జరుగుతోందని వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి ఆరోపించారు. ఈ నిర్ణయానికి నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా డాక్యుమెంట్ రైటర్లు చేపట్టిన పెన్డౌన్ ఆందోళనకు ఆమె సంఘీభావం ప్రకటించారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్ వ్యవస్థతో ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్న వేలాది మంది డాక్యుమెంట్ రైటర్లు, వారి కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా ఈ రంగంలో అనుభవం ఉన్న వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రస్తుతం డాక్యుమెంట్ రైటర్ల పెన్డౌన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా భూములు, ఇళ్లు, స్థలాల క్రయవిక్రయాలు నిలిచిపోయి కొనుగోలుదారులు, విక్రేతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలు నిలిచిపోవడంతో ప్రభుత్వానికి వచ్చే స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలోని ఆదాయం కూడా తగ్గిపోతోందని పేర్కొన్నారు. ప్రజల భూములు, ఆస్తులకు సంబంధించిన అత్యంత కీలకమైన రిజిస్ట్రేషన్ వ్యవస్థను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏవైనా తప్పులు, అవకతవకలు లేదా మోసాలు జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఉండే జవాబుదారీతనం, చట్టబద్ధమైన బాధ్యత ప్రైవేటు ఉద్యోగులకు ఎలా ఉంటుందని నిలదీశారు. ఒకప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్పై ప్రజల భూములు పోతాయని తీవ్ర ఆరోపణలు, విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు, ఇప్పుడు రిజిస్ట్రేషన్ వ్యవస్థనే ప్రైవేటు సంస్థల చేతుల్లోకి అప్పగించే విధానాన్ని ఎలా సమర్థించుకుంటారని ప్రశ్నించారు. అప్పట్లో ప్రజలను భయాందోళనలకు గురిచేసిన వారు, ఇప్పుడు అదే ప్రజల ఆస్తుల భద్రతపై ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. పాస్పోర్ట్ సేవా కేంద్రాల తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు కూడా పనిచేస్తాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని నాగమణి విమర్శించారు. పాస్పోర్ట్ వ్యవస్థ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో, కఠినమైన భద్రతా ప్రమాణాలతో నడుస్తుందని, భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లను అదే విధంగా పోల్చడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రభుత్వ సేవలను ప్రైవేటీకరిస్తూ వస్తున్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖను కూడా అదే దారిలో నడిపించాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలను బలోపేతం చేయాల్సిన బాధ్యతను విస్మరించి, ప్రైవేటు సంస్థలకు అవకాశాలు కల్పించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. డాక్యుమెంట్ రైటర్లతో ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం: మంత్రి సుభాష్



రామచంద్రపురం, జూలై 21(ప్రభాతవార్త): మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగితేనే కుటుంబం,సమాజం బలోపేతం అవుతుందని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో,ఆర్సెటీ సహకారంతో రామచంద్రపురంలోని స్త్రీశక్తి భవన్లో సోమవారం నిర్వహించిన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు నిర్వహిస్తున్నామని తెలిపారు.టైలరింగ్లో ఆధునిక మెళకువలు, కుట్టు యంత్రాల వినియోగం,దుస్తుల తయారీతో పాటు స్వయం ఉపాధిపై అవగాహన కల్పిస్తామన్నారు.శిక్షణ పూర్తిచేసిన వారికి బ్యాంకు రుణాల అనుసంధానంతో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి.రాంబాబు మాట్లాడుతూ 30 రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామని ఆయన తెలిపారు.అనంతరం మహిళలకు శిక్షణ కిట్లను మంత్రి పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఎల్డీఎం కేశవ వర్మ, ఆర్సెటీ డైరెక్టర్ రమణ,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్,జనసేన నియోజకవర్గ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి,కూటమి నాయకులు,మహిళలు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps